


గురువులు

రమణ మహర్షి

రమణ శరణాగతి





సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం మహానుభావులైన **తెలుగు భక్తి** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **తెలుగు భక్తి** వారి వెబ్ సైట్: http://www.telugubhakti.com/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో **తెలుగు భక్తి** వెబ్ సైట్ వారు అందించటం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు వారికి గలవు,కనుక వారిని సంప్రదించగలరు.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

తెలుగు భక్తి వారి వెబ్ సైట్:

http://www.telugubhakti.com/



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.




రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014



రమణ శ్శరణాగతి

కోటంరాజు శ్రీనివాసరావు

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

ముందుమాట

– కోటంరాజు శ్రీనివాసరావు

మా ఇలవేల్పు శ్రీ షిరిడీసాయినాథుడు. మా గురుదేవులు మహాభాష్యం రంగాచార్యులవారు. ఈ ఆధ్యాత్మిక దారిని చూపిన సద్గురువు శ్రీసాయి మరియు గురువు శ్రీ మహాభాష్యం రంగాచార్యుల వారి వలన అను నిత్యము సాయిపూజలు, ఆరతులు మరియు అనేక గ్రంథములు చదువగలిగాము మా దంపతులము. వారి అనుగ్రహంచే మరియు శ్రీ పరిటాల గోపీకృష్ణగారి (ఢిల్లీ వ్యాస్తవ్యులు) సహాయముతో వారు నన్ను అరుణాచలమునకు 2009 నవరాత్రులలో తీసుకువెళ్ళి గిరి ప్రదక్షిణ చేసినాము. మా దంపతులము రమణ మహర్షుల వారి పుస్తకములు అంటే ఎంతో ఇష్టపడేవాళ్ళము. అప్పుడప్పుడు హైద్రాబాద్‌లోగల రమణాశ్రమమునకు కూడా వెళ్ళేవాళ్ళము. ఒకరోజు నా భార్య చి॥ల॥ సౌ॥ శ్రీమతి కనకదుర్గ తనకు ఒకరోజు రాత్రి పడుకున్న తరువాత రమణాగతి, రమణాగతి అని ఎవరో చెప్తునట్లు...అది స్వప్నము కాదు, జాగృతి అని కూడా అనలేము. అలాంటి స్థితిలో జరిగిన అనుభవము నాకు చెప్పి శ్రీ భగవాన్ రమణమహర్షిపై వ్రాయమని కోరగా అది జరిగేపని కాదని తలచాను. నెలరోజులపైగా జరిగిన పిదప ఒకరోజు నా మనస్సులో భగవద్గీతలో దైవీహ్యేషాగుణమయి... 7వ అధ్యాయం, 14వ శ్లోకానికి వచ్చినచో మరియు నా ఇష్టదైవమైన సాయి ఫోటో రూపంలో వస్తే బాబా ఆశీస్సులుగా భావించి మొదలుపెడతానని అనుకున్నంతనే అదే రోజు భగవద్గీత పుస్తకం చదువుటకు తీయగా నేను కోరిన శ్లోకం రావటం, అదేరోజు శేజ్‌ఆరతి ప్రారంభించే సమయాన మిత్రులు శ్రీ నాగమల్లేష్ బాబా క్యాలెండర్ పెద్దది తెచ్చి ఇవ్వటం జరిగాయి. వెంటనే అది బాబా ఆశీస్సులుగా భావించి ఈ రమణ శ్శరణాగతి ప్రారంభించాను. ఇది వ్రాస్తుండగా భగవాన్ రమణమహర్షిలవారు స్వప్నములో పూర్తిగా కప్పుకుని పడుకుని ఉన్నట్లు దర్శనమిచ్చారు. ఆ స్వప్నములో ఒక గ్రామము, ఆ గ్రామములో, నులకమంచముపై దుప్పటి కప్పుకున్న ఒక వ్యక్తిని చూచి ఎవరు వారని ఆ గ్రామస్తులను స్వప్నమందే అడుగగా, ఆ పడుకొనినవారు సాక్షాత్ భగవాన్ రమణులేనని చెప్పారు. ఈ యజ్ఞము పూర్తికావటానికి సద్గురువు మా గురుదేవుల ఆశీస్సులవలననే జరిగినది. మా తండ్రిగారు శ్రీ కోటంరాజు జనార్ధనరావుగారు డిసెంబర్ 30, 2009న స్వర్గస్తులైనారు. ఆ రోజు తారీఖుల ప్రకారం భగవాన్ రమణమహర్షి జయన్తి. ఈ రమణ శ్శరణాగతి పుస్తకము నా గురుదేవులు శ్రీ మహాభాష్యం రంగాచార్యులగారికి అంకితం చేసుకుంటు వారి దివ్యపాదములకు నమస్కరిస్తున్నాను. శ్రీ భగవాన్ ఏప్రియల్ 14, 1950 సం॥న నిర్యాణము చెందినారు – వారి జ్ఞాపకార్థముగా ఈ **'రమణ శరణాగతి'**

సర్వేజనాః సుఖినోభవన్తు

రమణ శ్మరణాగతి

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము - 1

శరణాగతి

“శరణు” అనగా రక్షణ కొరకై వేడుకొనుట. రక్షణ ఇచ్చేవాడు భగవంతుడు. సాధారణముగా మానవుడు తనకు ఆపదలు కలిగినపుడు తట్టుకొనలేక తన ఇష్ట దైవమును రక్షణ కొరకు వేడెదరు. మరికొందరు తమ కోరికలు నెరవేరుటకై భగవంతుడిని శరణు వేడెదరు. ఇంకొందరు వారు చేసే కర్మలలో లేదా కార్యములలో ఫలము కొరకు భగవంతుని వేడుకొనుచు ఫలితము కొరకు ఎదురు చూసేవారును ఉన్నారు. కర్మ చేసి ప్రతి ఫలాపేక్షను ఆశించేవారూ ఉన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే, ఎన్నో రకాల కోరికలతో మానవుడు భగవంతుడిని శరణు వేడుచున్నారు. వారి కోర్కెలు నేరవేరగానే, భగవంతుడు ఉన్నాడు. మనల్ని రక్షిస్తున్నాడు అనే భావనలతో సంతృప్తి చెందేవారు ఉన్నారు. అనన్య శరణాగతి వేడిన భక్తుడు దేని గురించి ఆలోచించకుండా భయపడకుండా ఉండవలెను. కారణం శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పినట్లుగా సర్వధర్మ ఆశ్రమములను విడిచిన భక్తుడు ఆ కృష్ణునికి శరణు పొందిన పిదప ఆ పరమాత్ముడు తనను నమ్ముకున్న భక్తుడి సమస్త పాపముల నుండి రక్షించెదదు.

అట్లు అనన్య శరణాగతుడు అయిన భక్తుడు ఒకవేళ తన కార్యములలో ఎటువంటి మార్పు రాకపోయినను చింతించక దానికి గల కారణము, బాధ్యత అంతయు తను నమ్ముకున్న భగవంతుడి బాధ్యతే అని దృఢ విశ్వాసముతో చింతా రహితుడై ఉండవలెను. **ఒక్కసారి భక్తుడు శరణు కోరిన పిదప చింతించినచో శరణాగతికే అది కళంకమగును. దానికి గల కారణము తన విశ్వాస లోపమే.**

శరణా గతి వేడిన భక్తుడు యొక్క భావన ఏమనగా తను భగవానుని వాడను మరియు ఆ పరమాత్మ తన వాడని నమ్మకము కలిగియుండును. ఐతే శరీరము అనే భావన కలిగిన ప్రతి జీవికి కోరికలు కలిగి బాహ్య ప్రపంచము, భగవానుడు మరియు అతను వేరు వేరు అని

భావించి ఇంద్రియలోలుడై తన మనస్సు, బుద్ధి, ఇంద్రియములు మరియు శరీరము వాటిపై అతనికి మమకార మేర్పడి తాను బాధలను ఓర్వలేక మరియు రక్షణ కొరకు పరమాత్మను వేడుకొనును. అట్లే తన సుఖముల కొరకు కొన్ని ఇష్టమైనవి భగవానుడిని వేడుకొనును. ఇట్లు ఇష్టా అయిష్టములకు లోనై జీవి సంసారసాగరమునపడి సుఖదుఃఖాలు అనే ఆటుపోట్లుతో తాను ఈదలేక ఐహిక సుఖములకై భగవంతుడిని కోర్కెలతో తాను బాధ పడుటయే కాక చివరికి ఆ పరమాత్ముని కూడా బాధ పెట్టును. జనన మరణ బంధములతో చిక్కుకొనును.

మనస్సు, బుద్ధి, ఇంద్రియములు మరియు శరీరముపై మమకారము పెంచుకొనుటయే తప్పు. ఒక్కసారి భగవానుడికి అనన్య శరణాగతుడైతే సర్వము ఆ పరమాత్ముడికి అర్పించినట్లే. ఆ స్థితిలో మనస్సును, బుద్ధిని ఇంద్రియములను మరియు నా శరీరము అన్ని మరచి ఏమీ లేని వానిగా భావించి "నేనెవడను" అని ప్రశ్న ఒక్కటే గుర్తుంచుకొనిన జీవి శరీరము కాదని మనస్సు, బుద్ధి, ఇంద్రియములు శరీరానికి సంబంధించినవని అవి మినహాయిస్తే మిగిలినవి అదే ఆత్మ చైతన్య, పరమాత్మ. ఇక జీవి, దేవుడు, ప్రపంచము వేరు అనునది ఎక్కడ ? ఉన్నది ఒక్కటే అదే పరమాత్మ. ఇక జీవియే పరమాత్మ అయిన, ఇక శరణు కోరుట దేని కోసము ? ఆస్థితి తెలుసుకోవాలని శరణు వేడవలేను. ఆత్మావలోకన, ఆత్మ సాక్షాత్కారము మరియు ఆత్మ దర్శనము ఇవన్నీ ఒక్కేటే. వీటిని గురించి తెలియాలి అని అనుకుంటే **"నేనెవరను" అనే ప్రశ్నకు జవాబుకై "భగవాన్ శ్రీ రమణ మహర్షి" గారిని శరణు వేడుదాం.** ఆ రమణుడే మనకు శరణాగతి. అందుకే రమణ – శ్శరణా గతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము - 2

రమణావతారం

భగవద్గీత యందు శ్రీకృష్ణ పరమాత్ముడు మహాత్ములు తన ఆత్మ అనియు తన సజీవ ప్రతిమ అనియు తానే వారనియు మరియు వారే తాననియు చెప్పినారు. అలాంటి మహాత్ములలో ఒకరు భగవాన్ రమణ మహర్షి.

తమిళనాడు రాష్ట్రంలో 'తిరుచ్చుళి' అనే గ్రామం మధురకు దగ్గరలో నున్నది. ఆగ్రామములో శ్రీ సుందరమయ్యరుగారు, వారి భార్య అలగమ్మ ఉండేవారు. సుందరమయ్యరుగారు లాయరు. వారి ఇల్లు సత్రము వంటిది. వచ్చే పోయేవారు బంధుమిత్రులతో కళకళలాడు చుండెడిది. ఆధ్యాత్మికతలో పెద్దగా చెప్పుకునే విశిష్టత ఆ కుటుంబము వారికి లేదు. అప్పుడప్పుడు గుడికి వెళ్ళడం, భక్తి చూపటం తప్ప విశేషమైన భక్తి లేదు. సుందరమయ్యరుగాగారి వంశములో అనగా తాతల కాలము నుండి ఒక శాప ప్రభావము వారి కుటుంబమునకు ఉన్నది. అదే మనగా వారి వంశములో అనగా ప్రతి తరములో ఒక్కరు సంసార జీవితాన్ని త్యజించెదరని అదే విధముగా సుందరమయ్యరు పెద్ద తండ్రులలో ఒకరు కాషాయ వస్త్రాలు ధరించి సన్యసించినారు. ప్రతి తరములోను ఒక సన్యాసి ఉద్భవిస్తూ వచ్చారు. సుందరమయ్యరు గారికి ముగ్గురు కుమారులు. ఒకరు నాగస్వామి **రెండవ వారు వెంకట రామన్ (భగవాన్ రమణ మహర్షి)** ఆఖరి వారు నాగ సుందరుడు. సుందరమయ్య గారు ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు తన వంశాచార శాపవ ప్రభావముచే శాపగ్రస్తుడు అవుతాడని అనుమానము ఉండెడిది.

1879 వ సం॥ము డిసెంబరు 30వ తేదీ అర్ధరాత్రి భగవాన్ రమణ మహర్షి అవతరించినారు.ఆ రోజు పునర్వసు నక్షత్రం. యావత్ ప్రపంచానికే వెలుగు చూపుటకై ఆత్మ అవలోకనము గురించి విశదీకరించుటకై ఒక సామాన్యమైన కుటుంబములో భగవాన్ రమణుడు జన్మించినారు. తండ్రియగు సుందరమయ్యరు ఆ బిడ్డకు వెంకట రామన్ అను పేరు పెట్టినారు.

చిన్నతనము నుండి ఎటువంటి విశేషమైన చర్యలు చూపలేదు. మామూలు బాలుడి లాగ ప్రవర్తించినారు. తన అన్న నాగ స్వామి మరియు తమ్ముడు నాగసుందరుడు ఈ ముగ్గురులో ఎవరు శాపగ్రస్తుడు ఆవుతారోనని తండ్రి భాద, కాని 1896 వరకు కూడా ఈ ముగ్గురు, కొంత అయినా ఆధ్యాత్మిక వికాసము చూపలేదు.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము - 3

బాల్యములో రమణుడు

వెంకట రామన్ కు తండ్రి తన తండ్రి సుందరమయ్యరు వారి ఇంటి దేవుడు శ్రీ వేంకటేశ్వరుడు అగుటచే వెంకట రామన్ అనే పేరు పెట్టినారు. చిన్నతనములో బడిలో పెద్దగా చదువుల పట్ల ఆసక్తి చూపలేదు. **అతనిని 'రమణు'డని పిలిచేవారు.** తన స్నేహితులతో రోజూ జరిగిన పాఠాలను చెప్పించుకుని వినేవారు. తమాషా ఏమిటంటే విన్నది విన్నట్లుగానే అప్పగించేవారు. కాని శ్రద్ధగా చదవాలని ఉండేది కాదు. మహాపురుషులు ఈవిధముగానే ఉండెదరు. వారు ఏక సంధాగ్రాహులు. భగవాన్ రమణ తన మనస్సులో చదవాలి అనే ఆలోచన రానివ్వకుండానే ఇతరులు చెప్పినది విని ఉన్నది ఉన్నాట్లుగా అప్పగించేవారు. తన చిన్నతనము నుండే మనసులో ఆలోచనలను లేవనీయకుండా ప్రవర్తించటం భగవానునిలో చూశాము. వారు ఉత్తరోత్తరాన గొప్ప మహర్షి అవుతారని తన చదువు పై గల అశ్రద్ధను చూచిన వారెవ్వరికి అనిపించకపోయినా, భగవాన్ రమణుడు చదువు పట్ల ఆసక్తి చూపక తన మనస్సులో చదవాలి, చేయాలి అనే ఆలోచనలు రానివ్వకుండా తన ప్రవర్తన ఏక సంధాగ్రాహిగా ఋజువు చేసి **ఆత్మ జ్ఞానికి కావలసిన ముఖ్యమైన లక్షణములలో ఒకానోకటి ఆలోచనలకు స్వస్తి చెప్పి మౌనముగ జరుగబోయేది చూపించుట ఒకటి, ఆ ముఖ్యమైన లక్షణమును రమణుడు తన బాల్యములోనే చూపి ఆత్మజ్ఞానిగా ఋజువు చేసి** తన అవతార రహస్యమును బైట పెట్టినారు.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము - 4

తన్మయత్వము

భగవాన్ రమణ మహర్షుల వారికి 8 సం॥ల వయస్సు లోనే ఉపనయనము జరిగినది. వారి గ్రామమున ఇంగ్లీషు చెప్పే పాఠశాల లేని కారణముచే వారి తండ్రి సుందరమయ్యరు తన తమ్ముడు అయిన సుబ్బయ్యరు, దిండిగల్ 1891 వ సం॥న పంపినారు. అక్కడ కూడా మహర్షికి చదువు పై ఆసక్తి లేదు.కాని ఏక సంధాగ్రాహి. ఒకసారి తన పిన తండ్రి ఇంటిలో మహర్షి ఉండగా తన ఇంటి వారందరు గుడికి పోగా మహర్షి ఇంటి వద్దనే ఉండి తలుపులకు తాళం వేసి నిద్ర పోయినారు. రాత్రి వారందరు తిరిగి వచ్చే సమయానికి తలుపులు తట్టినను, అరచినను మహర్షి జాబు పలుకలేదు. అందరు భయాపడినారు. తలుపులు తెరిచి చూచెటప్పటికి మహర్షి నెమ్మదిగా కళ్ళు తెరిచి చూశారు. మరి భగవాన్ రమణుల నిద్ర సామాన్యమైనదా, లేదా సోమరితనము వలన, నిద్రా మోహము వలనా అని ప్రశ్నించుకొనిన **ఆ నిద్ర యోగ నిద్ర అయి సమాధి స్థితిలో ఈశ్వర ప్రేరితముతో నిద్రించిన నిద్ర తప్ప మామూలు సోమరితనమైన నిద్ర కాదు.**

భగవాన్ రమణ మహర్షి (ఇక నుండి భగవాన్ అని సంభోధించబడును) తండ్రి సుందరమయ్యరు గారు 48 సం॥ల వయస్సులోనే అనారోగ్యంతో చనిపోయినాడు. అప్పటికే భగవాన్‌కి 12 సం॥లే. అప్పుడు సుందరమయ్యర్ గారికి ముగ్గురు కుమారులు ఒక కూమార్తె. భగవాన్ గారి తండ్రి కర్మ కాండ ముగిసిన పిదప భగవాన్ పినతండ్రి గారు సుబ్బయ్యరు ఇద్దరు పిల్లలని (అందులో ఒకరుని భగవాన్) తన వెంట మధురకు తీసుకొని పోయిరి. భగవాన్ తల్లి అయిన అలగమ్మ మిగిలిన ఇద్దరు బిడ్డల భారము, రెండవ తమ్ముడు మోసెను. భగవాన్ నాల్గవఫారమ్ పూర్తి చేసినను చదువు నందు శ్రద్ధ చూపలేదు. కాని శ్లోకాలు ఒక్కసారి వింటే మరచి పోయేవారు కాదు. భగవాన్ స్నేహితులతో ఈత కొట్టేవారు. తరచు సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి వెళ్తూ ఉండేవారు **భగవానుని శ్రీకుమార స్వామి అవతారముగా భావించేవారు.**

ఒకసారి భగవాన్ బడికి వెళ్తుండగా రామస్వామయ్యర్ అనునతను ఎదురయ్యెను. భగవాన్

వారిని ఎక్కడి నుండి వస్తునారని అడుగగా **వారు "అరుణాచలం" నుండి అన్నారు.** భగవాన్ వెంటనే ఆ అరుణాచలం అనే మాట వినబడగానే తెలియని ఆనందం, తన్మయత్వం, దివ్యావేశం, ఒళ్ళు పులకరించటం జరిగింది. బహుశ భగవాన్ నిజానికి శరీర ధారి కాదు. కనబడుచున్న ఆత్మ, వారే పరమాత్మ. కావుననే రామస్వామి ఈశ్వరుడు పేరైన అరుణాచలం అని సంభోధించగానే ప్రతి శరీరములో దాగి యున్న ఈశ్వరుడైన ఆత్మను పిలిచినట్లుగా భగవాన్ భావించి ఒక్కసారిగా తన్మయత్వము చెంది ఆనందముతో పులకరించినారు వారి నిజపేరును అనగా ఆత్మకు నామరూపములుండవు. **ఆత్మయే పరమాత్మ. ఆ పరమాత్మయే ఈశ్వరుడు. ఆ ఈశ్వరుడే అరుణాచలేశ్వరుడైన పేరుతో పిలుచుట వలన తన్మయత్వము పొందినారు.** వెంటనే ఆ రామస్వామయ్యరును అరుణాచలం ఎక్కడ ఉన్నదో వివరములన్ని భగవాన్ తెలుసుకొనినారు. ఇది జరిగిన కొన్ని రోజులు మళ్ళీ భగవాన్ యధావిధిగా మామూలుగనే అరుణాచలంపై తలంపే లేక జీవనం గడిపారు. **మహర్షుల లక్షణములు ఇలాగే ఉంటాయి. ఎంత అద్భుతమైన విషయములు విన్నను ఆ క్షణమున మాత్రమే దాని వివరణ తెలిసికొని తెలిసిన పిదప మరుక్షణము నుండి ఎటువంటి ఆలోచనలకు మనస్సున తావివ్వరు.** ఆత్మజ్ఞానుల లక్షణములివే. సాధకుడు శరణాగతి పొందాలనుకున్న భక్తులు ఇలాంటి జ్ఞానుల మార్గమునెంచుకొని ఇటువంటి ఆలోచనలను మనస్సున కలగనివ్వక అనన్య శరణాగతులై ఉండిన ఆత్మాసాక్షాత్కారము తప్పక కలుగును. ఎందుకంటే ఏ కోరికలు లేక ఏ ఆలోచనలు రానివ్వక అనన్య శరణాగతుడైతే మిగిలేవాడు శరీరధారి కాదు. ఆత్మ మాత్రమే.

పై సంఘటన జరిగిన మరికొన్ని నెలల తరువాత భగవాన్ తన పినతండ్రి ఇంటిలో "పెరియపురాణం" అనే గ్రంథాన్ని చూశారు. ఆ గ్రంథములో 63 మంది యోగులు మరియు శివభక్తులైన జీవిత చరిత్రతో కూడిన మహాగ్రంథమది. ఆ పుస్తకమును భగవాన్ చదివిన తరువాత మళ్ళీ ఆనందముతో తన్మయత్వులై వెంటనే మామూలు స్థితికి వచ్చేశారు. **దీనిని బట్టి వెంకటరామన్ లేదా రమణుడు అనే పేర్లతో గల శరీరము ఎటువంటి సంబంధములేని జ్ఞాని భగవాన్. అందుకే వారిని భగవాన్ అనే యావత్ ప్రపంచము సంబోధించుచున్నది.**

అరుణాచల శివ.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 5

ఆత్మ సాక్షాత్కారం కల్గుట

ఈ అధ్యాయము నుండి భగవాన్ రమణ మహర్షుల నిజ స్వరూపము చూపనున్నారు. ఆ రోజు జులై 15, 1896 వ సం॥ము. అనగా **భగవాన్‌కి సరిగ్గా 16 సం॥ల వయస్సు.** ఆ వయస్సు నిజానికి మోహము చెందే వయస్సు. మనస్సు అనేక రకములైన వ్యామోహములకు గురియై మనిషిని మార్చే వయస్సు. కాని మన **భగవాన్‌కు మాత్రము ఒక గొప్పమార్పు కలిగిన వయస్సు. ఏ గురువు లేకుండనే ఆత్మబోధ కలిగిన వయస్సు. 16వ ఏటనే బ్రహ్మానుభూతిని పొంది ఆత్మావలోకనము కలిగి భగవాన్ చూపు బాహ్యప్రపంచముపై పడక అంతర్దృష్టిచెంది ఆత్మ సాక్షాత్కారము కలిగిన వయస్సు.** ఆ రోజు భగవాన్ తన పినతండ్రి గారి ఇంటిలో ఒంటరిగా ఉన్నప్పుడు ఎటువంటి అనారోగ్యము లేకున్నను భగవాన్‌కు ఒక్కసారిగా వారు మరణిస్తున్నట్లు భయము కలిగినది. ఎవ్వరిని పిలవనూ లేదు. దానికి పరిష్కారము వారే తీర్చుకొనవలెనని నిర్ణయించినారు. భగవాన్‌లో ఈక్రింది విధములైన తలంపులు కలిగినవి :-

1. మృత్యువు ఆసన్నమైనది.
2. మరణించునది ఏది ?
3. శరీరమే పోవునని తలంచిరి.
4. మరణించువారి స్థితి ఎలా ఉండునోనని ఊహించిరి.
5. వారి అవయవములను చాచి బిగపట్టి శవమువలె పరుండి మరణ స్థితిలో ఉన్నట్లు చేసిరి.
6. ఊపిరి బిగబట్టి ఏమాటరానీయక పెదవులను బిగించిరి. "నేను" అనేమాటగాని ఉచ్చరించలేని స్థితి.
7. ఆ సమయమున భగవాన్ ఇట్లనుకొనిరి "ఈ శరీరమే మరణించినది."
8. శవమును దహనము చేయుటకై స్మశానమునకు తీసుకువెళ్ళి దహనము చేయగా బూడిద అగునని గ్రహించిరి.
9. శరీరము మరణించినది. కావున 'నేను' మరణించితినా ?

10. ఈ శరీరమేనేనా ?

11. ఇంకా 'నేను' అను స్మృతిని అనుభవిస్తూనే ఉన్నాను. కావున దేహము మరణించినను దేహమున కతీతమైనది ఆత్మయే నేను.

12. ఆత్మను మృత్యువు కబళించదు.

13. ఆ 'నేనే' సత్యమైనది (ఆత్మే)

14. ప్రస్తుత పరిస్థితి శరీరానికి సంబంధించినదైనను చేతనాశక్తి అంతయు ఆ నేను మీదే కేంద్రీకరించబడినది.

భగవాన్‌కు ఆత్మయే నేను అని వారి 16వ ఏటనే గ్రహించిరి. ఇతరులు అందమైన బాహ్యప్రపంచముపై ప్రాపంచిక విషయాలపై వ్యామోహము పడుదురు. కాని మన భగవాన్ ఆ 16వ ఏట 'నేను' (ఆత్మ) అనుదానిపై వ్యామోహము కలిగినది. ఆనాటి నుండి వారికి గొప్ప మార్పు కలిగి ఆత్మబోధ కలిగినది. వారు తమ శరీరముతో ఏ పనిని చేసినను "నేను" అనునది వారిలోనే ఎల్లప్పుడు కేంద్రీకరించి యుండెనని అదే ఆత్మ అని స్పష్టముగా తెలిసికొనిరి. ఆత్మ సాక్షాత్కారము కలిగినది. నిజానికి ఆత్మ ప్రతి జీవిలో ఉండును. మనస్సు ఆ ఆత్మను ఒక తెరవలె కప్పి కనబడకుండ చేయును. **ఆత్మపై దృష్టి మరల్చుటకు ప్రయత్నించే జీవికి మనస్సు ఎన్నో ఆలోచనలను లేపి తెరవెనుకనున్న ఆత్మను చూడనీక గోడవలె అడ్డుపడును. ఆ మనస్సు కలిగించే ఆలోచనలు వారిలో జీవి మరలును. కావుననే ఆంతర్ దృష్టి పోయి బాహ్య దృష్టికి పోవును. భగవాన్ చెప్పినది ఏమనగా, ఆత్మ సాక్షాత్కారము అంటే ఆత్మ సాక్షాత్కరించుట కాదు. ఆత్మ ప్రత్యక్షమగుట కాదు కాని ఆత్మ ప్రతి జీవిలో ఉండును. ఆత్మను గురించి తెలిసికొనుటయే ఆత్మ సాక్షాత్కారము. మనిషి బాహ్య దృష్టిని మరల్చి ఇంద్రియలోలుడు కాకుండా అంతర్ దృష్టిలో వెళ్ళి మనస్సు రేపే ఆలోచనలను అణగద్రొక్కి ఆత్మను కప్పిన తెరను తొలగించిన ప్రతి జీవిలో ఉన్న ఆత్మ సాక్షాత్కారము కలుగును.** అనగా ప్రతి జీవి శరీరము కాదని ఆత్మ ఎరుక కలిగిన వారికి ఆత్మ సాక్షాత్కారము కలిగినట్లే.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 6

మార్పు

పై అధ్యాయమున భగవాన్‌కి ఏ విధంగా ఆత్మభోద కలిగినదో విశదీకరించబడినది. శరీరము నశించిన 'నేను' నశించునా ? 'నేను' ఈ శరీరమేనా ? అని అనుకొనెను భగవాన్. మరియు "ఈ శరీరము నిశ్శబ్దముగా, నిశ్చలముగా ఉంది (కాళ్ళు చేతులు చాచి పెదాలతో సహా బిగపట్టి శవంగా పడుకొనినప్పుడు అనుకొనిన మాటలు) కాని జీవశక్తి ఉన్నట్లు తెలుస్తుంది. 'నేను' అన్న శబ్దము కూడా లోలోపల వినిపిస్తుంది. పెదాలతో పలుకకపోయినా లోలోన ఆ 'నేను' అన్న శబ్దము వినిపిస్తుంది. **కాబట్టి 'నేను' అన్నది దేహానికి అతీతమైనదని అది అతీతమైన శక్తి అని భౌతికముగా అగుపించే శరీరము చనిపోయినా మృత్యువు మటుకు ఆ చైతన్యశక్తిని తాకలేదు. దీనిని బట్టి చావులేనిదే చైతన్యమని ఆ చావులేని చైతన్యాన్ని 'నేను' అని భగవాన్ నిర్ధారించినారు.** మరియు భగవాన్ ఈ 'నేను' యే ఆత్మ అని భగవాన్ దృష్టి ఆ 'నేను' లేక 'ఆత్మ'పైనే కేంద్రీకరించినారు.

ఈ మార్పు కలిగిన పిదప భగవానునిలో కొన్ని క్రొత్త మార్పులు కలిగినవి. అవి

1. సదా ఆత్మలోనుడైనారు.
2. బంధువులతో మిత్రులతో దూరముగా ఉంటూ వచ్చారు.
3. చదువులో ముందున్న కొద్ది ఆసక్తి కూడా పోయినది.
4. ధ్యాస బాహ్య వాటిపైకాక అనంతానికి తీసుకువెళ్ళింది.
5. స్నేహితులతో బంధువులతో వినయముగా ప్రవర్తించినారు.
6. ఇది వరకు ఎవరైనా కొట్టినా తిరిగికొట్టే భగవాన్ ఇప్పుడు పట్టించుకొనక మౌనముగా ఉండేవారు.
7. స్నేహితులతో ఆటలు లేవు.

8. ఎప్పుడూ ధ్యాన నిమగ్నులై అంతర్ముఖమై ఆత్మపై ధ్యాస నిలిపేవారు.

9. ప్రతిరోజు దేవాలయమునకు వెళ్ళి శివుని ముందు ఎంతోసేపు నిలబడేవారు.

10. అలాగే శివయోగుల ప్రతిమల ముందు, మీనాక్షీదేవి ముందు నిలబడేవారు.

11. ఎటువంటి కోరికలు కోరేవారు కాదు.

పైన చూపిన మార్పులు గమనించినచో ఆత్మావలోకన కలుగక పూర్వము ఆత్మసాక్షాత్కారము కలిగిన పిదమ మనిషిలో ఎంతో వ్యత్యాసము వచ్చునని గమనించవలెను. **దేహము అనుభ్రాంతిలో ఉన్నప్పుడు బంధువులు, స్నేహితులు, శత్రువులు, నా వారు, నీ వారు, నేను, వాడు ఇలా తేడాలు కన్పిస్తాయి. దీనివలన సుఖము, దుఃఖము కలుగుతాయి. రాగద్వేషాలు చెలరేగుతాయి.మాట పడకపోవటం, ఎవరైనా ఆటపట్టించినా లేదా కోప్పడినా తిరిగి దెబ్బకొట్టడం జరుగుతాయి. ఆటలలో ఉల్లాసం అదే సంతోషమని భ్రమ కల్గిస్తాయి. దేహముపై వ్యామోహము ఈ విధముగా దినదినాభివృద్ధియై జీవితముపై తీపి కలిగిచావుపై భయము కల్గుతాయి. దేహము అనుకొనువాడు సంసారములో పడి జనన మరణ చక్రములో ఒక రంగుల రాట్నము వలె క్రింద నుండి పైకి తిరిగి మళ్ళీ పై నుండి క్రిందికి పడతారు. అనగా పుట్టుట మరియు చచ్చుట ఇలా జరుగుతూనే యుండును.** కావున భగవాన్‌కు కలిగిన ఆత్మబోధను జాగ్రత్తగా గమనించి తెలిసికొనిన జీవి సంసార చక్రములో పడక జీవించి ఉండగనే మోక్షము పొందగలడు. భగవాన్ భోదించిన ఆత్మభోదను మనకు కూడా అర్థమై స్వామి అనుగ్రహముచే ఆత్మానుభూతి కల్గి ఆత్మ సాక్షాత్కారము కావాలని భగవాన్ రమణుని శరణాగతి కోరుదాం.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 7

ఈశ్వరుని పిలుపు

భగవాన్ ఆత్మానుభూతి పొందిన తరువాత వారిలో మార్పు వచ్చి వారి జీవితమే మారిపోయినది. ఒకసారి భగవాన్ ఇంగ్లీషు వ్యాకరణము చదవకపోవుట వల్ల వారి ఉపాధ్యాయులు శిక్షగా ఆ వ్యాకరణమును మూడుసార్లు చూచి వ్రాయమని ఆజ్ఞాపించగా భగవాన్ రెండుసార్లు రాసి ఒక్కసారిగా వారి చేతిలోనున్న పుస్తకాలను విసిరివేసి ఎందుకూ పనికిరాదని భావించి ధ్యాన నిమగ్నములో ఉండిపోయినారు. **ఈ విధముగా భగవాన్‌లో ఒక్కొక్కటి దూరము అవుతూ తత్వములో మునిగిపోతున్న భగవానుని ప్రవర్తనము వారి అన్నగారు గమనించి "జ్ఞానిలా ధ్యానములో కూర్చుని ఉన్నవారికి చదువెందుకు ? ఎక్కడికైనా పోరాదా?" అని మందలించగా అన్నగారి కోపతాపాలే ఈశ్వరుని పిలుపుగా భావించి అరుణాచలమునకు పయనమవుటకు నిశ్చయించుకున్నారు.** పాఠశాలలో క్లాసు ఉన్నదని చెప్పి ఆగష్టు 29వ తేదీ 1896వ సం॥న శనివారం మధ్యాహ్నం 12 గం॥లకు ఇల్లు వదిలి వెళ్ళుటకు సిద్ధపడినారు. ఆ విషయము తెలియని భగవాన్ గారి అన్నగారు 5 రూ॥లు ఇచ్చి అతని కాలేజీ ఫీజు కట్టమని భగవాన్‌కు ఆదేశించినారు. భగవాన్ ఒక పాత అట్లాస్ పుస్తకము తీసుకుని తిరువణ్ణామలై (అరుణాచలం) వెళ్ళడానికి దారి కనుక్కుని వారి ప్రయాణమునకు 3 రూ॥లు చాలునని మిగిలిన 2 రూ॥లు వారి అన్నగారి పెట్టెలో పెట్టి ఒక జాబు వ్రాసి వెళ్ళిపోయినారు.

భగవాన్ వ్రాసిన ఉత్తరములోని ముఖ్యాంశములివి –

1. **"నేను నా తండ్రిని వెతుకుచూ నా తండ్రి ఆజ్ఞానుసారము బయలుదేరితిని."**

భగవాన్ సాక్షాత్తు కుమార స్వామి అవతారమని ముందు చెప్పబడినది. కుమారస్వామి తండ్రి పరమశివుడు తిరువణ్ణామలైలో ఉన్నది ఆ అరుణాచలేశ్వరుడే. కావున తన తండ్రి ఆజ్ఞా ప్రకారము భగవాన్ బయలుదేరినారనే భావన.

2. **"ఇది సత్కార్యమునకే బయలుదేరుచున్నది."**

సామాన్యముగా నేను సత్కార్యమునకే బయలుదేరుచున్నాను అని వ్రాసెదరు. కాని భగవాన్

'నేను'కు బదులుగా 'ఇది' అని అన్నారు. ఇక్కడ 'ఇది' అంటే దేహము కాదు ఆత్మమాత్రమే. **భగవాన్‌కు ఆత్మ సాక్షాత్కారము కలిగిన పిదప 'నేను' అని సంభోదించుటయే మానివేసినారు.** వారు శరీరమని మరచి పోయినారు. వారు ఆత్మగా భావించినారు. **కావుననే 'ఇది' అని వ్రాసినారు.** "సత్కార్యమునకే బయలుదేరుచున్నది" ఇందులో కూడా 'బయలు దేరుచున్నాను' అనుటకు బదులు 'బయలుదేరుచున్నది' అనుటకు వారు ఆత్మ కావుననే 'బయలు దేరుచున్నది' (అనగా ఆత్మ బయలుదేరుచున్నదని) సంభోదించినారు. భగవాన్ 'నేను' అనే పదమును ఎక్కడ వాడలేదు. అయితే మొదటి దానిలో నేను నా తండ్రిని వెతుకుచూ అని వ్రాశారు కదా! అని ప్రశ్నిస్తే వారి తండ్రి ఈశ్వరుడు ప్రతి జీవిలో ఆత్మరూపేణ కొలువున్నవాడే ఈశ్వరుడు. భగవాన్‌లో వున్నది ఆ ఈశ్వరుడే. "నేను నా తండ్రిని వెతుకుచు" అనగా ఆత్మను ఇంకా అన్వేషించుటకని భావం.

దీనిని వెతుకుటకు ఏ మాత్రమును ద్రవ్యమును ఖర్చు పెట్టనక్కరలేదు.

ఇక్కడ కూడా "నన్ను వెతుకుటకు" బదులుగా దీనిని అనగా ఆత్మను వెతుకుటకు డబ్బు ఖర్చు పెట్టనక్కరలేదని ఆత్మకు డబ్బుతో ఏమి పని ? అదే నన్ను వెతుకుటకు అని సంభోదించినా రమణుడనే శరీరము అనే అర్థము వచ్చును.

భగవాన్ వ్రాసిన లేఖలో అతి ముఖ్యమైనది చివరిగా ఇట్లు అనుచోట వారి పేరుగాని సంతకముగాని లేదు. కేవలము ఒక ------ (గీత) పెట్టినారు. దీనిని బట్టి భగవాన్‌కు ఆత్మభోద కల్గిన పిదప వారు తానొక శరీరమని వారికి నామరూపములు కలవని భావింపక వారొక ఆత్మ అని 'నేను' అంటే శరీరము కాదని లోనున్న ఆత్మయే నేనని భావించినారు.

ఆత్మజ్ఞానము గురించి తెలిసికొనవలెనని జిజ్ఞాస కలవారందరు భగవాన్ మార్గము నెన్నుకొని భగవాన్ ప్రవర్తనను వారి చర్యలను ఆదేశానుసారముగా తీసికొని ఆత్మజ్ఞానిగా మారవలెను. అందుకు భగవాన్‌కు శరణు వేడాలి. అటువంటి ఫలాపేక్ష లేని మనస్సుతో మనస్సు సైతం అనన్య శరణాగతి చెంది భగవాన్‌కు శరణువేడుదాం. రమణుడే శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 8

పయనం

భగవాన్ ఆగష్టు 29, 1896 వ సం॥న అరుణాచలమునకు పయనమయ్యారు. "తిండి వనానికి" టిక్కెట్‌కొని రైలులో కూర్చుని ఉండగా ఒక మౌల్వీ విల్లుపురములో దిగినచో 'తిరువణ్ణామలై' దగ్గరని చెప్పెను. 'తిరువణ్ణామలై'యే అరుణాచలము. భగవాన్ తెల్లవారుఝామున 3 గం॥లకు విల్లుపురములోదిగి తిరువణ్ణామలైకి కాలినడకతో పయనమయినారు. "మాంబలం పట్" వరకు రైలు టిక్కెట్‌కొని అక్కడి నుండి 10 మైళ్ళు కాలినడకన తిరువణ్ణామలై వైపుకు పయనించారు. ఆగష్టు 31, 1886 వ సం॥న భగవాన్ పూర్తిగా అలసిపోయినను వారు తమకాలి నడకకు స్వస్తి చెప్పక ముందుకు పయనమవుతునేయున్నారు. చేతిలో ఉన్న ఆ మూడు రూపాయలు రైలు టిక్కెట్లకు భోజనానికి ఖర్చు అయిపోయినవి. **భగవాన్ తమ చెవులకున్న కెంపు పోగులను అమ్ముటకై ముత్తు కృష్ణ భాగవతార్ అనువారి యింట వాటిని తాకట్టు పెట్టి వారి వద్దనుండి 4 రూ॥లు తీసికొన్నారు.** తమాషా ఏమిటంటే ఆ రోజు శ్రీ కృష్ణాష్టమి. ఆ యింటి దంపతులు సాక్షాత్తు శ్రీ కృష్ణభగవానుడే వచ్చినాడని భావించి కడుపునిండా భోజనము పెట్టినారు. **రెండవ అధ్యాయమున చెప్పినట్లుగా భగవద్గీతయందు శ్రీ కృష్ణుడు మహాత్ములు తమ ఆత్మయని తన సజీవ ప్రతిమయని తానే వారని వారే తానని చెప్పినారు. పైగా ఆ రోజు గోకులాష్టమి కూడా. ఆ దంపతులు భగవాన్‌కు 4 రూ॥లు పోగులకు బదులుగా ఇచ్చి వీలైనప్పుడు వచ్చి విడిపించుకోమని తమ అడ్రసు ఇచ్చినారు.** ఆ దంపతులు భక్ష్యములను భగవాన్‌కు మూటకట్టి ఇచ్చిరి. భగవాన్ వారి ఇల్లు దాటగానే ముత్తు కృష్ణ రాసి ఇచ్చిన కాగితమును చింపి పారవేశారు. **ఆత్మావలోకనమైన జ్ఞానికి కెంపుపోగులతో పనేమిటి ? వారు ధనాన్ని ఆశించినది కూడా ఆ అరుణాచలేశ్వరుణ్ణి చూడటానికే తప్ప వారికి ధనముతో వస్తువులతో పనేమిటి ?** ఆ మర్నాడు తెల్లవారు వరకు రైలు రాదని తెలిసికొని పడుకొని 1896 వ సం॥ము సెప్టెంబర్ 1వ తేదీన తెల్లవారుఝామున రైలెక్కి అరుణాచలమునకు ఇన్ని కష్టాలు పడిన భగవాన్ తుట్టతుదకు

చేరుకొనినారు. ఆనందము, పరమానందము, బ్రహ్మానందముతో వారి రెండు కన్నుల నుండి ఆనంద భాష్పాలు దొర్లెనట. **గుడి ముందర నిలబడి "అప్పా నీ ఆజ్ఞ మేరకు వచ్చాను" అని అన్నారు. భగవాన్ మనలాగ చేతులు జోడించి నమస్కరించలేదు. ప్రదక్షిణలు చేయలేదు. మరి ఏమిటి ఇది ఏమి భక్తి ? అన్నట్లుగా అగుపించినారు. అనన్య శరణాగతి అంటేనే అదే మరి. వారి దగ్గరనున్న భక్ష్యాల మూటను ప్రక్కనున్న కోనేటిలో పారేసినారు. వారి తలనీలాలను అర్పించుకొనినారు. మంగలికి తన చేతిలో ఉన్న పైకమును ఇవ్వగా మిగిలియున్న పైకమును భగవాన్ పారవేసినారు. ఆ క్షణము నుండి వారి జీవితములో పైకాన్ని ముట్టలేదు. వారు కట్టుకున్న వస్త్రాన్ని చింపిపారవేసినారు. ఒక చిన్న గుడ్డను కౌపీనముగా కట్టుకున్నారు. వారు బ్రాహ్మణుడని తెలియజేసే, భగవాన్ ఒంటిపై గల యజ్ఞోపవీతమును కూడా తీసివేసినారు.** భగవాన్ యజ్ఞోపవితాన్ని వారి వంటిపై నుండి తీసివేయుటకు గల కారణము **వారు దేహభావమునకు అతీతులై ఉండుయటే. ఆ జంధ్యము వారి వంటిపై ఉంచుకొనినచో దేహ సంబంధమైన భేదాలు కనబడును. వారు బ్రాహ్మణుడని జ్ఞాపకము చేస్తున్నట్లు కూడా కనిపించును. ఆత్మావలోకనము కలిగిన మహా జ్ఞానియైన భగవాన్‌కు కులమతములతో సంబంధము ఎక్కడ ? అసలు వారు తానొక దేహమని ఎప్పుడో మరచిపోయినారు. వారికి ఆత్మజ్ఞానము కలిగిన మరుక్షణమే దేహానికి సంబంధించిన వాటి అన్నింటికి స్వస్తి చెప్పివారు కేవలము ఒక ఆత్మగా ప్రవర్తించినారు. కావుననే వారి వంటిపై జంధ్యమును తీసివేసినారు కాని అవమానించుటకు చేసిన పనికాదు.** పైగా ధనముతో కూడా వారికి ఎటువంటి సంబంధము లేదు. అరుణాచలం వచ్చేవరకు చేతిలో పైకము రైలు ఖర్చు కొరకు కావలెనని ముట్టిరికాని వారి వసతికి, భోజనం కొరకు కాక ఆ అరుణాచలేశ్వరుని దర్శించు వరకు మాత్రమే పైకము ముట్టినారు. దర్శించిన పిదప చేతిలోని డబ్బును కూడా విసిరివేసినారు. **ఆత్మకు ధనముతో పని ఏమిటి ? వారి తల నీలాలను కూడా అర్పించుటకు బహుశ గల కారణము దేహము అని అనుకుంటే అందము మొదలగు ఆలోచనలు వచ్చును. మనిషితో ముఖ్యముగా అందము నిచ్చేది తలపై జుట్టే. వారు శరీరమని భావించలేదు కనుక ఇక అందచందాలుపై లగ్నము ఎక్కడ. కావుననే వారు తమ**

తలపై ఉన్న జుట్టును కూడా ఆ ఈశ్వరునికి అర్పించినారు. వారి వంటిపై ఉన్న వస్త్రములన్ని చింపివేసి ఒక చిన్న కౌపీనము మాత్రమే కట్టుకొనినారు. దీనికి కూడా బహుశః గల కారణము **లోకము కొరకు ఆ కాస్త కౌపీనము కట్టుకుని ఉండవచ్చును. ఎందుకంటే దేహము అని మరచిన వారికి ప్రత్యేక భాగములు (అవయవములు) అనే తలంపు ఎక్కడ** ? సంపూర్ణ ఆత్మజ్ఞానులకు అటువంటి ఆలోచనలు ఉండవు. కాని **బాహ్య ప్రపంచము కొరకు వారు కౌపీనము ధరించిరేకాని ఆ ఆత్మజ్ఞానికి వేటిపైన ధ్యాసలేదు.** ఒక్క ఆత్మపై విచారణయే తప్ప.

భగవాన్ తిరువణ్ణామలైలో స్వామిని దర్శించి తలనీలాలు అర్పించిన పిదప స్నానము కూడా చేయలేదు. తమాషా ఏమిటంటే అప్పటి వరకు అరుణాచలంలో వర్షాలే లేవు. భగవాన్ అడుగిడిన పిదప భారీ వర్షము పడినది. **మహాత్ములరాక పంచభూతములకు సైతము ఆనందము చెంది వాటి హర్షమును బహుశ ఈ విధముగా ప్రకటిస్తాయి కాబోలు.**

సాధకుడు ఆత్మావలోకనము గురించి అన్వేషిస్తున్నవారు భగవాన్‌లాగ ప్రతి చర్యలో తానొక దేహము కాదని ఆత్మ అనియు ఎరుక ఎప్పుడు ఉంటూ ముందుకు సాగాలి. దానికి సాధారణమైన మన కృషి సరిపోదు. శరణాగతి వేడాలి. భగవాన్‌కు అనన్య శరణాగతి వేడుదాం. రమణుని మార్గములో పోదాం. భగవాన్ నీవే శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 9

అరుణాచలం

భగవాన్ అరుణాచలమునకు విచ్చేసినారు. ఆ అరుణాచలం ఎంతో పవిత్రమైన క్షేత్రం. అరుణాచలములో ప్రకృతి ఎంతో ఆహ్లాదకరముగను ఎక్కడ చూసినా పచ్చని చెట్లతోను చక్కటి పండే పంటలతోను సస్యశ్యాములముగా కనిపించే సుందర ప్రదేశము. **అక్కడ సాక్షాత్తు పరమేశ్వరుడు గిరిరూపములో ఆవిర్భవించినారు.** కావున అరుణాచలములో ఉన్న గిరి (కొండ) మామూలు కొండ అని భావించరాదు. **ఆ గిరిని చూచిన వారు సాక్షాత్తు పరమేశ్వరుణ్ణి దర్శించినంత పుణ్యము కలుగును.** అరుణాచలంలో వీచే గాలి పవిత్రం. కురిసే వర్షం పవిత్రం. కాచే ఎండ కూడా పవిత్రమైనదే. అరుణాచలంలో నివశించే జనులందరు భగవాన్ రమణ మహర్షులే. ఎందుకనగా భగవాన్ వారి వద్ద వచ్చిన వారిని ఎవరినైనా ఆత్మగానే చూచెదరు. భగవానుని గురించి తెలిసికొన్న వారందరు కూడా భగవానుని ఒక ఆత్మగనే భావించెదరు. కావుననే అక్కడ నివశించే జనులందరు ఆత్మ కాబట్టే ఆ ఆత్మయే ప్రతి జీవిలో నివశించి ఆ ఒకే ఆత్మ అందరిలో భగవానునితో సహా ఉన్నది కావుననే అందరూ రమణ మహర్షులే అని అనబడినది. అరుణాచలములో ఉదయించే సూర్యుడు ఒక రమణ మహర్షే. రాత్రి చూసే చంద్రుడును రమణ మహర్షే. నీటిలో తేలే హంసలు, చెట్టుపైన కోకిలలు, ఎగిరే పక్షులు పరిగెత్తే లేగదూడలు, పాలిచ్చే ఆవులు, జలచరాలు, క్రిమికీటకాలు అన్నీ రమణ మహర్షులే. సర్వం ఆత్మయే. కావున సర్వ జీవులు రమణ మహర్షియే అని సంభోదింపబడినది. మరి జీవులేనా ? కనిపించే కొండలు చెట్లు, చేమలు, నీరు అన్ని భగవానుడే. ఆ ప్రదేశమంతా భగవాన్ నడిచిన ప్రాంతము భగవాన్ పాదములు తాకిన ధూళితో సహా రాళ్ళురప్పలు అన్ని పవిత్రమైనవే. అరుణాచలములో నివశించే ప్రజలు ఎంతో అన్యోన్యముగా ప్రేమతో ఉన్న జీవులు. కారణము భగవాన్ మార్గమే. అరుణాచలంలో కాలుపెట్టిన ప్రతిజీవి ధన్యుడే. వారికి ఉన్న కష్టములు, రోగములు మరి ఏ ఇతర బాధలు ఏ క్షణమున అరుణాచలములో కాలుపెట్టిరో ఆ క్షణము నుండే మాయమైనట్లే. ఆ అరుణాచలం యొక్క మహాత్మ్యము మరి అంత గొప్పది. ఏమిటా మహాత్మ్యం ? వచ్చే అధ్యాయములో చూద్దాం.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 10

అరుణాచల మహాత్మ్యం

భగవాన్ అరుణాచలం రావుటకు గల కారణం ఏమై ఉండవచ్చును ? ఆ అరుణాచలం యొక్క ప్రాముఖ్యత మరియు మహాత్మ్యం ఏమిటి ? ఇలాంటి సందేహాలు తీర్చుకొనుటకై ఒక్కసారి వెనుకకు వెళ్ళి అరుణాచలము యొక్క మహాత్మ్యమును పరిశీలిద్దాం.

పూర్వము సనక మహర్షి బ్రహ్మను ఇట్లు ప్రశ్నించెను, "భూలోకములో దేవతలు, మనుష్యులు, భూతాదులు, సిద్ధులుచేత ప్రతిష్ఠింపబడిన శివలింగములు అనేక క్షేత్రములలో ఉన్నవి. ఇవి కాకుండా స్వయంభువములు తేజోమయమైన శివలింగము ఎచ్చటైనను కలదో" చెప్పమని ప్రార్థించెను. బ్రహ్మ తమ బాహ్య స్మృతిని కోల్పోయి ధ్యాననిమగ్నులై పరమేశ్వరుని ఆజ్ఞతో సనక మహర్షికి ఇట్లు చెప్పెను. "ఒకసారి నేను (బ్రహ్మ) మరియు విష్ణువు, నేను ఘనుడని, కాదు నేనే ఘనుడని వాదించుకొని కలహమునకు దిగిన సమయమున పరమశివుడు వారిరువురి మధ్య అగ్ని స్థంభమై నిలిచిరి. అప్పుడు అశరీరవాణి ఇట్లు పలికెను, "మీ వాదము శివుడే తీర్చగలడు. మీ ముందున్న ఈ తేజ స్థంభము పరమ శివుడే. మీలో ఎవరు ఈ తేజస్సు యొక్క ఆద్యంతములు దర్శించగలరో వారే ఘనులు" అని పలుకగా నేను మరియు విష్ణువు కలహమునాపి అన్వేషణ మొదలిడుతూ విష్ణువు, వరాహ రూపముధరించి భూమిని తన ముట్టెతో చీల్చుచూ ప్రారంభించినారు. నేను (బ్రహ్మ) హంసరూపుడనై తేజశ్శిరోభాగమును కనుగొనుటకు ఊర్ధ్వముగా పయనమైతిని. విష్ణువు భూమిని ఎంత లోతు అనేక సంవత్సరములు త్రవ్వినను తేజస్సు యొక్క ఆది కనుగొనలేకపోయెను. నేను ఆకాశములో అనేక సం॥లు తిరిగినను తేజస్థంభమింకను పైకి వ్యాపించియే ఉన్నట్లు తెలిసికొంటిని. మేమిరువురము కనుగొనలేకపోతిమి. వెనుకకు మరలినాము. శివుని శరణు పొందితిమి. నేను శివుని మనస్సులోనే స్తుతించితిని. విష్ణువు కూడా ఆ పరమేశ్వరుని ప్రార్థించిరి. మా ప్రార్థనను కరుణించి పరమశివుడు తేజోస్థంభము నుండి వెలువబడి వరము కోరమనగా నేను (బ్రహ్మ) లోకసంగ్రహార్థము నీ (శివ) తేజమును

జ్యోతిర్మయమైన అరుణాచలమును స్థావరలింగ గిరి రూపమును ఇక్కడనే స్థిరముగా నిలిచియుండమని అడిగినాను. ఈ గిరిపై సురవృక్షములు సకల ఫలదాయకములై మరియు దివ్య ఔషధాలన్నియు మొలచుగాక. దుష్టమృగములు కూడా ప్రశాంతతతో జీవించుగాక. నీ లింగరూపమే ఈ గిరి. సర్వజనులు నిన్ను సేవించుకొందురు అని నేను (బ్రహ్మ) కోరగా శివుడు తథాస్తు అనెను.

విష్ణువు ఆ పరమేశ్వరుణ్ణి ఇట్లు స్తుతించెను, "నీ పాదము మరియు శిరస్సులను నేను (విష్ణువు) మరియు బ్రహ్మ దర్శించలేక పోతిమి. నీకు పూజలు, ప్రదక్షిణలు చేయు మానవులు పాపముల నుండి విముక్తి చెందెదరు. అంగ ప్రదక్షిణలు చేయువారు నిన్ను నీ సన్నిధికి చేరెదరు. సర్వమానవులు సదా నీ పాదములనే ధ్యానింతురుగాక." అని విష్ణువు ప్రార్థించగా శివుడు తథాస్తు అనెను. **"పరమేశ్వరుడు అరుణాద్రియను స్థావర లింగరూపమును పొంది లోక కళ్యాణమునకై ఆ శివుడు తేజోలింగమున అరుణాద్రియను గిరి పేరుతో ప్రపంచ విఖ్యాతి పొందినారు"** అని బ్రహ్మదేవుడు సనక మహామునికి చెప్పిరి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 11

అరుణాచల మహాత్మ్యం - పార్వతీదేవి రాక

సనక మహర్షి మళ్ళీ బ్రహ్మ దేవుని ఇట్లు ప్రశ్నించెను, "ఎవరెవరు ఏయే తీరును ఈ అరుణగిరిని సేవించి తరించినారో తెలుప"మనెను. దానికి బ్రహ్మదేవుడు, పార్వతీదేవి ఏ విధముగా దుఃఖనివృత్తి పొందెనో ఈ విధముగా చెప్పెను. "ఒకసారి పార్వతీదేవి పరిహాసముతో శివుని త్రినేత్రములను మూసెను. ఆమె తన చేతులను తీసివేయు క్షణములోపలే సర్వలోకములు అంధకారమై ఎటువంటి వెలుగు లేక సర్వజీవులు స్తంభించిపోయిరి. పరమశివుని నేత్రములు అర్ధ నిముష మాత్రకాలమునే మూయబడినను అది లోకములకు కోట్ల సం॥ములై పరిణమించెను. దేవతలు యజ్ఞ యాగాదులు లేకపోవుటచే ఆ పరమశివుని వేడుకొనెను. లోక రక్షణ గావింపమనిరి. పార్వతి తన చేతులు తొలగించగానే సూర్యచంద్రులు మరల ప్రకాశించిరి. శివుడు తన కళ్ళను పార్వతి అర్ధ నిముషము మూసినందుకు లోకములకు కోట్ల సం॥ములై నష్టమైనందుకు పార్వతి లోక సంగ్రహార్ధము ప్రాయశ్చిత్తము జరుపవలెనని ఆ ప్రాయశ్చిత్తార్ధమైన తపస్సుచే సఫలమగునని కాంచీపురమునకు వెళ్ళి కంపాతీరమున ఒక చూత వృక్షము క్రింద తపస్సు చేయమని ఆజ్ఞాపించెను. పతి ఆజ్ఞను శిరసావహించి పార్వతీదేవి కంపాతీరమునకు చేరుకుని చూతవృక్షము క్రింద తపస్సు ప్రారంభించినది. ఒక ఇసుకతో లింగమును చేసి శివపూజ ప్రారంభించెను. శివుడు పార్వతిని పరీక్షించబోయి కంపానదిలో వెల్లువను ప్రవహింపచేసినాడు. ఆ నది ఉప్పొంగుట చూచి పార్వతిదేవి తన సైకత లింగము జలములో కరిగిపోవునని ఆ సైకత లింగమును తనచేతులతో గట్టిగా పట్టుకొని తన గుండెలకు హత్తుకొనెను. ఆ క్షణమున అశరీరవాణి ఇట్లనెను, "ఓ దేవీ! ప్రవాహము చాలా బలమైనది. లింగమును విడువుము. నీచే అర్చింపబడిన ఈ సైకత లింగము సకల జనులచే, దేవతలచే పూజింపబడును. నీవొనర్చిన తపస్సుచే ధర్మపాలన జరిగినది. **నేను తేజోరూపముతో అరుణాచలమను నామముతో ఉద్భవింతును.** సర్వలోకములను పాపములనుండి విముక్తుని చేసెదను. అనేకులు ఋషులు ఆ అరుణగిరికి వత్తురు" అని

పలికెను. పార్వతీదేవి ఆ అశరీరవాణి మాటలు విని అరుణాచలమునకు బయలుదేరెను. పార్వతి సైకత లింగమును గట్టిగా హత్తుకొనుట వలన ఆ మాత కుచములు మరియు కంకణములు ముద్రలు ఆ సైకత లింగముపై పడెను. పార్వతి అరుణాచలమునకు బయలుదేరుటకు ముందు ఇట్లనెను, "కామాక్షి అనుపేరుతో నన్ను ఈ కంపానదీ తీరమున పిలిచెదరు. నేను (పార్వతి) మహాతేజోరూపుడైన శివుని ఆనతి మేరకు అరుణాచలమునకు చేరుకొందును. అక్కడ తీవ్ర తపముచే శంకరుని మెప్పించెదను" అని పార్వతి అక్కడి జనులకు చెప్పి అరుణాచలమునకు బయలుదేరెను. అరుణాచలములో అరుణగిరిని చూచి నమస్కరించెను. అక్కడ ఉన్న గొప్ప మహర్షులందరు పార్వతీదేవిని గౌతమ మహర్షి వద్దకు తీసుకుని వెళ్ళిరి. ఈ గౌతముడు శివభక్తులలో అగ్రగణ్యుడు. తల్లి పార్వతిరాకను మెచ్చి ఎంతో ఉప్పొంగిపోయెను. పార్వతీ దేవి ఆ గౌతమ మహర్షిని అరుణగిరి మహిమను చెప్పమని కోరెను. తల్లి ఆనతిపై గౌతముడు అరుణాచల మహాత్మ్యం తేజోస్తంభ రూపము బ్రహ్మవిష్ణువుల మధ్య జరిగిన సంవాదము శివుడా అగ్ని స్థంభరూపుడైన ఆ వృత్తాంతమును వివరించెను. గౌతముడు ఆ అరుణగిరి నాల్గు దిక్కులయందును దేవతలు నివశించుదురని తూర్పున సూర్యుడు దక్షిణమున విశ్వామిత్రుడు పడమట వరుణుడు ఉత్తరమున త్రిశూలము. గిరి ఉత్తర భాగమందలి ఒక మహావటవృక్షమున్నదని దాని నీడ చాలా దూరము వరకు వ్యాపించి యున్నదని చెప్పెను. గౌతముడు మరియు ఇట్లు చెప్పెను. అష్టదిక్కుల యందును అష్ట దిక్పాలకులు ఎల్లప్పుడు ఆ గిరిని పూజించెదరని చెప్పెను.

ఈ గిరికి :-

1. వాయువ్య దిశలో - వాయుతీర్థము

2. ఈశాన్యమున - ఈశాన్యతీర్థము

3. ఉత్తరమున - కుబేర తీర్థము

4. ఈ గిరికి అన్నిదిక్కుల యందును గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరి, శోణనది, శోణనదీ మహానదుల దేవతలు వారి శక్తులతో అరుణాచలుని సేవించుచున్నారు.

5. గిరికి దక్షిణ దిక్కున అగస్త్య తీర్థమున్నది.

6. గిరికి ఉత్తర దిశ యందు వశిష్ట తీర్థమున్నది.

7. ఈశాన్యమందు గంగాతీర్థము.

8. అరుణాద్రీశ్వర సన్నిధిలోనే బ్రహ్మ తీర్థమున్నది.

9. శివ తీర్థమున్నది.

10. ఆగ్నేయ దిశయందు అగ్ని తీర్థమున్నది.

11. దక్షిణ దిక్కున విష్ణు తీర్థమున్నది.

12. ఉత్తర దిక్కున సూర్య తీర్థమున్నది.

13. ఈశాన్య దిశయందు అశ్వనీ తీర్థమున్నది.

14. దక్షిణమున పాండవ తీర్థమున్నది.

15. వాయవ్యమున వైశ్యదేవ తీర్థమున్నది.

16. తూర్పుదిక్కున ఇంద్రతీర్థము.

17. గిరికి ఉత్తర భాగమున స్కందానది పారుచున్నది. ఇక్కడ శివపుత్రుడు స్కందుడు స్నానము చేసెను.

18. పడమటన కుంభానది.

ఈ గిరిచుట్టూ అనేక తీర్థములున్నవి. ఈ విధముగా గౌతముడు అరుణాచల మహాత్మ్యమును పార్వతికి వివరించెను.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 12

అరుణాచల మహాత్మ్యం - గౌతముని పూర్వగాథ

గౌతమ మహర్షి తల్లి పార్వతితో ఇట్లు చెప్పెను. పరమశివుని ఆజ్ఞ ఒకసారి కైలాసములో నాకు ప్రాప్తించినది. అదేమనగా తీర్థయాత్రలు చేయమని. శివాజ్ఞ నెరవేర్చుటకై నేను అనేక క్షేత్రములను దర్శించి అనేక లింగములను సేవించితిని. అనేక శివక్షేత్రములు దర్శించితిని. కొన్ని స్వయంభు లింగములను కూడా దర్శించితిని. శివ స్మరణతో భూమండలమంతా తిరిగి తిరిగి ఈ అరుణాద్రి లింగమును చేరుకుంటిని. ఇక్కడ సేవించు మహాపురుషులను చూచి నా తపము ఫలించెనని పర్వత రూపమున నిలిచిన ఈ లింగము మరెక్కడ లేదని గ్రహించితిని. శివుని స్తుతించితిని. **నా ప్రార్థనను విని పరమశివుడు ప్రసన్నుడై దర్శనమిచ్చి అనునిత్యము నన్ను ఈ అరుణాద్రి సన్నిధియందే ఉండి అర్చించి తపమాచరించి శివ మహాత్మ్యమును సర్వజీవులకును తెలియచేయుమని పరమేశ్వరుడు ఆనతినిచ్చెను. కావున ఈ అరుణాచలములో కనిపించే గిరి మామూలు కొండకాదు. సాక్షాత్తు పరమశివుడు పర్వత రూపముగా నిలిచిన లింగము అని ఎరుంగవలెను.** ఆనాటినుండి గౌతమ మహర్షి శివుని ఆజ్ఞను మరువక అరుణాద్రిని విడువక అక్కడే నివశించుచుండెను.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 13

అరుణాచల మహాత్మ్యం - గిరి ప్రదక్షిణ మహాత్మ్యం

అంత గౌరీదేవి గౌతముని పూర్వగాధ విని అరుణాచలగిరి ప్రదక్షిణ మహాత్మ్యమును తెలుపమని కోరెను. గౌతముడిట్లు చెప్పెను. పరమేశ్వరుడు నాకిట్లు ఆనతిచ్చెను.

1. నా గిరి ప్రదక్షిణ మాత్రమున సర్వ పుణ్యతీర్థములలో స్నానము చేసిన ఫలితము కల్గును.
2. అరుణగిరి ప్రదక్షిణముచే అన్ని శాస్త్రముల పారంగతత్వము లభించును.
3. సమస్త యజ్ఞకర్మముల ఫలితము దక్కును.
4. మానసిక వాక్కు శారీరక సంబంధించిన పాపములు నశించును.
5. అరుణగిరి చుట్టు ఎందరో సిద్ధులు, దేవతలు మరియు మహర్షుల ఆశ్రమములున్నవి.
6. ఈ గిరి అగ్నిమయమని దానిలోపల గుహ ఉన్నదని తెలిసికొనుము.
7. ప్రదక్షిణ చేయునపుడు ధ్యానించుకొనుచు మెల్లగా ప్రదక్షిణ చేయవలెను.
8. ఎవరి చేయిని పట్టుకొనక నిండు గర్భవతివలె అడుగులో అడుగువేస్తూ ప్రదక్షిణ చేయవలెను.
9. అడుగుల చప్పుడు కూడా వినపడరాదు.
10. దారిలో నడుచుచున్నప్పుడు మనువులు, దేవతలు, సిద్ధులు మొదలగువారు నడుచురుని గుర్తించి వారి దారికి అడ్డురాక నడువవలెను.
11. శివ నామ సంకీర్తనము చేయవలెను.
12. దారిలో బీదలకు దానము చేయవలెను.
13. నడుచువారి బాధ్యతను నేనే (శివుడు) చూచుకొందును.
14. అరుణగిరి ప్రదక్షిణ చేయువారి పాదములను మోయుటకు అనేక దేవతల వాహనములు పోటీపడును.

15. ప్రదక్షిణ చేసిన వారికి శివప్రాప్తి కల్గును.

16. ప్రదక్షిణ చేసినవారికి తత్క్షణమే వారి శరీరము వజ్ర శరీరమైపోవును.

17. ప్రదక్షిణ చేయువారికి వారు ఎంత భక్తి ప్రపత్తులతో చేయుచున్నారో అని దేవతలు అదృశ్యరూపులై గమనించుచుందురు.

18. సోమవారం ప్రదక్షిణ అజరామరత్వమిచ్చును.

19. మంగళవారం ప్రదక్షిణ సార్వభౌమత్వము నిచ్చును.

20. బుధవారము పాండిత్యమొసంగును.

21. గురువారం గురుత్వమును సంపాదించును.

22. శుక్రవారము విష్ణు పదమును పొందించును.

23. శనివారం గ్రహపీడ వదిలి జయము ప్రాప్తించును.

24. ప్రదక్షిణచేయువారు పాదములకు దెబ్బ తగిలి రక్తము కారినచో దేవేంద్రుడు ధరించు మందార పువ్వు పొడిచే ఆ రక్తము తుడువబడును.

25. రాళ్ళు తగిలి నొప్పి కల్గిన మహాలక్ష్మి శరీరముపై పూయబడు కుంకుమ లేపనముతో తొలగింపబడును.

26. ప్రదక్షిణము చేయువారు స్వర్గములో మణిపర్వత శృంగములపై విహరించి కల్పవృక్షచ్ఛాయలో విశ్రమింతురు.

పై విధముగా గౌతముడు ఆ పరమేశ్వరుడు తనకిచ్చిన ఆనతిచే పార్వతీదేవికి ఆ అరుణాచల గిరి ప్రదక్షిణ మహాత్మ్యమును వివరించెను.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 14

అరుణాచల మహాత్మ్యం - మహిషాసురుని సంహరించుట

జగజ్జనని గౌతముని నోటనుండి అరుణగిరి మహాత్మ్యము విని ఎంతో సంతసించి అచ్చటనే తపస్సు చేయుటకు నిశ్చయించుకొనెను. ఆ సమయములో మహిషాసురుడు దేవతలను బాధించుటచే దేవతలందరు పార్వతి వద్దకు వచ్చి శరణువేడిరి. మహిషాసురుని బాధనుండి రక్షింపమని వేడిరి. అందుకు భవాని తగిన సమయము వచ్చినప్పుడు మహిషాసుర వధ జరుగునని చెప్పెను. గౌరీదేవి గౌతమ మహర్షి ఆశ్రమమున తపస్సు చేయుచుండగా మహిషాసురుడు అచ్చటికి ఒక వృద్ధుడి రూపములో (మారు వేషమున) వచ్చి గౌరి తపస్సుకు కారణము తెలిసికొని పార్వతితో "నీవు కోరిన వరుడను నేనే నేను మహిషాసురుడిని" అనినంతనే జగజ్జనని మహిషాసురునితో యుద్ధము చేసెను. వారిరువురి మధ్య ఘోరమైన యుద్ధము జరిగినది. గౌతమముని పార్వతి వద్దకు వచ్చి మహిషాసురుని చంపమని ప్రోత్సహించెను. **దేవి తన త్రిశూలముతో దుర్గారూపిణియై మహిషాసురుని సంహరించి అతని తలపై నృత్యము చేసెను.** సకల దేవతలు స్తుతించగా దుర్గాదేవి శాంతించి మహిషాసురుని శిరస్సును చూచి వాని కంఠమునందు వెలుగుచున్న శివలింగమును చూచెను. ఆ లింగమును పూజ చేయతలచి చేతిలోనికి తీసికొనెను. ఆ లింగము రక్తముతో తడిసి ఉండుటచే తడుపబోగా ఆ లింగము దేవి చేతియందు లగ్నమై ఊడిపడలేదు. అతను శివ భక్తుడని గ్రహించి పాపమును చుట్టుకొనినానని ఆ గౌరి గౌతమునితో చెప్పెను. గౌతముడిట్లనెను, "ఈ మహిషాసురుడు పూర్వమున సత్కర్మములు చేయుటచే దేవతలను కూడా జయించెను. అతనిని నీవు చంపుటకు గల కారణం పూర్వము అతనికి మహర్షుల వలన కలిగిన శాప ఫలితము. అందుచే అతనికి ఈ జన్మ ప్రాప్తమయ్యెను. అతను శాపవిమోచనమును కోరగా మహర్షులు దేవీ హస్తముల యందే సిద్ధి లభించునని చెప్పెను. కావుననే అతను నీచేత ఇట్లు హతుడయ్యెను. నీవు విచారింప పనిలేదు. అది లోక శ్రేయస్సు కొరకే. అతడు నీ వలన శాపవిముక్తుడైనాడు. **నీవు అరుణాచల తేజోలింగమును**

దర్శింపుము. పూర్వ జన్మలో అతను అరుణాద్రీశ్వరుని సేవించుటచే నీ పాద స్పర్శ కలిగినది. ఓ గిరిజా! ఒక శిలను నీ ఖడ్గముచే ఛేదింపచేసి దాని నుండి ఉద్భవించిన జలధారతో స్నానము గావించి ఆ జలధారయే ఖడ్గ తీర్థముగా ప్రశస్తిగాంచును. లింగముతో సహా ఒక మాసము ఖడ్గతీర్థము వద్ద నివసింపుము. నీ చేతినుండి విడివడిన లింగమును ఖడ్గతీర్థముపై ప్రతిష్ఠింపుమని ఈ తీర్థమున స్నానము చేసి పూజించిన వారికి సకల పాపములు పోవునని" గౌతముడు పార్వతికి చెప్పెను. **పార్వతీదేవి గౌతముని ఆజ్ఞ ప్రకారము తన ఖడ్గముతో శిలను బ్రద్దలు కొట్టగా భూమి నుండి తొమ్మిది తీర్థములతో కూడిన జలధార పైకి వచ్చెను. తన చేతికి అంటుకునియున్న శివలంగమును ధ్యానించి ఆ జలధారలో తడుపగా ఆ లింగము పార్వతి చేతినుండి విడివడెను.** ఒక మాసము అక్కడే ఉండెను. గౌరీదేవి శివుని ప్రార్థింపగా ఈశ్వరుడు ప్రత్యక్షమయ్యెను. పార్వతిని అనుగ్రహించి ఇట్లనెను, "ఆ మహిషాసురుడు నా భక్తుడు ఆదేశము లేకుండా నా లింగమును గ్రహించి మ్రింగి తన కంఠములో నిలుపుకొనెను. తానే గొప్పవాడని అహంకారముతో నాయందు విశ్వాసమును కోల్పోయెను" అని శివుడు చెప్పెను మరియు శివుడు పార్వతితో ఇట్లనెను, **'నీవు "అపీత కుచాంబిక" అను నామముతో ప్రసిద్ధి పొందెదవు'** అని అనగా గౌరీదేవి ఇట్లనెను. ''ఇచ్చట తేజోలింగముగా సర్వజనులకు, దేవతలకు దర్శనమిచ్చినారు. **కావున మీరొసగిన ఈ దర్శనము ప్రతి సం॥ము కార్తీక మాసమును కృత్తికా నక్షత్రమున ప్రసాదింపవలెన"ని అంబ ప్రార్థించినది.** దానికి పరమేశ్వరుడు తథాస్తు అనెను. **సాక్షాత్ జగజ్జనని అరుణగిరికి ప్రదక్షిణ చేసెను.** దేవతలందరు తమ స్త్రీలతో ఆమె వెంట నడిచిరి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 15

భగవాన్ అరుణాచలములో ఉండిపోవుట

పై చెప్పిన నాలుగు అధ్యాయములలో అరుణాచలము యొక్క మహాత్మ్యమును గాంచిన తరువాత ఆ అరుణాచలము ఒక గిరికాదని సాక్షాత్తు ఆ పరమేశ్వరుని తేజోలింగమే గిరిగా ఆవిర్భవించినదని ఆ గిరి ఎంత మహిమాన్వితమైనదో అక్కడ ఎందరో గొప్ప యోగి పుంగవులు, దేవతలతో సహా ఆ గిరిని స్తుతించెదరని గౌతమ మహాముని వంటివారు పూజించిరని సాక్షాత్తు జగజ్జనని ఐన పార్వతీమాత అక్కడే తపస్సు గావించి దేవతలతో సహా గిరి ప్రదక్షిణ గావించినదని గమనించితిమి. మరియు ఈనాటికి కూడా ఆ పరమేశ్వరుడు ప్రతి సం॥ము కార్తీక మాసమున కృత్తికా నక్షత్రమున అశేష జనులకు దర్శనమిచ్చుచున్నాడు. అటువంటి పరమ పవిత్రమైన ఆ అరుణాచలేశ్వరుడు భగవాన్ రమణుని రప్పించుకొనినారు. పై చెప్పిన రీతిగా **భగవాన్ మొట్టమొదటరాగానే ఆ అరుణాచలేశ్వరుని దర్శించి, "అప్పా నీ ఆజ్ఞ మేరకు వచ్చాను"** అని అన్నారు. ఒక్కసారి తదేకముగా ఆ అరుణాచలేశ్వరుని చూచుకొని భగవాన్ తన్మయత్వులై ఇక మరో రెండవ దర్శనము ఈ సంఘటన జరిగిన తరువాత మూడు సంవత్సరముల వరకు అరుణాచలేశ్వరుని గుడిలో దర్శించుకొనుటకు రాలేదు. భగవాన్ హృదయములో ఆ అరుణాచలేశ్వరుడు ఆత్మరూపేణా ఉండుట ఏనాడో గమనించినారు. కనుకనే మళ్ళీ దర్శనము చేసికొనవలెనని భగవాన్‌కు ఆశ కలుగలేదు. ఆనాటినుండి భగవాన్ అరుణాచలేశ్వరములోనే ఉండెను. భగవాన్ తిరువణ్ణామలై వచ్చినరోజు ఆహారము దొరకలేదు. భగవాన్‌కి ఆకలిదప్పికలెక్కడ ? వారి మనస్సంతా శివ రూపమై ఆ తేజోలింగముపై ధ్యాస తప్ప వారి మనస్సు మామూలు జీవుల వలె ఆకలి దాహములపై వారి మనస్సు పోలేదు. వారు ఏనాడో ఆత్మ సాక్షాత్కారము పొందిన మహమాన్వితుడు. వారి మనస్సులో ఆలోచనలకు చోటెక్కడ ? మనసు ఐహిక సుఖాలపై రేగే మనస్సు కాదు. అసలు వారి మనస్సు లేచుట అనునది లేదు. అదెప్పుడు స్థిరముగనే ఉండును. అంటే వారి మనస్సు ఆత్మలో లయమైపోయినది. భగవానుని మౌనస్వామి చూసెను.

కొద్దిగా భిక్ష పెట్టెను. భగవాన్ ఆ మొట్టమొదటి భిక్షను వారి జీవితములో గుర్తుపెట్టుకొని అవి ఈశ్వరుడు పెట్టినదని భావించి భగవాన్ తమ శిష్యులకు అనేకసార్లు ఆ విషయము జ్ఞప్తికి చేసినారట.

అరుణాచలములో భగవాన్ ఎప్పుడు ధ్యాననిమగ్నులై ఉండేవారు. అసలు మాట్లాడేవారు కాదు. **మనమందరము గుర్తుంచుకొనవలసినది ఎక్కడ మౌనముంటుందో అక్కడ భగవాన్ రమణ మహర్షి ఉన్నట్లే.** ఆహారము కోసము భగవాన్ ఎవ్వరిని అడిగేవారు కాదు. ఎవరైనా భిక్ష ఇస్తే వారు స్పృహలో ఉంటే తప్ప తినేవారు కాదు. వారికి ఆ ప్రదేశము క్రొత్త. ఎవ్వరు చూసేవారు లేరు. **అయినా అరుణాచలేశ్వరుడు వారికి ఉండగా క్రొత్త ప్రదేశము, చూసేవారు ఎందుకు** ? ఆ ఊరిలో పిల్లలు భగవానుని చూచి ఒక పిచ్చివాడని తలచి రాళ్లతో కొట్టేవారు. భగవాన్ రాళ్ళదెబ్బలు తిన్నను బదులు పలికేవారుకారు. ఆహా! వారు శరీరమైతే కదా! రాళ్ళు తగిలితే దెబ్బ తగిలిందనటానికి, బాధ పుట్టిందనటానికి భగవాన్ పాతాళ లింగ గుహలో ప్రవేశించి అక్కడ ధ్యానము చేసుకునేవారు. ఆ గుహ చాలా భయంకరముగా చిమ్మచీకటితో ఉండును. అయినా భగవానుకు భయమెక్కడ ? వారు అన్నిటికి అతీతులు. కావుననే వారికి సుఖదుఃఖాలు, శీతోష్ణాలు, వెలుగుచీకట్లు అనే ద్వైతములు లేనివారు. వారు అన్నింటికి అతీతులు ఆ పాతాళ లింగ గుహలో ధ్యానము చేయుచుండగా ఎన్నో పురుగులు భగవాన్ తొడ క్రింద చేరి రక్తము కారేటట్లు కరిచేవి. భగవాన్ తొడపై ఎన్నో పుండ్లు ఏర్పడినవి. ఐనా వారి ధ్యాస చెదరలేదు. ధ్యానము చెదరలేదు. బాధ తెలియలేదు. భయం ఎరుకలేదు. ఆకలి దప్పికలనే మాటేలేదు. **ఉన్నదొక్కటే మాట అరుణాచల శివ. వారి ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఆ నామమే.** వారి ఆకలి దప్పికలను తీర్చునది ఆ నామమే. పాతాళలింగ గుహలో చిమ్మ చీకటితో నిండినను ఆ గుహలో వెలుగు చూపేది ఆ నామమే. విష పురుగులు భగవాన్ తొడను కుట్టి రక్తము పీల్చి విషమును క్రక్కినను ఆ నామమే అమృతముగా పనిచేసెను. 'అరుణాచల శివ' అనే నామమే వారిని అన్ని వేళలలో ధ్యానములో ముంచి వేసినది. ఆ ఊరి పిల్లలు చివరకు ఆ పాతాళ లింగ గుహలో కూడా ధ్యాన నిమగ్నుడైన భగవానునిపై రాళ్ళు రువ్వినారు. అప్పుడు శేషాద్రి స్వామి

అనే ఒక యోగి భగవానుని గుహలో చూసి ఆ పిల్లల బారినుండి కాపాడినారు. మరొకసారి వేంకటాచల మొదలియార్ అనే అతను కూడా కాపాడినారు. ఆ ఊరిలో ఒక్కొక్కరికి భగవానుని గురించి తెలియుట మొదలైనది.

భగవాన్ పాతాళలింగ గుహ వదిలి సుబ్రహ్మణ్యస్వామి గుడిలో రెండు నెలలున్నారు. అప్పుడు మౌనస్వామి అనే అతను భగవాన్‌కు భోజనము పెట్టి వారిని చూసుకునేవారు. నాలుగు నెలల వరకు భగవాన్ స్నానము చేయలేదు. పొన్నుస్వామి భార్య స్వామికి తలరుద్ది స్నానము చేయించినది. భగవాన్‌కు ఎటువంటి ధ్యాసలేదు. ఆ తరువాత మళ్ళీ ఒక సం॥ము పైగా స్నానము చేయలేదు. ఒక్కొక్క భక్తులు భగవాన్‌కు దగ్గరయ్యారు. నీలకంఠం అనునతడు భగవాన్‌కి క్షౌరం చేయించాలని రాగా భగవాన్ దానికి మాట్లాడలేదు దాదాపు సంవత్సరమున్నర భగవాన్ క్షౌరమే చేసుకొనలేదు. భగవాన్ సుబ్రహ్మణ్యస్వామి గుడి నుండి 'ఉన్న వళయ్' తోటలో చేరారు. అక్కడ ధ్యానము చేసుకుంటూ ఉండిపోయారు. ఎన్నో రోజుల నుండి కౌపీనము ధరించుట వలన అది కూడా చిరిగిపోయినది. పిదప భగవాన్ వాహనాల వెనుక (మండపం దగ్గర) మరియు శివగంగ తీర్థమువద్ద మారేడు చెట్టు క్రింద ధ్యానమును చేసుకున్నారు. విపరీతమైన చలి ఉన్నను భగవాన్ లెక్కచేయలేదు. రత్తమ్మ అనే ఆమె భగవాన్‌కు అన్నము పెట్టినది. ఆవిడ నాట్యకర్త. భగవాన్‌పై భక్తి కలిగి ఆ రత్తమ్మ అనే దేవదాసి తన వృత్తిపై విసుగుచెంది భగవాన్‌కు అన్నము పట్టుకెళ్ళేది. ఇప్ప చెట్టుక్రింద భగవాన్ ధ్యానము చేస్తూ ఉండేవారు. ఒకసారి ఒక అల్లరి పిల్లవాడు స్వామి వెనకాల మూత్రము పోసి పరుగెత్తినాడు. కాని భగవాన్‌కు ఏ స్పర్శ తెలియలేదు. అతని మనసంతా అంతర్‌లోకమే. ఆ లోన కనిపించేది ఆత్మపైనే వారి ధ్యాస. బాహ్యమున జరిగేది వారికి ఏమీ తెలియదు. బాహ్య స్మృతి వచ్చిన పిదప ఆ పిల్లవాడు మూత్ర విసర్జన చేసినట్లు తెలుసుకొనిన భగవాన్ ఏ మాత్రము బాధపడలేదు. పిదప భగవాన్ గురుమూర్తములో నివసించినారు. భగవాన్ వారి శరీరాన్ని పట్టించుకొనక ఉండుట వలన శరీరమంతా దుమ్ముకొట్టుకొని స్నానమే లేక వారి తలవెంట్రుకలు జడలవలె వ్రేలాడి చివరికి వారి చేతులకు ఉన్న గోర్లు కూడా పెద్దవై వంకరలు తిరిగిపోయినవి. భగవాన్ గురుమూర్తములో

ధ్యానము చేసుకుంటున్నప్పుడు ఎన్నో చీమలు వారి శరీరాన్ని కుట్టినాయి. అయినా వారి ధ్యాస అరుణాచల శివపైనే. అసలు వారి శరీరాన్ని కుడుతున్నట్లు కూడా తెలియదు. ఎంత ఆత్మ నిమగ్నులై ఉంటే తప్ప ఆ స్థితికి చేరలేరు. కాలము జరుగుతున్నకొద్దీ అరుణాచలములోని ఎందరో జనులకు స్వామిపై గౌరవములు, భగవాన్ అంటే ఒక ప్రత్యేకత కలిగి భగవాన్‌కు భిక్ష తెచ్చిపెట్టేవారు. ప్రజలలో నైవేద్యం భగవాన్‌కు పెట్టుటకు వారిలో వారికి పోటీలు ఏర్పడ్డాయి. భగవాన్ యొక్క పేరుని మరియు ఎక్కడినుండి వచ్చారో తెలిసికొనుటకు కొందరు ప్రయత్నించిరి. భగవాన్ వారి పోరుపడలేక మౌనముగనే ఉండి "వెంకటరామన్, తిరుచ్చుళి" అని ఇంగ్లీషులో రాసినారు. భగవాన్‌కు పళనిస్వామి అనునతడు పరిచయమయ్యారు. వారు భగవాన్‌ను శరణువేడి అనునిత్యము భగవాన్‌తోనే ఉంటూ భగవానే సర్వముగా భావించి గురువు దైవముగ తలచినారు. భగవాన్ ధ్యానము చాలా తీవ్రముగా సాగినది. వారికి పగలు, రాత్రి అని తెలియకపోయినది. 1898 ఏప్రిల్, మే లలో భగవాన్ పళని స్వామితో కలసి వారు గురుమూర్తము నుండి మామిడి తోపుకు మకాం మార్చినారు. ఎక్కడ ఉన్న స్వామి ధ్యాస ధ్యానముపైననే. ఆత్మావలోకనపై నిమగ్నులై ఎల్లప్పుడు మౌనముగ ఉంటూ ఎవరితోను మాట్లాడక కూర్చుని ఉండెడివారు.

వేరే ప్రదేశమునుండి అరుణాచలమును క్రొత్త ప్రదేశములో ఆ అరుణాచలేశ్వరుని ఆజ్ఞపై విశ్వసించి సర్వం వదులుకుని ఆ అరుణాచలేశ్వరుని సన్నిధిలో చేరి వారి శరీరమును పట్టించుకొనక స్నానము, క్షౌరము, దుస్తులు దేనిపై వ్యామోహము పడక క్రిమికీటకాలు కుట్టి బాధించినను చీమలు ధ్యానములోనున్న భగవానుని కుట్టినను ఎన్నో బాధలు పడినను అసలు బాహ్య స్మృతియే కోల్పోయి చివరికి వారి వెనుక మూత్ర విసర్జనము కావించినను ఎటువంటి స్పర్శ తెలియని ఆ భగవాన్ ఎల్లవేళలా ఆత్మను చూస్తూ వారి ధ్యాస ధ్యానము ఆత్మపైనే ఉన్న ఆ భగవాన్‌ను శరణువేడుకుని మనము కూడా బాహ్య విషయాలపై దృష్టిని మరల్చి మన దృష్టిని అంతర్ముఖము చేసి లోనున్న కైలాసమును కాంచుటకు ఆ కైలాస నాథుడైన అరుణాచలేశ్వరుడు ఆత్మగా నున్న తేజస్సుపై మన దృష్టిని నిలుపుటకు భగవాన్ రమణ మహర్షిని అనన్య శరణాగతిని వేడుదాం.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 16

తల్లి అలగమ్మ భగవాన్ వద్దకు రాక - భగవాన్‌తో ఉండుట - అలగమ్మ నిర్యాణము

భగవాన్ జాడ తెలియక వారి తల్లి మరియు భగవాన్ సోదరులు మిక్కిలి చింతించి కాలము గడుపుచున్న రోజులలో తిరుచ్చుళి గ్రామవాసి ఒకరు వారి ఇంటికివచ్చి వెంకటరామన్ (భగవాన్) జాడ తెలిసినదని అతను ఒక పెద్ద సాధువైనాడని తిరువన్నామలైలో ఉన్నారని వార్త తెచ్చినాడు. నెలియప్పయ్యర్ (భగవాన్ పినతండ్రి) ఒక బంధువుతో కలిసి వెంటనే తిరువణ్ణామలైకి వెళ్ళి భగవాన్‌ని దర్శించి ఆశ్చర్య చకితులైనారు. వారు తమ ఇంటి పరిస్థితిని చెప్పి ఇంటికి తిరిగి రమ్మని బ్రతిమలాడారు. **భగవాన్‌కు బంధువులెక్కడ ? ఇల్లెక్కడ ? బంధమెక్కడ ? అన్ని ఏనాడో తెంచేసుకున్నారు.** వారు శరీరులైతే కదా. వారొక శరీరమనే భావం ఏనాడో వదిలేసినారు. కావున వారి పినతండ్రి ఇంటికి తిరిగి రమ్మని వేడినను భగవాన్ మౌనముగ ఉన్నారు. భగవాన్ భావన వారి స్థితి ఆ పినతండ్రికి ఏమి తెలుసు ? తిరిగి వెళ్ళిపోయినారు.

1898 డిసెంబరు నెలలో భగవాన్ అన్నగారు నాగస్వామి మరియు తల్లి అలగమ్మ అరుణాచలమునకు వచ్చినారు. వారు భగవాన్‌ను చూసి ఆశ్చర్యపడినారు. తల్లి భగవానుని ఇంటికి రమ్మని బ్రతిమలాడింది. భగవాన్‌కి చలనము లేదు. తల్లి ఎంతో దుఃఖించినది. భగవాన్ చుట్టు ఉన్న భక్తులలో ఒకరు తల్లి ఆ విధముగా బ్రతిమలాడుచున్నది కదా! జాబు పలకమని భగవాన్‌ను వేడుకొనగా భగవాన్ ఒక కాగితముపై ఇట్లు వ్రాసిరి –

“కర్త వారి వారి ప్రారబ్ద కర్మానుసారం జీవుల నడిపించును. జరుగనిది ఎవరెంత యత్నించినను జరుగదు. జరుగునది ఎవరెంత అడ్డుపెట్టినను జరుగనే జరుగును. ఇది సత్యం కావున మౌనముగా ఉండుటయే ఉత్తమం” భగవాన్ వ్రాసిన అక్షరములు ఆణిముత్యములే. ఈ నాలుగు వాక్యములను ఎల్లప్పుడు ప్రతిజీవి గుర్తుంచుకొనినచో సంకోచముకాని భయముకాని మన తోవకు రావు. ఆ తల్లి తన ప్రయత్నము విరమించుకొని తిరిగి తన ఊరికి వెళ్ళిపోయినది.

1917వ సం॥న భగవాన్ తల్లి అలగమ్మ తన మనుమడి మ్రొక్కు తీర్చుటకు తిరుపతికి

బయలుదేరినది. మార్గమధ్యములో అరుణాచలమునకు దిగి భగవాన్‌ను చూచుటకు వచ్చినది. దీనికి ముందు 1900 సం॥లో ఆమె పెద్ద కుమారుడు మరణించినాడు. తల్లి అలగమ్మ జీవితముపై విరక్తి చెందినది. మూడవ కుమారుని వివాహము చేసినది. అలగమ్మగారి మరిది సుబ్బయ్యరు 1898 లోనే మరణించినారు. అతని తమ్ముడు నెలియప్పయరు కూడా 1914లో మరణించినాడు. 1914వ సం॥లో తిరుపతికి వెళ్తు భగవాన్‌ని చూడటానికి తల్లి వచ్చియుండెను. ఆమెకు టైఫాయిడ్ జ్వరము వచ్చి పూర్తిగా అనారోగ్యము చెంది మూడు వారాలు భగవాన్ వద్దే ఉండెను. భగవాన్ తల్లికి సేవ చేస్తూ ఉండేవారు. ఆ అరుణాచలేశ్వరుని అనుగ్రహము వలన రోగము తగ్గి ఇంటికి వెళ్ళిపోయినది. 1915వ సం॥లో తన మూడవ కుమారుడు నాగ సుందరం భార్య పసిబిడ్డను వదిలి తాను హఠాత్తుగా మరణించినది. భగవాన్ తల్లికి కష్టాలు ఒకదాని వెనుక ఒకటచి పోటీపడి వచ్చినట్లు అనిపిస్తుంది. భగవాన్ తల్లి ఆ పసిబిడ్డ పుట్టు వెంట్రుకలు తీయించుటకు 1917వ సం॥న తిరుపతికి బయలుదేరి మార్గ మధ్యమున తిరువణ్ణామలైలో దిగి భగవాన్ జాడ తెలిసికొనెను. ఆ సమయములో భగవాన్ విరూపాక్ష గుహలో ఉన్నారు. భగవాన్ శిష్యులు తల్లిని కూడా ఉండటానికి అనుమతి కోరగా ఆ విరూపాక్ష గుహ చిన్నదిగా ఉండుటచే ఆ పై కొండపై నిర్మించిన స్కందాశ్రమమునకు భగవాన్ తమ శిష్యులతోను మరియు తల్లితో మకాం మార్చినారు. 1922 వ సం॥ము డిసెంబర్ వరకు భగవానులు ఆ స్కందాశ్రమములో ఉన్నారు. తల్లిని అరుణాచలంలో వదిలి చిన్న కుమారుడు నాగసుందరం తిరిగి వెళ్ళిపోయినారు.

అలగమ్మ ఆశ్రమములో వంట చేసేవారు కాదు. ఎచ్చమ్మ అనే భక్తురాలు తెచ్చిన అన్నమును తినేవారు. తరువాత భగవాన్ తల్లి వంట చేయటం ప్రారంభించినది. కాని ఆమెకు మడి, ఆచారము ఎక్కువ. భగవాన్‌కు అవంటే దూరము. తన తల్లి మనస్సును మార్చుటకు ఎన్నోసార్లు ప్రయత్నించినారు. అనేకసార్లు భగవాన్ వారి తల్లిని పరిహాసముగా మాట్లాడేవారు. అందరిలో కలిసి ఉండాలని లేనిచో ఇంటికి వెళ్ళమని భగవాన్ అనేవారు. స్కందాశ్రమములో కట్టెలు తెచ్చే మానవాళికి భగవాన్ భోజనము పెట్టమని అడుగగా భగవాన్ తల్లి మడి, ఆచారం అని కూర్చునేది

– భగవాన్ మాత్రం మనిషిలో తేడాలను చూసేవారు కాదు. బ్రాహ్మణుడని మాలవాడని భగవాన్‌కు తారతమ్యములు లేవు. వారు అందరిని ఆత్మగానే భావించేవారు. ఆత్మే పరమాత్మ కావున వారు అందరిని దైవముగనే భావించేవారు. భగవాన్ తల్లికి ఉల్లిపాయలన్న తినేదికాదు. భగవాన్ ఆ ఉల్లిపాయను చూస్తు **"ఓ ఉల్లిపాయా చూడటానికి ఇంత చిన్నగా ఉంటావు. మోక్షానికి వెళ్ళేటప్పుడు ఉల్లిపాయ పర్వతంగా అడ్డువస్తావు కాబోలు"** అని అన్నారు. భగవాన్ ఆడిన పరిహాసములో ఎంతో అర్థమున్నది.

ఒక్కొక్కసారి భగవాన్ తల్లి ఆచారాలకు కోపగించి వారి తల్లిని మందలించేవారు. అలగమ్మ బాధపడేది. భక్తులు భగవాన్‌తో "అమ్మ ఏడుస్తున్నా మాట్లాడరా" అని అనగా భగవాన్ భక్తులతో **"ఏడ్వనీ ఎంత ఏడిస్తే నాకంత సంతోషం. ఇంకా ఎంత ఏడవాలో"** అని అనేవారు. భగవాన్ తల్లిపై ఆ విధముగా ప్రవర్తించుటకు గల కారణం తల్లిలో మార్పు రావాలనే తప్ప వారు తల్లిని బాధపెట్టుట కొరకు కాదు. బహుశ వారి ఉద్దేశ్యము మడి, ఆచారము, మైల ఇవి మనము కల్పించుకొనినవే. బ్రాహ్మణుడు, శూద్రుడు, మాలవాడు మొదలగు భేద భావములు మనము కల్పించుకుని చూస్తున్నవే. నిజానికి ప్రతి జీవుడు దేవుడే. ఆ భగవంతుని చూడక పైపై రూపాలను చూస్తూ ఆ రూపాలకు నామము పెట్టుకుని పిలుస్తూ అజ్ఞానముతో ప్రవర్తించుచున్నాము. కావుననే భగవాన్ ఆ చీకటి ముసుగును తొలగించుటకై చివరకు తన తల్లి అయినను లెక్కించక తల్లిలో మార్పు రావాలని ఆమెకు భగవాన్ బోధ తెలిసికోవాలని ఆమెలోని అహంకారము, మమకారమును తొలగించుటకు ఆడిన నాటకమే.

తల్లి అలగమ్మ నిర్యాణం :– భగవాన్ తల్లి తన జీవితం ఇంకా రెండు మూడు నెలలు ఉందనగా వ్యాధి ఎక్కువై వారి ఆరోగ్యం పాడైపోయినది. ఎన్ని మందులిచ్చినా నిరుపయోగమైనది. భగవాన్ ఆమెకు చివరి ఘడియలు వచ్చినదని గమనించి తల్లివద్ద ఎక్కువసేపు ఉండి ఆమెకు ఆత్మ బోధ చేసేవారు. 19.05.1922 భగవాన్ తన శిష్యులతో సహా ఎవ్వరూ భోజనము చేయలేదు. తల్లికి అంత్యకాలము సమీపించినదని భగవాన్ గ్రహించి ఉదయము నుండి వారు తల్లి దగ్గరే కూర్చుని ఉన్నారు. వారు తమ తల్లి హృదయముపై భగవాన్ కుడి చేతిని మరియు భగవాన్

తమ ఎడమచేతిని తల్లి శిరస్సుపై ఉంచి మౌనముగా తల్లినే చూస్తూ ఆనాటి రాత్రి అమ్మపై నుండి సుమారు 8 గం॥లకు భగవాన్ వారి చేతులను తీసి **"అమ్మ ఇప్పుడు మోక్షములో ఉంది"** అని అన్నారు. భగవాన్ వారి హస్తము ద్వారా భగవాన్‌లోని ఆత్మశక్తిని వారి తల్లిలోనికి ప్రవేశపెట్టారు. వారి తల్లి పూర్వ జన్మ వాసనలు ఈ జన్మకు కారణమైనవి. కావుననే భగవాన్‌లోని ఆ ఆత్మ శక్తి తల్లిలోని పూర్వ జన్మ వాసనలకు మధ్య పోటీ జరిగినది. భగవాన్ ఆత్మశక్తితో తల్లిలోని వాసనలన్ని భస్మమై విముక్తి పొందినారు. భగవాన్ వారి తల్లి నిర్యాణము జరిగినది తెలిసికొని మామూలుగా అక్కడినుండి లేచి ఎటువంటి చింతపడక వారి శిష్యులతో **"మనకు మైలలేదు. మనమింక భోజనము చేయవచ్చు"** అని అన్నారు. భగవాన్ తల్లి మరణించినప్పటికి వారు తమ నిశ్చలస్థితిని చెదరకుండా మామూలు వానివలె యధావిధముగా భోజనము చేసి పైగా 'మైల లేదు' అని అన్నారు. వారు పరిపూర్ణ జ్ఞానులు, మహర్షులు పూర్తిగా ఆత్మబోధ తెలిసినవారు. శరీరముతో బంధము లేనివారు. కావుననే వారి తల్లి మరణించినప్పటికి వారు శరీరాతీతులుగా ఉండి వారికి సంబంధము ఏమి లేనివారుగా ప్రవర్తించి అటువంటి స్థితిలో ఉన్న భగవానునికి ఇక మైల ఏమిటి ? మనము కూడ నిజంగా భగవాన్‌కు అనన్య శరణాగతి అయినచో ఆ ధైర్యాన్ని మనము తెచ్చుకొని మనవారు ఎవరైను తనువు చాలించినచో ఆత్మావలోకన కలిగి ఎటువంటి దుఃఖము పొందకూడదు. గీతలో కృష్ణ పరమాత్ముడు కూడా చెప్పిందీ ఇదే. నశించునది శరీరమేకాని ఆత్మకు చావులేదని కావున మనము ఆ స్థితికి ఎదగాలి. సాధన చేయాలి. అభ్యాసము చేయాలి. వైరాగ్యమును పెంపొందించాలి. ధైర్యాన్ని తెచ్చుకోవాలి. కావున ఆ భగవానుడిని శరణువేడుదాం. ఓ రమణా నీవే మాకు శరణు.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 17

మాతృభూతేశ్వర ఆలయం

భగవాన్ వారి దివ్య హస్తములతో తమ శక్తిపాతాన్ని తల్లి అలగమ్మకు ప్రసాదించి మోక్షమిచ్చారు. తల్లి నిర్యాణము రోజున ఆ రోజురాత్రి అంతా భక్తుల భజనలతో కాలము గడిపారు. తల్లిదేహమును దహనము చేయవలెనా ? లేక సమాధి చేయవలెనా ? అని సంకోచించుచుండగా **భగవాన్ ముక్తురాలి దేహమునకు ఎల్లప్పుడూ సమాధి చేయవలెనని దహనము చేయకూడదని చెప్పెను.** కావున ఆ మర్నాడు అలగమ్మను స్కందాశ్రమము నుండి తీర్థపు చెరువునకు దక్షిణామూర్తి మంటపమునకు మధ్యనున్న అశ్వత్థ వృక్షము వద్ద గోతిని త్రవ్వి శరీరాన్ని అందుంచి ఎన్నో పరిమళ ద్రవ్యములతో నింపి పూడ్చినారు. దానిపై ఇటుకలతో సమాధి కట్టినారు. అదే సమయానికి కాశీనుండి ఒక శివలింగము వచ్చినది. దానిపై స్థాపన చేసినారు. తల్లి సమాధి దానిపైనున్న శివలింగమునకు మాతృ భూతేశ్వరనామం చేసినారు. తల్లి సమాధి వద్ద ఎవ్వరూ ఉండేవారు కాదు. తల్లి సమాధిపై చిన్న కుటీరము నిర్మించినారు. భగవాన్ తల్లి సమాధి వద్దకు వచ్చి కొంతసేపు గడిపి తిరిగ స్కందాశ్రమమునకు వెళ్ళేవారు. ఒకసారి వారి జయంతికి ముందు అమ్మ సమాధి వద్దకు వచ్చి అక్కడే ఉండిపోయారు. ఇక అక్కడే ఉండెదనని ఆనతిచ్చినారు. ఆ కారణము చేత భక్తులు అక్కడ ఆశ్రమాన్ని ఏర్పాటు చేసినారు.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 18

భగవాన్ దినచర్య

భగవాన్ తమ దిన చర్యలు ఈ విధంగా ఉండెడవి.

1. ఉదయము మూడు గంటలకు లేచేవారు.
2. కాలకృత్యములు తీర్చుకుని కూరలు తరిగేవారు.
3. ఫలహారం తయారు చేసేవారు.
4. ఉదయం 5 గంటలకు భగవాన్ ఉన్న హాలు తలుపు తెరిచేవారు.
5. అప్పటినుండి భగవాన్ దర్శనం చేసుకోవచ్చును.
6. ఉపనిషత్తులు పారాయణం చేసేవారు.
7. ధ్యానం చేసేవారు.
8. గం. 6.30 ని.లకు స్వామి స్నానం చేసేవారు.
9. ఫలహారం చేసేవారు.
10. తరువాత కొండమీదకు వెళ్ళేవారు.
11. కొందరికి పూలదండలు కట్టమని మరికొందరికి సామాగ్రి (వంట) ఊరినుండి తెమ్మని ఇంకొందరికి వంట పనికి, మరికొందరికి పశువులను చూచుకొనుటకు పూరమాయించేవారు.
12. 8 గంటలకు భగవాన్ తిరిగి హాలులో సోఫాపై కూర్చునేవారు.
13. భగవాన్ మౌనముగానే ఉండేవారు.
14. సరియైన ప్రశ్నలకు మాత్రమే సమాధానమిచ్చేవారు.
15. 9 గంటలకు పోస్టు ద్వారా వచ్చిన ప్రశ్నలకు జాబు ఇచ్చేవారు.
16. తరువాత భక్తులతో గోష్ఠి.

17. 11 గంటలకు మధ్యాహ్న భోజనం

18. 2 గంటల వరకు విరామం. ఆ సమయములోనే భగవాన్ పత్రిక చదవటము లేదా విశ్రాంతి తీసుకోవటం జరుగును.

19. 2.30 గంటలకు టీగాని, కాఫీగాని భక్తులకిచ్చేవారు.

20. భగవాన్ మళ్ళీ హాలులో కూర్చొనెడివారు.

21. సాయంత్రం 4.30 గంటలకు భగవాన్ తిరిగి కొండమీదకు వెళ్ళేవారు.

22. సాయంత్రం 5.30 గంటలకు ధ్యానసమయం.

23. ఆ తరువాత గ్రంథ పఠనం చేసేవారు.

24. మాతృ భూతేశ్వర ఆలయంలో పూజ జరిగేది.

25. 7.30 గంటలకు రాత్రి భోజనం.

26. 8.30 గంటలకు శిష్యులు వెళ్ళిపోయేవారు.

27. స్వామి హాలు తలుపులు వేసేవారు.

28. స్త్రీలు రాత్రులందు ఆశ్రమంలో ఉండుట నిషేదం. వారు భోజనము చేసి ఊరిలోనికి వెళ్ళిపోవలెను.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 19

ఆణిముత్యాలు - 1 (ఆచారాలు)

భగవాన్ వారి యొక్క లీలలు అనంతముగా దేశమంతట వ్యాపించి ఎందరో భక్తులు భగవాన్ దర్శనానికి విదేశీయులతో సహా వచ్చి పోతుండేవారు. వారు ఎన్నో గొప్ప విషయాలు మరియు ఆత్మ సాక్షాత్కారము గురించి భగవాన్ దివ్యమైన ఆత్మబోధలను ఎన్నో చేశారు. నిజానికి భగవాన్ గురించి వ్రాయటమంటే ఏమి వ్రాయగలం. వారు చెప్పిన బోధలు సముద్రమంత వైశాల్యము కలిగి మరియు సముద్రమంత లోతులో ఉండేటటువంటి బోధలు ఎన్నెన్నో కలవు. అన్నీ వ్రాయుటకు కష్టం. ఎందుకంటే వారు చెప్పిన ప్రతి మాటలో అంతరార్థం దాగియున్నది. అన్ని ఏరి పట్టుకుని వ్రాయటం అంటే నా బోటి వారికి ఎంతో కష్టసాధ్యమైనది. భగవాన్‌ని అనన్యశరణాగతి కోరి సముద్రమువంటి వారి బోధలలో కొన్ని ఆణిముత్యాలను స్వీకరించి తెలియపరుచున్నాము. ఇకనుంచి వచ్చే ప్రతి అధ్యాయము ఆణిముత్యములుగా పరిగణింపబడినది.

భగవాన్ వారి తల్లి నిర్యాణము చెందిన పిదప వెంటనే లేచి వచ్చి అందరితో భోజనం చేసినారు అని చెప్పుట జరిగినది. భగవాన్‌కు ఎటువంటి మైల, ఆచారాలు, పట్టింపులు చూపేవారు కాదు. వారి వద్ద వచ్చిన భక్తులను వారికున్న ఆచారలనే బంధాన్ని తప్పించుటకు భగవాన్ ప్రయత్నించేవారు. పైగా భగవాన్ ఎల్లప్పుడు **"ఏదీ వద్దు. నిశ్చలముగా కూర్చో అదే సరైనది. ఏ యాత్రా అవసరము లేదు. ఈ అరుణాచలమే కాశీ, హిమాచలం"** అని అనేవారు. మురుగనార్ తల్లి ఆబ్దికము రోజున ఒక పెద్ద పనసకాయను తెచ్చి ఆశ్రమములో ఉన్నవారి అందరికి పంచిపెట్టుచుండెను. అదే సమయమున భగవాన్ అక్కడకు వచ్చి "ఈ **మమకారాలు ఇంకా పోలేదన్నమాట" అని అన్నారు. భగవాన్ మరియు ఇట్లనెను, "క్రతువులు కూడా మనిషికి బంధాలే"** ఇది వినటానికి సంశయముగా ఉన్నప్పటికి భగవాన్ చెప్పినది అక్షర సత్యం. మనిషి జీవించి ఉండగనే ముక్తి పొందవలెను. వారే జీవన్ముక్తులు. దానికి మనిషి బంధాలను తెంచుకోవటమే మార్గము. **ఏ బంధము లేనివాడు జీవన్ముక్తుడే.** కర్మాణుగుణముగా

కర్తవ్యానుసారముగా మనిషి తల్లి, తండ్రి, భర్త, భార్య పుత్రులు ఈ విధమైన సంబంధం మన శరీరానికి మాత్రమే పెట్టుకున్న బంధాలే తప్పలోన ఆత్మకుకాదు. భగవాన్ మురుగనాద్ గారి తల్లి ఆబ్దీకము రోజున పనసకాయ పంచుట చూచి మమకారము ఇంకా వీడలేదని గ్రహించిన భగవాన్ తన భక్తునికి సూచన నిచ్చినారు. చివరికి క్రతువులు చేసినను అవి బంధాలే అవుతాయని నిర్ధారించినారు.

సుందరేశయ్యర్ అనునతడు భగవాన్ భక్తుడు. వీరి విషయములో కూడా ఒకసారి వారితండ్రి గారికి తర్పణము వదలాలనే ఉద్దేశ్యముతో ఆ తర్పణము చేసే రోజున ఏ ఫలహారము తీసికొనక కార్య నిమగ్నులైయున్నారు. అది గమనించిన భగవాన్ తన భక్తుడిని ఫలహారము చేసినంత మాత్రమున వారికి ఏ హాని జరుగదని భగవాన్ హామీ ఇచ్చినారు. సంపూర్ణమ్మ అనే భక్తురాలు అరుణాచలంలో రమణాశ్రమమున కొన్ని రోజులు వంటపని చేసినారు. ఆశ్రమములో ఆడవారు బైట ఉన్న సమయమున ఆశ్రమ భోజనము చేయరు. ఎక్కడో వేరేచోట ఏర్పాటు చేసేవారు. ఒకసారి సంపూర్ణమ్మ బైట ఉన్న సమయమున ఆమెకు భోజనము ఎక్కడా ఏర్పాటు కాలేదు. కావున ముష్టివారు ఉన్న మంటపములో కూర్చుని ఉన్నది. భగవాన్ ఆరోజు సంపూర్ణమ్మ ఏది అని అడిగినారు. జరిగినది భగవానుకు చెప్పగా భగవాన్ ఆమెకు భోజనము పెట్టండని ఆజ్ఞాపించినారు. ఆశ్రమములోని వారు భోజనమును మంటపమునకు తీసుకుపోయి పెట్టెదమని భగవానుని వేడగా అందుకు భగవాన్ కోపించి **"ఏం కర్మం ఆమెను రమ్మనండి. బైట ఉంటేనేం అంతా బ్రహ్మం. ముట్టేమిటి. ఇక్కడికి రమ్మనండి అని భగవాన్ ఆజ్ఞాపించినారు.** భగవాన్ స్కందాశ్రమములో ఉన్నప్పుడు కూడా ఆ ఆశ్రమమునకు కట్టెలు తెచ్చేవానికి భోజనము పెట్టమని తల్లికి చెప్పేవారు. భగవాన్ తల్లిమడి ఆచారము ఉన్నను భగవాన్ ఏ మనిషిలోను తారతమ్యాలు చూసేవారు కాదు. అలాగే రంగన్న అనే భక్తుడు తన తండ్రికి తర్పణం విడవడానికి ఊరికి వెళతానంటే భగవాన్ ఒక గ్రూపు ఫోటోలో ఉన్న అతని తండ్రిని చూపి నీ తండ్రి ఇక్కడే ఉన్నారు" అని అన్నారు.

ఒకసారి ఆశ్రమం వంటింట్లో పనిచేసే ఒక ఆడమనిషి బైట ఉన్నదని ఆమెకు ఫలహారం

వేరుగా చేసి ఇవ్వబోగా అది గ్రహించిన భగవాన్ **"అదేమిటి ? బైట ఉంటే మైలా ఏ మైల ఎందుకు మైల. అట్లా భేదం చూపకండి"** అని అన్నారు.

భగవాన్‌పై చెప్పిన పలుకులు ఆణిముత్యాలు వారి బోధనలో ఎన్నో రహస్యాలు ప్రకాశించి ధైర్యశక్తిని కలుగచేయును. అయితే వాటిని దృఢముగా నమ్ముకుని విశ్వసించి భగవాన్ చెప్పిన ప్రతిమాటలో గూఢార్ధమును గ్రహించి శరీరము అనేమాట మరచి ఆత్మ అనేమాట ఎల్లప్పుడు తలచి ఉన్నవారికి ఎటువంటి బంధములు, క్రతువులు, ఆచారములు, మైల మడి అనునటువంటివి ఏమీ ఉండవు. ఆ దృఢమైన నమ్మకాన్ని, విశ్వాసాన్ని, ధైర్యాన్ని మనకు కూడా కలుగవలెనని భగవాన్ శ్రీ రమణ మహర్షిని శరణువేడుదాం. రమణా! నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 20

ఆణిముత్యాలు - 2 (ధ్యానం)

భగవాన్ ఎప్పుడు చెప్తూ ఉండేవారు. ధ్యానం చేయదలచుకుంటే నీలోనే ఉన్న నేనుపై దృష్టిని పెట్టమని. అదే ఆత్మ. ఒకసారి ఒక భక్తుడు తనకు ఎప్పుడు ధ్యానములో కూర్చోవాలనుకున్నా కుదరటము లేదని తను ఆశ్రమములో చేసే పనుల వలన అభ్యంతరము కలుగుతున్నదని భగవాన్‌కు విన్నవించుకున్నారు. దానికి భగవాన్ ఆణిముత్యము వంటి సందేశమిచ్చినారు. అదేమనగా, **"నీ మనసుని ఉండవలసిన స్థలములో నిలుపు. నీ దేహాన్ని పని చేయనీ"** అని అన్నారు. సుబ్బ లక్ష్మమ్మ అనే మరో భక్తురాలు ఉండెడిది. ఆవిడకి ధ్యానమంటే ఇష్టం. ఆశ్రమములో తీరుబడి లేకపోవుటచే ఆవిడ తన ఊరికి వెళ్ళి ఒక సంవత్సము ఉండి ధ్యానములోనే కాలం గడిపేది. ఐనా ఆవిడ మనసు మాత్రము ఆశ్రమముపై ఉండేది. తిరిగి ఆమె ఆశ్రమమునకు వచ్చినపుడు భగవాన్ ఆమెతో "నీకు ధ్యానమంటే ఇష్టమా నీ మనస్సు ధ్యానం మీదనే ఉన్నట్లుంది" అని అనగా ఆమె భగవాన్‌తో తనకు వంటపనులే ఉండుటచే కుదరటం లేదని చెప్పగా భగవాన్ ఇట్లనినారు, **"ఈ కాలు, చెయ్యి పనులు చేస్తూ ఉండనీ. నువ్వు కాలు చెయ్యివి కాదుగా. నువ్వు ఏమీ చేయక తటస్థంగా ఉండే వస్తువువు. అది నీకు ఎరుక కలగనంత వరకు కష్టం. ఆ ఎరుక కలిగినచో ఏదీ కష్టమనిపించదు. ఈ దేహము రాగద్వేషములతో ఉండును. కావున పనికష్టముగా అగుపించును. ఈ దేహము 'నేను' అనుకున్నంతకాలము ఏ పనీ లేకుండా కూర్చుని ఉంటే మనస్సు ఊరుకుని నిలకడగా కూర్చుంటుందా ? అది మనము నిద్రపోయినా కూడా ఊరకే ఉండదు. కలలో కూడా తిరుగుతూనే ఉంటుంది.**

భగవాన్ ధ్యానము గురించి ఎల్లప్పుడు ప్రతి వారిని తమ నిజ స్వరూపాన్ని ధ్యానించమని గుర్తుచేస్తూ ఉండేవారు. శరీరము, బుద్ధి, ఆవేశాలు ఇవన్నీ నీవు కావని కూడా చెప్పేవారు. భగవాన్ ధ్యానము చేసేవానికి, ఆత్మ విచారం అనుసరించే వానికి లక్ష్యం ఒక్కటే అని మనో నిశ్చలత అనేది కొందరికి ధ్యానం వల్ల మరికొందరికి జ్ఞానం వల్ల లభిస్తుందనేవారు. 'నేను' పై

ధ్యాస ఉంచమనేవారు. అది ఆత్మకి దారి చూపునని మిగిలినవి ఇంకేవిధముగానైనా చేసినను చివరికి అవి కూడా ఆత్మకి దారితీయునని అంటే మొదటి మార్గమైన 'నేను' పై ధ్యాస ఉంచటంకు వచ్చి చేరుతాయని చెప్పేవారు. ఇతర పద్ధతులన్నీ సాధన చేసే వారికి ఒక రకమైన మానసిక నిశ్చలత మొదట కలిగి పిదప ఆత్మపై అవగాహన కలుగును. కావున మిగిలినవన్నీ పరోక్ష పద్ధతులే. అవన్నీ ఆత్మ జ్ఞానానికి లేదు ఆత్మ విచారానికి తెలిసికొనుటకు ఉపయోగపడును. ఒకసారి ఒక భక్తుడు దేనిపైనైనను ధ్యానం చేయటమంటే ఇష్టపడేవారు. కాని ఆత్మ విచారణ మార్గమంటే కష్టమనేవారు. అసలు ఆ ఆత్మ విచారణ మార్గముపై అయిష్టత కూడా చూపేవారు. ఆ విషయమును భగవాన్ ముందుకు తెచ్చినపుడు భగవాన్ చెప్పినది ఏమనగా **ఎవరికైనను తనకు నచ్చిన అభ్యాసాన్నే చేసుకోమని అది తుట్ట తుదకు అప్రయత్నముగానే ఆత్మ జ్ఞానము కలిగిస్తుందన్నారు. భగవాన్ ధ్యానానికి ఇచ్చిన నిర్వచనము ఇతర భావనలన్నీ విడిచిపెట్టి ఒకే ఒక భావముపై మనసును ఏకాగ్రత చేయమన్నారు.** ఇంకొద్ది మెట్టు ఎక్కినవారు అసలైన ధ్యానమంటే మనస్సుని ఆత్మపైనే లగ్నం చేయమనేవారు. ఈ రెండవరకమైన ఉన్నతస్థాయిలో చేసే ధ్యానాన్ని ఆత్మ విచారానికి మారుపేరే అవుతుంది. అనగా మనస్సుని ఆత్మపై లగ్నం చేయటమే ఆత్మవిచారమంటే మరియు ధ్యానము కూడా.

భగవాన్ మరొక ముఖ్య విషయము కూడా సాధకులకు తెలియచెప్పారు. అదేమనగా ధ్యానము మరియు విచారణ రెండు ఒక్కటేనని. వాటి మధ్య తారతమ్యములు లేవని. విచారణ చేసేవారు 'నేనెవరిని' అని ప్రశ్నించుకుంటూ చివరికి ఆత్మ అంటే తెలుస్తుంది. 'నేను' అంటే శరీరముకాదనిలోనున్న ఆత్మయే 'నేన'ని తెలుస్తుంది. ఈ విచారణ చేయలేని వారు ధ్యానము చేసుకోమన్నారు. ధ్యానము చేసేవారు తనను తాను మరచి అనగా **'నేను చేస్తున్నాను' అని కూడా మరచి. "నేను బ్రహ్మాన్ని లేక నేను ఈశ్వరుడను" అని తలుస్తూ సాధకుడు ధ్యానించాలి. ఈ పద్ధతిని విడువకుండా చేస్తూపోతే చివరికి బ్రహ్మము లేక ఈశ్వరుడు అనే ఎరుక కలుగుతుంది. అదే ఆత్మ.** కావున ధ్యానము, విచారణము రెండూ ఒక్కటే. ఒకే మార్గాన్ని చూపుతాయి. ఆత్మంటే ఏమిటో తెలుపుతాయి. భగవాన్ చెప్పినది ఒక భావమును పట్టుకుని ఉంటే ఆ భావము ఇతర

ఆలోచనలను రానీయకుండా మనస్సును ఎటూ పోనీకుండా ఉండటానికి ధ్యానము చేస్తే శక్తి కలుగుతుందని ఆ భావాన్ని విడవకుండా ఉండుటయే ధ్యానమని దానివల్ల ఆలోచనలన్ని పోయి ఒక్క ఆత్మే మిగులుతుంది. ఆత్మలో లీనమై చివరకు తాను ధ్యానము చేస్తున్నాననే భావము కూడా లేకుండా ఉండాలని భగవాన్ చెప్పేవారు. ధ్యానమంటే ఆత్మ నిష్ఠే అని మన మనసులోని భావాలన్ని తొలగించటానికి చేసే ప్రయత్నాన్నే ధ్యానమందురు. ఆ ఆలోచనలన్ని (భావాలు) పోగా స్థిర మనస్సు ఏర్పడును. అటువంటి మనస్సే ఆత్మ అనగా మిగలినదే ఆత్మ. కొందరు భక్తులు ధ్యానము చేస్తున్నప్పుడు నిద్ర వస్తున్నదని ఆ నిద్రను ఆపుటకు ప్రయత్నిస్తున్నామని భగవాన్‌కి చెప్పేవారు. దానికి **భగవాన్ నిద్రను ఆపటానికి ప్రయత్నిస్తున్నావంటే ధ్యానములో కూడా ఆలోచన కొనసాగుతున్నదని" భగవాన్ హెచ్చరించేవారు.** భగవంతుడు ఆత్మరూపేణా "నేనున్నా" నని ఎరుక ఉన్నంతవరకు భగవత్ సాక్షాత్కారం కలిగినట్లే. ఆ ఎరుక లేనివారు మాత్రమే భగవంతుని అన్నిచోట్ల వెతుకుట ఆరంభిస్తారు. కొందరు కనుబొమ్మల మధ్య భగవంతుడున్నాడనే భావనతో ధ్యానము చేసేవారూ ఉన్నారు. అవన్నీ కూడా ఏకాగ్రత్తను మాత్రమే పెంచుకోవటానికి ఉపయోగపడుతుంది. భగవాన్ భగవంతుని నామము మరియు ఆత్మ ఒక్కటేనని చెప్పేవారు. ఆత్మసాక్షాత్కారము కలిగినవారికి వారి హృదయంలో భగవాన్ స్మరణము అనుకోకుండానే సాగిపోతుందని చెప్పేవారు. కొందరు భక్తులు ఆత్మ సాక్షాత్కారము లేదా ఆత్మ గురించి తెలుసుకోవటానికి ఏ శాస్త్రాలు ఉపయోగపడునని భగవాన్‌ని ప్రశ్నించినపుడు భగవాన్ దానికి జవాబుగా ఏ శాస్త్రాలను కూడా చదువ వలసిన పని లేదనేవారు. ఆత్మను గురించి తెలిసికోవటానికి ఏ పనులు అడ్డురావని కూడా చెప్పేవారు. "నీలో నీవు నేను నేను (అహం) అని అనుకున్నట్లు అయితే అలా కొనసాగగా ఆత్మ స్థితికి నీవే చేరుతావు. ఏ పనిచేస్తున్నా కూడా అట్లాగే అనుకుంటూ ఉండమని ఆ నేను అనేదే భగవంతుని నామమని" చెప్పేవారు. ఏ పని చేసినా ఆ పనిలోనున్న నేను చేస్తుందని కాని ఆ పని చేసేది నీవేనని (నేను శరీరము) అని అనుకోవద్దని భగవాన్ చెప్పేవారు. నేను చేస్తున్నాను అనే ఆలోచన కర్తృత్వ భావం కలిగి అదే మనలో ఎన్నో భావాలకి కారణమై ఉంటుంది. దానివలన మనస్సు ఏ విషయములపై తలంపులు

ఉంటుందో దానికి సంబంధమైన ఆలోచనలు బైటకి తెస్తాయి ఇన్ని తలంపులకు ఆలోచించు వాడే మూలము. నేను. అనేది తప్ప మిగిలినవన్నీ అనగా వచ్చిపోయే ఆలోచనలు మారుతూ ఉంటాయి. కాని నేను అనే ఆలోచన స్థిరము. ఆ నేను అనే తలంపు మీదే శ్రద్ధను ఉంచినట్లయితే ఇతర ఆలోచనలన్ని వాటంతట అవే వెళ్ళిపోతాయి" అని భగవాన్ చెప్పేవారు. భగవాన్ మరొక ముఖ్యమైన విషయం కూడా చెప్పారు. ఈశ్వరార్పణముతో చేసిన పనులు నిశ్చలత్వము పొంది సరైన ధ్యానానికి శక్తిని చేకూరుస్తుందని అదే ఫలాపేక్షతో చేసే పనిమాత్రం భారమనిపిస్తుందని నేను చేస్తున్నాననే భావము కూడా కలిగి దాని వలన ఆ చేసే పని కూడా ఎలా చేయాలో అనే సంకోచము మరియు భయం కలుగుతుందని ఆ భయం వలన ఫలితం ఏ విధముగా ఉంటుందో అనే తపన తప్ప ఆత్మ విచారము దూరమయిపోతుంది. కావున భగవాన్ చెప్పినదేమనగా మనము చేసే పనులు విసుగుతో లేదా యాంత్రికంగా కాని చేయకూడదని పూర్తి శ్రద్ధాభక్తులతో ధ్యాస పెట్టి ఎరుకతో పనిచేయవలెనని భగవాన్ చెప్పేవారు.

కాబట్టి భగవాన్ ధ్యానము గురించి చెప్పిన ఆణిముత్యముల వంటి బోధలను గ్రహించిన సాధకులు ఆత్మ సాక్షాత్కారాన్ని పొందగలరు. వారి బోధలను మనకు అవగాహన కలగాలని భగవాన్ కృప మనపై ఉండాలని ఆ భగవానుని శరణు వేడుకుంటూ మనము కూడా ధ్యానాన్ని ప్రారంభిద్దాం. రమణుని అనన్య శరణాగతి వేడుదాం. ఓ భగవాన్ రమణా నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 21

ఆణిముత్యాలు - 3 (గురువు)

భగవాన్ రమణ మహర్షుల వారికి గురువు లేరని అందరికి తెలిసిన విషయమే. ఐతే కొందరు భగవాన్ మార్గాన్ని చూచిన పిదప గురువు అవసరము లేదనే భావంతో ఉన్నవారూ కలరు. దానికి భగవాన్ జవాబు గురువు అక్కరలేదని ఎప్పుడూ చెప్పలేదని వారు చెప్పారు. ఐతే గురువు మానవ రూపంలోనే ఉండనవసరం లేదని వారు చెప్పారు. ప్రతి జీవిలోనున్న ఆత్మే గురువు, దైవం అంటాను అని భగవాన్ చెప్పారు. భగవాన్‌కి మానవ రూపంలో గురువు ఎవరూ లేరు. కాని భగవాన్‌కు ఆ అరుణాచలేశ్వరుడు వారి హృదయములో ఆత్మ రూపముగా ఉన్నారని వారికి తెలుసు. కావున వారికి ఆ అరుణాచలేశ్వరుడే గురువు. బాహ్యంగా మానవ రూపంలో ఉన్న గురువు వారికి లేరు. మొట్టమొదటిసారిగా 'అరుణాచలం' అనుమాట విన్నప్పుడే ఆయన స్థితి మారిపోయినది. వారిని పట్టుకొని అరుణాచలం వరకు తీసుకువచ్చినది. ఆ అరుణాచలము అనే నామము వారిని మహర్షిగా తీర్చిదిద్ది ఆత్మబోధ కలిగి అరుణాచలేశ్వరుడు బాహ్యముగా కాక భగవాన్ అంతరంగములోనే ఆత్మ రూపేణా సాక్షాత్కరించినారు. **కావున వారికి ఆత్మే గురువు.** భగవాన్ వారి వద్దనున్న భక్తులకు గురువు గురించి కొన్ని ముఖ్యమైన ఆణిముత్యాలలాంటి బోధలను తెల్పారు. కొందరు వారికి గురువు కలరని భగవాన్‌కు చెప్పి వారి గురువు సరియైన వారో కాదో లేదా యోగ్యత ఉన్నవారో కాదో అని భగవాన్‌ను ప్రశ్నింపగా భగవాన్ దానికి **"ఆయన (గురువు) స్థితిని కనిపెట్టగల సామర్థ్యం మీకెంత ఉంది ? అసలు శిష్యునికి భక్తియే ముఖ్యం. కాని గురువు యోగ్యతకాదు. గొప్ప భక్తితో సేవిస్తే ఒక రాయి కూడా పరమేశ్వరుడు అవుతాడు."**

నిజమైన గురువు తాను ఆత్మ సాక్షాత్కారము పొంది ఇతరులకు కూడా ఆత్మ సాక్షాత్కారము వైపుకు త్రిప్పగలిగే వారే అసలైన గురువు. **భగవాన్ దృష్టిలో గురువన్నా, దైవమన్నా మరియు ఆత్మ అన్నా ఒకటే అనేవారు.** ప్రతి జీవి హృదయములో గురువు ఆత్మరూపేణా ఉంటారని ఆ

గురువు బాహ్యముగా మరియు అంతరమున కూడా ఉండి వారి శక్తిని ప్రసరింపచేస్తారు. బాహ్య రూపేణా ఉన్న గురువు శిష్యుని ఆత్మబోధపై ఆసక్తిని కలుగుచేసి ఆ శిష్యుడు ఆత్మపైనే లగ్నమయ్యేటట్లు చేస్తారు. భగవాన్ ఆత్మ సాక్షాత్కారాన్ని కోరే ప్రతివారికి గురు ఆవశ్యకత అవసరమని చెప్పేవారు. **భగవాన్ భక్తులకి చెప్పినదేమనగా గురువు లోపలే ఉన్నారని బైట ఎక్కడో ఉన్నాడన్న భావాన్ని తొలగించమని పైగా నేను ఒక శరీరాన్ని అన్న భావం ఉన్నవారికి ఆ విధంగా భావిస్తున్నంత వరకు వెలుపల దేహముకల గురువు అవసరమే అని భగవాన్ చెప్పేవారు.** ఆ దేహంతో ఉండే బంధముపోతే గురువంటే లోనున్న ఆత్మే అనే ఎరుక తెలుస్తుంది. భగవాన్ మరియొక ముఖ్యమైన విషయం చెప్పినదేమనగా **"నీవు శరీరానివి మరియు నీకు దేహం ఉండటం వల్ల ఆ గురువుకు కూడా దేహముంటుందని అనుకుంటావు. అసలు గురువైనవాడు ఏదో ఒకటి చేయమని చెప్పరని అటువంటి గురువు గురువుకాదని భగవాన్ నిర్ధారించినారు. అటువంటి గురువులు మనకున్న బంధాలను ఇంకా అవీ ఇవీ చేయమనుట వలన బంధాలను బిగించినవారే ఔతారుతప్ప బంధ విముక్తిని చేయజాలడు.** గురువే ఆత్మ అన్న నిజం తెలియటానికి గురుకృప అవసరం. జ్ఞానాన్ని పొందాలనుకునే సాధకుడు అతని భక్తితో దైవత్వాన్ని జయించి అతని భక్తి పండి ఆ వ్యక్తి యొక్క ఆత్మని కనిపెట్టిన సర్వేశ్వరుడు ప్రత్యక్షమై స్థూలరూపము ధరించి ఆ భక్తుణ్ణి ఆశీర్వదించి తనలో విలీనం చేసుకుంటాడు.

భగవాన్ గురువు యొక్క స్వరూపాన్ని ఈ విధంగా చెప్పారు.

1. ప్రశాంతత, ఓర్పు కలిగివుండాలి.
2. చూపుతోనే అందరిని ఆకర్షించగలగాలి.
3. భేదము లేకుండా సమభావం ఉండాలి.

భగవాన్ గురు రూపాన్ని తెలుసుకోవాలంటే ఆ తెలుసుకునేవాడు ముందుగా తన స్వరూపాన్ని తెలిసికొని విశ్వమంతా గురువుగానే భావించి ప్రతి జీవునులో గురువునే చూడాలని చెప్పారు. **విముక్తి కోరేవారు బైట ఆ విముక్తిని పొందలేరని దానికి బాహ్య గురువు లోపలికి తోస్తారని లోనున్న గురువు లాక్కుంటాడని ఆ క్రియయే గురువు యొక్క అనుగ్రహమని భగవాన్ చెప్పేవారు.**

శ్రీ దత్తునికి 24 మంది గురువులు కలరని వాటిలో పంచభూతాలు కూడా ఉన్నాయని కావున **గురువు అనేవాడు మానవ రూపములోనే ఉండవలెననే నియమము లేదని భగవాన్ చెప్పారు.** సాధకుడు భక్తిలో ఉన్నప్పుడు తన ప్రారంభదశలో తనకు అవి కావాలి ఇవి కావాలనే కోర్కెలతో భగవంతుణ్ణి ఆరాధిస్తాడు. తన భక్తి పాకం పండిన తరువాత తన వాంఛలన్ని భౌతిక సుఖాలకొరకే అని ఎరింగి ఆ కోరికలను కోరుట మానివేస్తాడు. కాని కేవలము భగవంతుని కోసమే ఆరాధిస్తాడు. అట్టి సమయములో దైవము మానవ రూపములో లోకములో అవతరించి మనిషి రూపేణా మరియొక విధముగా దర్శనమిస్తాడు. ఆ భక్తుడిని తన వద్దకు తీసుకుంటాడు. **అవసరము వచ్చినప్పుడు ఆత్మే గురువుగా బైట సాక్షాత్కరిస్తుందని భగవాన్ చెప్పేవారు.** అసలు గురువంటే 'గురి' అని అర్ధం. అనగా ఏకాగ్రతే భగవాన్ మరియొక అతి ముఖ్యమైన విషయము బైట పెట్టినారు. గురువు ఆత్మ సాక్షాత్కారానికి అడ్డు ఉన్న అన్నిటిని తొలగిస్తాడు. ఆత్మ ఎప్పుడు సాక్షాత్కారమయ్యే ఉన్నదని ఆ ఆత్మ సాక్షాత్కారానికి కల అడ్డంకులను తొలగించటానికి గురువు యత్నిస్తాడని ఎప్పుడైతే ఆ అడ్డంకులు తొలగిపోవునో లోనున్న ఆత్మ సాక్షాత్కారమవుతుంది. కావున ఆత్మ ఎప్పుడు సాక్షాత్కారమయ్యే ఉన్నదని భగవాన్ నొక్కి చెప్పినారు. **ఆత్మ సాక్షాత్కారము పొందేవరకు గురువు అవసరమే. నిజానికి గురువే ఆత్మ. భగవాన్ ఇట్లనేవారు, "గురువునే అసలైన ఆత్మగాను, నీవు వ్యక్తిగతమైన జీవిగాను భావించు. ఈ భావము పోయిన అజ్ఞానము తొలగినట్లే. కాని ఈ ద్వైభావమున్నంతవరకు గురువు ఆవశ్యకమే. ఎందుకంటే నీ భావన నీవొక శరీరమని అందువల్లనే గురువు కూడా ఒక దేహమనే భావిస్తావు. నీవు దేహానివి కావు. గురువూ కాదు. కావున నీవు ఆత్మవే. గురువు కూడా ఆత్మే**. ఇట్టి జ్ఞానము కలిగినపుడు ఆత్మ సాక్షాత్కారము అంటున్నాము. భగవాన్ చెప్పినట్లుగా ఆత్మే గురువని తెలుసుకున్నాము. **మనస్సు ఎన్నో రకాలుగా పరిగెత్తినప్పుడు ఆత్మే బైటకి గురువుగా రూపుదాల్చి వస్తుంది.** ఎవరి దగ్గర నుంచి ఏ మంచి నేర్చుకొనినను వారు గురువే ఔతారు. ద్వైభావమున్నంత వరకు భగవాన్ చెప్పినట్లుగా గురువు కోసం అన్వేషణ మొదలుపెడతాం. ఎప్పుడైతే సత్యం తెలుస్తుందో దృష్టి బాహ్యాన్ని చూడక అంతర్ దృష్టి కలుగుతుంది. అజ్ఞానమున్నంత వరకు గురువు అవసరమే.

సాధకునికి భగవంతునిపై భక్తి ద్వారా నిలకడ స్థితి ఏర్పడి ఆ భగవంతుడే గురురూపంలో ప్రత్యక్షమై మార్గము చూపుతారు. ఆ భక్తునికి భగవంతుడు లోపలే ఉన్నాడని ఆయనే ఆత్మ అని అతని మనస్సును బాహ్యము నుండి అంతర్ముఖుని చేసి సాక్షాత్కారం కలిగిస్తారు. భగవాన్ చెప్పినది ఆత్మే నీ గురువని. గురువనుగ్రహం రావడం అంటే ఆ ఆత్మనుండే వచ్చుచున్నదని తెలియబడినది.

భగవాన్ మరియొక ముఖ్యమైన విషయం సాధకులకు చెప్పినారు. అది గురువులోపలనే ఉన్నాడని సామాన్యులు తలచినట్లుగా గురువు బాహ్యంగా ఉంటాడనే భ్రమను తొలగించేందుకే ధ్యానం అని చెప్పినారు. జీవి శరీరానివని అనుకున్నంతసేపూ బాహ్యంగా అతనికి గురువు అవసరమే. అటువంటి స్థితిలో గురువు కూడా శరీరధారిగానే కనిపిస్తాడు. సాధన పండిన పిదప శరీరముతో సంబంధము లేదని తెలిసినప్పుడు గురువు ఆత్మకంటే వేరుకాదని నిజం బైటపడుతుంది.

భగవాన్ చెప్పిన మాటలను గ్రహించి గురువు ఉన్నవారు ఆ గురుమార్గములో శ్రద్ధా సహనముతో నడిచి భక్తి శ్రద్ధలతో సేవించిన యెడల గురువు తాను నమ్ముకున్న శిష్యుని తప్పక ఆత్మబోధను కలిగించి ఆత్మ సాక్షాత్కారము కలుగచేస్తారు. **ఎవరికైనా గురువు వారి జీవితంలో దొరకకపోయినను తాను ఒక దేహమని తలంపును వీడి దృష్టిని అంతర్లీనము చేసిన యెడల తనలోనున్న ఆత్మయే గురువని గ్రహించవచ్చును.** కావున బాహ్యముగా లభించిన గురువైనను చివరికి జీవి అంతరంగములోనున్న ఆత్మయే గురువని నిరూపిస్తారు. మనము భగవాన్ చెప్పిన విధముగా గురువుని సేవిద్దాం. గురువుని చూద్దాం. ఆ గురువే ఆత్మ అని తెలుసుకుందాం. వీటికి గల శక్తి సామర్థ్యములను మనందరికి కలగాలని అనన్య శరణాగతితో భగవానుని వేడుకుందాం. రమణుడే శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 22

ఆణిముత్యాలు - 4 - మనస్సు

బాహ్య విషయాలు మరియు దృశ్యాలను చూడటం వలన మనస్సు వికలమవుతుంది. అటువంటి మనస్సును బహిర్ముఖ మనస్సు అంటారు. కాని అదే మనస్సు హృదయములోనికి పోయి విశ్రాంతి చెందినచో దాన్నే నిశ్చల మనస్సు అంటారు. ఆధ్యాత్మిక జీవితం సాగించాలంటే మనస్సును అదుపులో పెట్టుకోవాలి. అనగా బాహ్య విషయాలపై వ్యామోహం మాని అంతర్ముఖం చేసినచో శాంతి లభిస్తుంది. దీనిని మనో రూప జీవితాన్ని ఆత్మరూప జీవితాలుగా మరల్చటం అని చెప్పవచ్చు. కాబట్టి విషయాసక్తిని కోరక ఎల్లప్పుడు అంతర్ముఖంలో మనస్సును నిశ్చలము చేయాలి. విషయాసక్తి వలననే నిశ్చలంగా ఉన్న మనస్సు ప్రక్కకు మరలి పరిగెత్తుటకు ప్రయత్నిస్తుంది. అది దేనివలననగా ఏదో ఒక విషయం వలనగాని లేదా ఆకర్షింపబడే వస్తువు వలనగాని మరే ఇతర కారణములయినను మనసు ఆకర్షింపబడి ప్రక్కకు మరలి సాధకుని లక్ష్యాన్ని చెడగొడుతుంది. కావున **మనస్సుకు విషయాలంటే బొమ్మలు వంటివి. ఆ విషయాలతో ఆడుతూ లక్ష్యాన్ని చెడగొట్టుకుంటుంది.** అంతరాత్మలో నిలకడగానున్న మనసు చపలత్వం చెంది ఆ మనసు బహుముఖముగా చలిస్తుంది. కావున భగవాన్ చెప్పినదేమనగా మనస్సును నిశ్చలముగా ఉంచుకోమన్నారు. ఆ మనస్సును ఆత్మ రూప జీవితానికి మళ్ళించమన్నారు. మనస్సును నియమంలో పెట్టుకోమన్నారు. భగవాన్ ఈ విషయములో ఒక ముఖ్య విషయాన్ని సాధకులకు చెప్పారు. **ఏదైనా ఆలోచన కలిగిన వెంటనే ఆ ఆలోచన ఎవరికి కలిగింది అని ప్రశ్నించుకోమన్నారు.** దానివలన ఆ ఆలోచన సన్నగిల్లి తుదకు మాయమై మనస్సుకు చాంచల్యగుణం నశించిపోతుంది. అప్పుడు మనోబలం కలుగుతుంది. భగవాన్ మూలానికి వెళ్ళమని సూచించేవారు. ఏదైనా ఆలోచన కలిగిన వెంటనే దానిని అరికట్టమన్నారు. వెంటనే మనస్సు ఊరుకోక మరొక ఆలోచనను లేవదీస్తుంది. మళ్ళీ ఆ ఆలోచనను నరకమని అలా ప్రతిసారి ప్రతిక్షణం సహజముగా ఎన్నో ఆలోచనలు మనస్సులో లేచినకొద్దీ అన్నింటినీ ఆ విధముగనే నరికివేయుచురాగా చివరికి ఆ మనస్సు దృఢపడి ఎటుపక్కకు మరలక అది లోపలే

ఉండి మూలంవైపుకు ప్రయాణం చేస్తుంది. ఆత్మయందు శ్రద్ధ కలిగి ఆత్మలోనే లయమవుతుంది.

భగవాన్ మరియొక రహస్యాన్ని కూడా సాధకులకు చెప్పారు. మనస్సు బలహీనముగా ఉన్నవారికి అంటే బాహ్యావిషయాలపై మక్కువ కలిగి మనసు చలించే వారికి **శ్వాసపై శ్రద్ధను నిలపమన్నారు.** దృష్టిని శ్వాసమీద ఉంచినపుడు మనసు తన ఇష్టం వచ్చినట్లు బాహ్య విషయాలపై మరలదు. ఈ విధంగా చేయుట వలన బాహ్య మనస్సును లోనికి ఒక విధముగా త్రోయటం జరిగినట్లే. భగవాన్ చెప్పినదేమనగా, దృష్టిని అంతర్ముఖం చేసిన మనస్సు ఎక్కడినుంచి లేస్తున్నదో గమనిస్తే అది వెంటనే నశిస్తుందని సూచించారు. **మనస్సుని చంపుకోవాలని అనుకునే బదులు దాని మూలాన్ని అన్వేషిస్తే అప్పుడది లేదని తెల్సుకోగల్గుతావని భగవాన్ సూచించారు**. బహిర్ముఖమై చలామణి అవుతున్న మనస్సు ఎన్నో విషయాలుగా మారుతుంది. కాని అదే మనస్సును అంతర్ముఖం చేసికొనినచో అది ఆత్మగా మారుతుందని భగవాన్ హెచ్చరించారు. 'నేను' భావం లేచిన తరువాతే ఎన్నెన్నో ఆలోచనలు మొదలై మనసు చలిస్తుంది. ఆ సమయమున 'నేనెవరు' ? అను విచారణ ద్వారా మనస్సు అణుగుతుంది. మనస్సు ఎన్నో రకాలుగా లేచినపుడు వాటిని అదుపులో పెట్టాలన్న దాన్ని ఆత్మలో నిల్పటం తప్ప మరో మార్గము లేదు అన్నారు భగవాన్. ఇతర ఆలోచనలు ఎన్ని వచ్చినను వాటికి అవకాశమివ్వక 'నేను' తలంపు యొక్క మూలాన్ని అన్వేషించుటకై మన దృష్టిని నిల్పినచో మరే ఇతర ఆలోచనలు వచ్చినను అది ఎవరికి కలుగుతున్నదని ప్రశ్నించుకోగా సహజముగా నాకు అని జవాబు వస్తుంది. అప్పుడు ఈ నేను ఏమిటి? దాని మూలమేమిటి ? అని విచారణ చేయాలి. **మనస్సనేది తలంపులే అని భగవాన్ చెప్పారు**. మనస్సు రూపాన్ని ఆగకుండ అన్వేషిస్తు ఉంటే చివరికి మనస్సనేదే లేకుండా పోతుంది. **నేను అనే తలంపే మూలం. కావున మనస్సనబడేది నేను అనే తలంపే. ఈ నేను ఎక్కడి నుండి తలెత్తినది ? దాని కోసమని లోపలే వెతకమన్నారు భగవాన్. అప్పుడది అదృశ్యమైపోతుంది. ఇదే జ్ఞానాన్వేషణ అని కూడా చెప్పారు. మనస్సంటూ ఏమీ లేదని తెలుసుకోవటమే ముఖ్యం.** జీవి తన దేహముతోగాని లేదా తన మనస్సులోరేగిన ఆలోచన వలన మనసుతోగాని ఒక కార్యమును చేసేటప్పుడు 'నేను' అన్నదేదో చేయిస్తుందని భావిస్తాము. నేను పనిచేస్తున్నాను, నేను ఆలోచిస్తున్నాను అని పలికినప్పుడల్లా నేను అనే పదానికి అహం వృత్తి అని అర్థం వస్తుంది. కాని **నిజమైన నేను అంటే లోనున్న ఆత్మతాను పని చేస్తున్నట్లు ఆలోచిస్తున్నట్లు**

అనుకోదని భగవాన్ చెప్పారు. ఆత్మ సాక్షాత్కారం కావాలంటే ఆ మనస్సు అహం వృత్తి మాయమవ్వాలి. ఒక విషయముతో లేదా వస్తువుతో తాదాత్మ్యం చెందినపుడు ఆ నేను ఉదయించి నేను చేస్తున్నాను, నేను ఆలోచిస్తున్నాను అని మొదలై ఆ నేను వాటిని సొంతం చేసుకుంటుంది. ఈ నేను అన్నది నేను ఈ దేహాన్ని అన్నభావం కలిగిస్తుంది. అట్టి నేనును వేరు చేయాలంటే మనస్సును అంతర్లీనం చేసి లోనున్న అసలైన నేనుపై దృష్టిని నిలపాలి. అప్పుడు నేను ఇది నేను అది నేను అను భావాలు ఉదయించవు. కావున భగవాన్ చెప్పినదేమనగా నేను అనేభావం ఎక్కడినుండి వస్తున్నదో పట్టుకుని ఆ నేను అనే భావం తన మూలంలో కరిగిపోయే వరకు దానిపై ధ్యాస నిలిపి ఉండమన్నారు. నేను అనే చింతన చేయగా చేయగా అది మనల్ని సరియైన దారిలో పెడుతుంది. ఒక వ్యక్తి తానే కర్త అని ఏదైనా ఒక కార్యము చేసిన దానికి కర్తను నేను అనే భావముతో ఉండి విషయాలపై దృష్టిని మరల్చుతూ ఉంటాడు. దీనిని 'అహంవృత్తి' అని దీని వలన ద్వైభావముండును. ఈ ద్వైభావన వలననే ఆ అహంవృత్తి నేననే భావము వీడదు. అన్ని విషయాలపై ఎరుక పోయినపుడే ఆ అహంవృత్తి పోవును. అంటే దృష్టి బాహ్య వస్తువులపై ఆకర్షింపకుండా విషయాలను తీసుకోకుండా దృష్టిని అంతర్ముఖం చేయవలెనని భావన. శరీర నేను గురించి ఎరుక కలిగి ఉండటంకాక నేను (ఆత్మ) ఐపోవాలి. **భగవాన్ ధ్యానాలు మరియు యోగము వాటికి ఒక కర్త ఉండి ఒక విషయము గురించి ధ్యానించమని నిర్దేశిస్తాయి అని మరియు దానివల్ల నేను అనేభావం గట్టిపడుతుంది. దాని వలన మనస్సు నిశ్చలమై ఆనందాన్ని కల్గిస్తాయి కాని ఆత్మ సాక్షాత్కారానికి దారి తీయవని చెప్పారు. కారణం అహంవృత్తిని వేరు చేయకపోవటమే.** మనస్సంటే ఆలోచనల యొక్క సమూహము. ఈ సమూహమైన ఆలోచనలకు మూలం నేను. **మనస్సంటేనే ఈ నేను అనే ఆలోచనే. నేను అనే ఆలోచన రావటంతోనే శరీరము తప్పుదారిపడుతుంది.** కాబట్టి భగవాన్ చెప్పినది ఈ నేను అనే భావాన్ని వదిలించుకోమన్నారు. అహంవృత్తి యొక్క మూలాన్ని పట్టుకోవటం అంటే అహంకారము యొక్క రూపానికి ఆధారము పట్టుకోవటమే కాక 'నేనున్నాను' అనేది ఎక్కడి నుండి వస్తుందో తెలుసుకోమన్నారు భగవాన్.

భగవాన్ చెప్పినది శుద్ధమైన నేను, (ఆత్మకి) నేను అనే భావానికి తేడా తెలుసుకోవాలని

సూచించారు. ఈ నేను అనేభావం అది ఒక భావం మాత్రమే. అది కర్తని, కర్మని సూచిస్తుంది. ఆలోచిస్తుంది. నిద్ర, మెలకువ, జననం, మరణం ఇలాంటివి కలిగి ఉంటాయి ఆ నేను అనే భావానికి. కాని శుద్దమైన నేను (ఆత్మ)కు అజ్ఞానముగాని భావముగాని ఉండవు. మనస్సు ఈ విధముగా అంతర్ముఖమై తన మూలాన్ని తెలుసుకుంటే ఆత్మ అయిపోతుంది.

భగవాన్ ఇలా మనస్సును గురించి ఆణిముత్యములైనటువంటి బోధలను ఎన్నో చేశారు. భగవాన్ బోధనలు సముద్రము వంటి లోతైన కొలువలేని వైశాల్యము కల్గినటువంటి మాటలు బోధలు ఎన్నెన్నో కలవు. అన్నీ చెప్పటము అసాధ్యము. భగవాన్ కృపతో కొన్ని ఆణిముత్యములను మాత్రమే తీసుకొని చెప్పబడినవి. కావున సాధకులు మనస్సును అదుపులో ఉంచుకొనవలెను. మనస్సంటేనే ఆలోచనల సమూహము. ఆ ఆలోచనలు రావటానికి గల కారణము బాహ్యదృష్టి ఐహిక సుఖాలకై వస్తువులపై దృష్టి ఆకర్షించినపుడు మనస్సు విచ్చలవిడిగా చెలరేగి అదుపు తప్పి ఆకాశాన్నే అందుకోవలనే తాపత్రయము పడుతుంది. అటువంటి మనస్సును బాహ్యము నుండి లోపలికి తోయాలి. అంటే ఆలోచనలను అరికట్టాలి. ఆలోచన లేకుంటే దృష్టి బాహ్యవిషయములపై పోదు, అంతర్ముఖం అవుతుంది. ఆ అంతర్ముఖమైన మనస్సు మళ్ళీ బైటకు రానీయకుండా క్రొత్త ఆలోచనలేమి వచ్చినా ఆ క్షణమే అణగ త్రొక్కుట అభ్యసించిన ఆ అభ్యాసము చేయగా చేయగా మనస్సు నిశ్చల స్థితి పొంది ఒక్క ఆత్మయే మిగిలి ఆత్మ సాక్షాత్కారము కలుగుతుంది. అహంవృత్తి అయిన నేనును మరచిలోనున్న నేనును ఆత్మను తెలుసుకోవాలి. దానికి భగవాన్ కృప ఎంతో అవసరం. వారి బోధలు నడి సముద్రములో సంసారమనే సాగరములో కొట్టుకొనుచున్న జీవులందరికి దీపపు స్తంబములై వెలుగుచూపి ఆత్మ సాక్షాత్కారానికి దారి తీస్తుంది. అటువంటి వెలుగు మన జీవితాలపై కూడా ప్రసరింపచేయమని భగవాన్ని అనన్య శరణాగతితో వేడుకుందాం. భగవాన్ రమణా నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము - 23

ఆణిముత్యాలు - 5 - భగవంతుడు

భగవాన్ ఆత్మయే పరబ్రహ్మమని ఆ పరబ్రహ్మము అందరిలోను ఉన్నారని కావున క్రొత్తగా భగవంతుడు కనపడలేదని అనేవారికి తన ఆత్మను గురించి తెలుసుకుని లోన ఎల్లపుడు ఆత్మ సాక్షాత్కారించియే ఉన్నదని ఆ లోనున్న ఆత్మయే పరమాత్మ అని ఆ ఆత్మ సాక్షాత్కారాన్ని కలుగచేసికొనుటకు నేనెవరిని ప్రశ్నించుకొని మూలానికి వెళ్ళి ఆత్మ బోధ తెలుసుకోమన్నారు. **కాబట్టి భగవంతుడు ఎక్కడో లేడు ప్రతివానిలో ఆత్మ రూపములోనే ఉన్నాడని సర్వం బ్రహ్మయేయని చెప్పారు.** అయితే ఒక భక్తుడు భగవానుని ఇట్లు ప్రశ్నించాడు, స్వామీ! ఈ అరుణాచలమనే కొండనే భగవంతుడని నిర్దేశిస్తున్నారు కదా మరి అన్నీ ఆత్మయే పరమాత్మయని మీరు చెప్పి బాహ్యముగా భగవంతుణ్ణి అరుణాచలమనే కొండ రూపమున చూపుతున్నారు కదా! అని అనగా, భగవాన్ దానికి జవాబు ఇట్లు చెప్పినారు. **"నీవేమో ఆత్మ నీ శరీరానికి అభిన్నమని భావించవచ్చు కాని ఆత్మ అరుణాచలానికి అభిన్నమని భక్తులు భావించకూడదా?"** అని చక్కటి జవాబు చెప్పారు మన భగవాన్. ఆ భక్తుడు అంతటితో ఊరుకోక అరుణాచలమే ఆత్మ అయితే ఎన్నో కొండలు ఉండగా అరుణాచలకొండనే ప్రత్యేకించి చెప్పటముదేనికని భగవంతుడు అంతట ఉన్నాడు కదా ఆయనని అరుణాచలమని మీరు ఎందుకు నిర్దేశిస్తున్నారు? దానికి భగవాన్ ఒక గొప్ప రహస్యాన్ని బైట పెట్టారు. **ఆ ప్రశ్న వేసిన భక్తునితో భగవాన్ ఈ విధముగా అడిగారు. "నీవు అలహాబాదు నుంచి ఇక్కడికి నిన్ను ఆకర్షించినదేమిటి? అలాగే ఇక్కడ ఉన్న వారందరిని ఆకర్షించినదేమిటి ?" అని మహర్షి అతని నడుగగా అతడు దానికి జవాబు "మమ్ములను ఆకర్షించబడినది మీరే (భగవాన్) దానికి భగవాన్ ఇట్లన్నారు. నేను ఎట్లా ఆకర్షింపబడినాను? అరుణాచలం వలనే కావున శక్తిని కాదనేందుకు వీల్లేదు. అయితే అరుణాచలం లోపలే ఉన్నది గాని వెలుపల లేదు."**

తనకి మటుకు తనకు ఆకారము ఉన్నదని భావిస్తూ ఉంటే కనిపించే జగత్తు మరియు భగవంతుడు కూడా ఆకారము కలిగి ఉన్నట్లే అనిపిస్తుంది. **నిజానికి బ్రహ్మమును చూచేందుకు తెలుసుకునేందుకు వీలులేనటువంటి ఆది ద్రష్ట, దర్శనము మరియు దృశ్యమునకు అతీతమైనది.** భగవాన్ చెప్పినదేమనగా ఎప్పుడైతే నీవొక వ్యక్తివని నీకు వెలుపలగా ఈ విశ్వమున్నదని వీటి కతీతముగా భగవంతుడున్నాడని అనుకోవడం వలన నీలో భిన్నత్వ భావనము కలుగుతుందని సూచించారు. కావున ఆ భిన్నత్వ భావము పోవాలని భోదించారు. భగవాన్ చెప్పినది **భగవంతుడనేవాడు నీకంటే మరియు కనిపించే విశ్వాని కంటే వేరుగా లేదని దానికి ప్రమాణముగా భగవాన్ భగవద్గీతలోని శ్లోకం కూడా చెప్పి నిర్ధారించారు.** ఆ శ్లోకములో అర్థం శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునునితో ఈ విధంగా చెప్పెను.

"ఓ గుడాకేశా ! నేను సర్వభూత హృదయంలోను ఉన్నాను. నేనే ఆది, మధ్యాన్ని, అంతాన్ని. కావున భగవాన్ నిరూపించినదేమనగా భగవంతుడు అతీతముగా ఎక్కడో ఉన్నాడని భావన్ని తొలగించమని ఆ పరమాత్మ అందరి హృదయాల్లో ఆత్మగా వెలుగుచున్నాడని అతడే అందరికి మూలమని అందరూ అ పరమాత్మలో ఉన్నారని ఆ పరమాత్మ వేరుగా లేదని చెప్పారు. ఆ పరమాత్మ ఎల్లరి హృదయాలలో సాక్షాత్కారించే ఉన్నారని అయితే ఆ రహస్యాన్ని తెలిసికొనలేని మనము బ్రహ్మాన్ని ఎక్కడో వెతుకుతూ అన్వేషణ కొనసాగిస్తున్నాము కావున **బ్రహ్మము కంటే ఆత్మ అనేది వేరుగా లేదు.** ఈ సత్యాన్ని తెలిసికొనకపోవడం గల కారణం నేను శరీరమనే భావనే. అజ్ఞానములో మునిగి ఉండటం వలన ఎప్పుడైతే నేనోక దేహాన్ని అని అనుకున్నామో ఇక ఎన్నో ఆటంకాలు మాయ రూపేణ వచ్చి అడ్డుతెరను కట్టి వేస్తుంది. విషయాలపై వినోదాలపై వస్తులపై వ్యామోహము కలిగి వాంఛల చేత భగవంతుడు ఎక్కడో బాహ్యముగా ఒక శరీర రూపముగా ఉన్నాడనే భ్రమ కలిగి తన కోరికలు నెరవేర్చుటకై కనబడని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, కాలాన్ని వృధా చేసుకుంటూ లోనున్న దైవాన్ని మరచి తనకు అడ్డుగా ఉన్న మాయ తెరను తొలగించుకొనుటకు యత్నించక సంసారమనే సంద్రములో కొట్టుమిట్టాడుతూ జననమరణమనే చక్రములో ఇరుక్కుని పుడుతూ మరణిస్తూ ఇలా ఎన్నో జన్మలెత్తుతూ అనుభవిస్తూనే ఉంటాడు.

కాని ఎప్పటికో ఒకప్పుడు సత్యాన్ని తెలుసుకుంటాడు.

భగవాన్ వద్ద మరియొక భక్తుడు భగవంతుని గూర్చి ప్రస్తావన తెచ్చారు. అతను భగవానుని "భగవంతుడు ఒక వ్యక్తా?" అని ప్రశ్నించాడు. దానికి భగవాన్ **"అన్నివేళల్లో నీకు అపరోక్షంగా ఉండునట్టి ' నేను ' ఆయనే. కాని నీవు బాహ్యముగా కనిపించే విషయాలకు ప్రాధాన్యత ఇవ్వడం వలన నీలో ఉన్న భగవంతుడు మరుగున పడిపోయి కన్పించకుండా ఉన్నాడు. కావున మిగిలిన వన్నిటిని వదిలి వేస్తే నేనుగా నీలో ఉండి పోతాడు."** అని భగవాన్ భోదించారు.

భగవాన్ చెప్పినదేమనగా భగవంతుడు ఆ భగవంతుని పూజించే భక్తుడు ఆ భగవంతుని అర్చించే స్తోత్రాలు కూడా అన్నీ ఆత్మే అని కూడా చెప్పారు. మనిషి తనలోని ఉన్న భగవంతుడిని తెల్సుకోలేక పోవడానికి గల కారణము ఆ మనిషి యొక్క చంచలమైన మనస్సే. ఆటువంటి వక్రమైన మనస్సును లేదా మరి ఎ ఇతర అవరోధాలు రాకుండా ఉండటానికి భగవాన్ ఆ భగవంతుడిని శరణు పొందమని చెప్పారు. విశ్వాసము ముఖ్యమని కూడా భగవాన్ చెప్పారు. కొందరు భక్తులు భగవానుని ఈ విధమైన ప్రశ్న వేశారు. "భగవాన్ నేను శరణాగతి చేసి ఉన్నా దేవుడు సహాయము చేయుటలేదు. " దానికి భగవాన్ చెప్పిన సమాధానము **"నీవు ఒకసారి శరణాగతుడవైతే దైవేచ్ఛను అంగీకరించవలెను. నీకు ప్రియమైనది జరుగకపోతే దానికి దుఃఖించకూడదు. ఆపద మనుష్యులను భగవత్ విశ్వాసము వైపుకు తీసుకుని వెళ్ళును."** అని అన్నారు. భగవాన్ భక్తునికి ఇట్లు చెప్పెను. " ఒకసారి శరణాగతి తాను (భగవంతుడు) కనిపించినా, కనిపించుకున్నా అయన ఇచ్చను స్వీకరించవలెను. దైవమునకు తోచినట్లు చేయనీ. **నీ ఇష్టానుసారముగా ప్రకారము జరగాలిఅని కోరుకోవటం శరణాగతి కాదు. అది దైవముపై ఆదిపత్యమే అవుతుంది ఏదిమంచో ఆయనకే తెలుసు. ఎప్పుడు ఏవిధముగా జరిపించవలేనో ఆయనకే తెలుసు. శరణాగతి అయిన వారు పూర్తిగా ఆయనకే వదిలిపెట్టు."** భగవాన్ ఇంకొక గొప్ప విషయం చెప్పారు. " సాధారణముగా భక్తుడు దైవాన్ని ప్రార్ధించి నీ **ఇచ్ఛయే నెరవేరుగాక అని అంటూ ముగిస్తాడు. అయితే దైవము ఇచ్ఛ నెరవేరేందుకు వీళ్ళ ప్రార్ధన లెందుకు? కావున అన్ని వేళల్లో, అన్ని పరిస్థితులలోను, భగవంతుడు తలచిన ప్రకారము నెరవేరును కావున**

మనుష్యులు ఎవరి ఇష్టానుసారము వారు ప్రవర్తించిన వారు అనుకొన్నట్లు జరుగదు. ప్రతివారు ఆ భగవంతుడిచే కాపాడుబడుచున్నారు.నీకు కావలసినవేవో దైవానికి ప్రత్యేకముగా చెప్పనవసరము లేదు. ఆయనకు అన్నీ తెలుసు. ఆయనే వాటిని చూసుకుంటారు." భగవాన్ చెప్పినపై బోధ ప్రతి సాధకుడు గట్టి విశ్వాసముతో నమ్ముకుని ఒక్కసారి దైవానికి శరణాగతి అయితే ఇక దేని గురించి ఆలోచించవలసిన పనిలేదు. అని తెలియబడినది. ఇంకొక భక్తుడు భగవానుని "మాప్రార్ధనలు మన్నించబడతాయా అని అడుగగా భగవాన్ దానికి జవాబుగా తప్పక మన్నించబడతాయని మరియు **ప్రతి సంకల్పము వృధా కాదని చెప్పారు.** కావున భగవాన్ చెప్పిన బోధనలను పాటించి భగవంతుడు ఎక్కడో బైట ఉన్నాడని భావాన్ని వదిలి భగవంతుని కోసం బైట వెతుకుతూ కాలాన్ని వృధా చేయక మనస్సును నిలకడ చేసి అంతర్ముఖం కావించిన ప్రతి జీవిలో మహాతేజస్సుతో ప్రజ్వలించుచున్న ఆత్మ ప్రతి జీవిలో సాక్షాత్కారించే ఉన్నదని గ్రహించి ఆ ఆత్మయే పరమాత్మ అని తెలుసుకొనవలెను. సాధకుడు మొదట దైవాన్ని సాకారరూపములోనే పూజించుట సహజము. తన భక్తి పరిపక్వమైనపుడు క్రమేపి లోనున్న ఆత్మయే పరమాత్మ అని గ్రహిస్తాడు. నిరాకారా రూపములో నున్న ఆత్మయే దైవమని తెలిసికుంటాడు. ఇంతటి రహస్యాన్ని తెలుసుకోవటానికి అనుభూతి పొందటానికి మనమందరము భగవాన్ శ్రీ రమణ మహర్షిని శరణువేడుదాం. భగవాన్ నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము - 24

ఆణిముత్యాలు - 6 - జగత్తు

భగవాన్ చెప్పినదేమనగా ఆత్మయే బ్రహ్మమని సర్వం బ్రహ్మ మయయని చెప్పారు. అయితే ఈ కన్పించే జగత్తు సంగతి ఏమిటి ? అనే ప్రశ్న ప్రతి వారికి కలుగుతుంది. జగత్తు బ్రహ్మముకంటే భిన్నమని అభిప్రాయపడతారు. కాని భగవాన్ చెప్పినది **బ్రహ్మము లేదా ఆత్మ ఒక తెరవంటిదని ఆ తెరపై కనబడే బొమ్మలే జగత్తు అంటే ఆత్మ ఒక సినిమా తెర అయితే దానిపై కనిపించే బొమ్మలు జగత్తని అర్థము.** తెర ఎంతసేపు వుంటే అంతసేపు మాత్రమే ప్రేక్షకుడు సినిమా చూచెదడు. **బ్రహ్మము ఎప్పుడూ సత్యమే. కాని కన్పించే జగత్తు మిథ్య.** ఆ జగత్తు కూడా బ్రహ్మమే. మనము చూచే ఈ జగత్తు అందరికి కనిపించుచున్నది. కాని అది నిజంకాదు. అది ఒక భ్రాంతి మాత్రమే. ఉన్నది ఒక్కటే ఆత్మ. అదే నిజము. **జగత్తు, జీవుడు, ఈశ్వరుడు ముగ్గురు కూడా ఆత్మయే.** భగవాన్ జగత్తు సినిమా తెరపై కనిపించే బొమ్మలని ఎప్పుడూ చెప్తూ ఉండేవారు. సినిమా తెరపై ఎన్నో దృశ్యాలు కనిపిస్తూ ఉంటాయి. అవన్నీ నిజంకాదు. అసత్యం మాత్రమే. తెరమటుకు సత్యమైనది అని భగవాన్ చెప్తూ మరియొక ఉదాహరణ కూడా ఇచ్చేవారు. అది అద్దంలో కన్పించే ప్రతిబింబాలు. ఆ ప్రతిబింబాలు కదిలిపోతూ ఉంటాయి. వాటివల్లగాని వాటి గుణాలవల్లగాని ఆ అద్దం మటుకు ఏ మార్పూ చెందదని భగవాన్ చెప్పేవారు. పైగా **సామాన్యులు కన్పించే జగత్తును వ్యావహారిక దృష్టితో చూస్తారు కాబట్టి ఆ అగుపించే జగత్తు సత్యంగానే తోస్తుంది. కావున భగవాన్ చెప్పినదేమనగా జ్ఞానాన్ని సముపార్జించుకుంటే కన్పించే జగత్తు సత్యము కాదని జగత్తుకు అతీతంగా పోతే ఆ కన్పించే జగత్తు మాయమై సత్యమొకటే అనగా బ్రహ్మమే లేక ఆత్మయే నిలుస్తుందన్నారు.** ఈ కన్పించే జగత్తుకాని, జీవుడుకాని, ఈశ్వరుడుకాని మాయ వలన జరుగుతున్నది. మాయ అంటేనే లేనిది ఉన్నట్లుగ చూపించుట. **భగవాన్ చెప్పినదేమనగా మన ఆత్మే ప్రపంచముగా అనేకమైన నామ రూపాలతో అగుపిస్తుందని కొందరు భగవాన్‌తో "మన చుట్టూ కనపడే** ప్రపంచాన్ని ఎలా లేదనగలమని" వాదించేవారు.

అలాంటి వారికి భగవాన్ కలల అనుభవం గురించి చెప్తూ వుండేవారు. దానికి వాదకులు మళ్ళీ ఈ విధంగా ప్రశ్నించే వాళ్ళు. కల చాలా తక్కువసేపే ఉంటుంది. కాని ఈ కన్పించే జగత్తు మాత్రం ఎప్పుడూ ఉంటుంది. పైగ కల ఒక్కడికే సంబంధించినదనికాని కన్పించే ప్రపంచం అందరూ చూస్తారని అనుభవిస్తారని అంటూ మరి ప్రపంచం లేదని ఎలా అనగలమని అనేవారు. భగవాన్ ఇట్లు చెప్పేవారు, **"చూసేవారి బట్టే ఏదైనా ఉంటుంది. చూడబడేది కూడా నిజానికి దృష్టికి వేరుగా దృశ్యమంటూ ఏమీ లేదని చెప్పారు".** దీనిని దృష్టి సృష్టి వాదము అంటారు. అదేవిధముగా సృష్టి, దృష్టి వాదముకూడా ఉన్నదని భగవాన్ సమాధానమిచ్చారు. విశ్వమంతా ద్రష్టతోపాటే దృశ్యమానమవుతుందని తెలుసుకోవాలి. భగవాన్ తమ భక్తులతో ఎప్పుడూ ఒక రహస్యాన్ని చెప్పేవారు, **"నీవు నిద్రలో ఉన్నప్పుడు ప్రపంచము కనబడదు. కాని ఆ సమయములో నీవు లేకపోలేదు. నీవు మేల్కొనగానే ఈ ప్రపంచము కనబడుతున్నది. అందువల్ల ఎక్కడిదీ ప్రపంచము ? నీ భావనే కదా.** భావాలన్నీ నీవు కల్పించుకున్నవే. మొదట సృష్టింపబడేది 'నేను'. ఆ నేను ఉదయించేది ఆత్మనుంచే. ఈ నేను యొక్క సృష్టి రహస్యాన్ని కనుగొన్న జగత్ సృష్టి రహస్యం విడిపోతుంది. కావున ఆత్మాన్వేషణ చేసుకోమని భగవాన్ చెప్పేవారు. ఆత్మ సాక్షాత్కారమైన పిదప సృష్టి లేదు. కావున భగవాన్ ఆత్మని కనుక్కోమని, సృష్టిలేదని చెప్పేవారు. ఆత్మను మరచినవాడు అతని దృష్టి బాహ్య ప్రపంచముపై ఉండును. కావున అతనికి తాను బ్రహ్మమని మరచి జగత్తులో వస్తువులపై ఆకర్షణ దృశ్యాలకు లోబడుట వంటి బలహీనత ఏర్పడుట వలన అవిద్యలో తాను దేహమనే భ్రమ కలిగి ఉండుటచే జగత్తు సత్యమని తోస్తుంది. కాని సాధకునికి జగత్తు మిథ్యగా తోస్తుంది. ఎందుకంటే అతడు దేహము కాదని అసలు నేనును తెలుసుకొనుటచే తనకి సర్వము బ్రహ్మముగా కన్పిస్తుంది. ఆత్మ లేకుండా విశ్వమనేదే లేదు. ఆత్మ జ్ఞానానికి తాను బ్రహ్మమని ఆలోచన ఎప్పుడూ ఉంటుంది. భగవత్ అనుగ్రహం కలిగినప్పుడు మనస్సు శుద్ధిపొంది భ్రమపోయి సత్యాన్ని చూస్తాడు. భగవాన్ చెప్పింది ఈ కన్పించే ప్రపంచం వాస్తవము కాదని అనుకోకపోతే ప్రతి వారి మనస్సు ప్రపంచము వెంట పడుతుందని దానివల్ల యదార్థము బైటకి రాదని చెప్పేవారు. మనిషి కలగన్నప్పుడు కలలోని

ప్రపంచము కూడా కల ఉన్నంతసేపు వాస్తవమే. కాని మేల్కొని ఉన్నపుడు కనపడే ప్రపంచము వాస్తవము కాదని నీవు ఎప్పుడూ సందేహించవు. జాగ్రత్తావస్థలోని ప్రపంచాన్ని స్వప్నావస్థలోని ప్రపంచాన్ని పోల్చి చెప్పటం రెండూ కూడా మనస్సు చేత కల్పింపబడినవే. వాటిలో నిమగ్నమైనంత వరకు అవి అసత్యంగా మనస్సు ఒప్పుకోదు. కలగంటునప్పుడు కలలోని ప్రపంచాన్ని అసత్యమని మరియు మేల్కొని ఉన్నప్పుడు కనపడే ప్రపంచాన్ని అసత్యమని ఒప్పుకోదు. కావున మనస్సును ప్రపంచమునుంచి మరల్చి అంతర్ముఖం చేసి ఆత్మ గురించిన ఎరుక ఉంటే ప్రపంచము మిథ్యగానే కన్పిస్తుంది. కలగనేంతసేపూ అంతా నిజంగానే అన్పిస్తుంది. ఉదాహరణకు దాహం వేయటం. కలలో వేసిన దాహానికి నీరు త్రాగిన దాహం తీరుతుంది. ఆ కల మిథ్య అని తెలియనంతసేపు అది నిజంగానే దాహం తీరినట్లుగానే అనిపిస్తుంది. కాని మేల్కొని ఉన్న వేళలో ఆ కలలోని అసత్యాలు తెలుస్తాయి. అట్లాగే మేల్కొని ఉన్నప్పటి కనిపించే ప్రపంచము కూడా అనుభూతుల వలన అంతానిజంగానే అనిపిస్తుంది. ప్రపంచం సత్యమే అయితే గాఢనిద్రలో ఎందుకు ప్రత్యక్షముకాదు. నిద్రలో 'నేను లేను' అని నీవు అనలేవుకదా అన్నారు భగవాన్. భగవానుని మరియొక ప్రశ్న కూడా వేశారు. "నేనూ నిద్రలో ఉన్నప్పుడు ప్రపంచములేదని అనలేము. అది ఎప్పుడూ ఉంటూనే వుంది. నిద్రలో నేను దానిని గమనించకపోయినా నిద్రపోనివాళ్ళూ చూస్తూనే వుంటారుకదా." దానికి భగవాన్ చెప్పిన సమాధానము, **"నిద్రపోయినప్పుడు నీవున్నావని చెప్పుటకు ఇతరుల సాక్ష్యం కావలసి వచ్చింది. ఇప్పుడు మాత్రం వారి సాక్ష్యమెందుకు కావాలి?** నీవు మేల్కొని ఉన్నప్పుడే వాళ్ళు నీవు నిద్రపోయినపుడు ప్రపంచం ఉన్నదని చెప్పగలరు. కానీ నీ ఉనికి వేరు. నిద్రలేవగానే హాయిగా పడుకున్నానంటావు. అంటే ఎంత నిద్రలోనైనా నీ గురించి నీకు ఎరుక ఉందని తెలుసు. కాని ప్రపంచం ఉందో లేదోనని ఏ మాత్రము ఎరుకలేదు. నీవు మేల్కొని ఉన్నప్పుడు ప్రపంచము వచ్చి నేను నిజముగా ఉన్నానంటుందా? లేక నీవంటున్నావా? నీ గురించి నేనున్నాను అనగలను. అంటే నీ ఉనికి కేవలం ఉనికి మాత్రమే కాదు. దాని గురించి నీకు జ్ఞానమున్నది. కావున **నిజానికి ఆ ఉనికే చైతన్యం.** ప్రపంచము తనంతట తాను ఉండదు. తన ఉనికి గురించి దానికి తెలియదు. కావున అది అసత్యం."

భగవాన్ చెప్పినది నేను ఎవరో తెలుసుకోమన్నారు అన్ని సందేహాలు తీరుతాయని చెప్పారు. గాఢనిద్రలో జ్ఞానాదులేవీ ఉండవు. అలాగే ఆత్మానుభవమయిన దశలో కూడా ఉండవు. మేల్కొని ఉన్న స్థితిలో ఏవో జరుగుతున్నాయని అనుకోవటం. ఆ అనుకునే వాడికేగాని మరేమీకాదు. ఆ అనుకునేవాడే మిథ్య అవటం వల్ల ఏదో సంభవించుటలేదు నిజానికి.

భగవాన్ చెప్పినట్లుగా కనిపించే ప్రపంచం మిథ్య. ఆత్మ జ్ఞానానికి అది నిజంకాదని గ్రహిస్తారు. దేహభావన కలవాడు బాహ్య దృశ్యముల వెంట దృష్టి పరిగెత్తేవానికి జగత్తు సత్యముగనే కన్పిస్తుంది. మరి ఆ దృష్టి బాహ్యము నుండి మరల్చి అంతర్ముఖము చేసికొని లోనున్న ఆత్మను చూచి ఆ ఆత్మయే అంతట నిండియున్నదని జగత్తుకాని జీవుడు కాని ఈశ్వరుడుకాని అంతా బ్రహ్మమే లేక ఆత్మయే అని ఎరుక మన దృష్టి అంతర్ముఖమైనపుడు ఆత్మ జ్ఞానము కలిగినపుడు తెలుస్తుంది. సర్వం బ్రహ్మమయం. ఆ అతీతమైన స్థితికి పోవాలంటే ఆ శక్తిని అనగా అంతా బ్రహ్మమయంగా చూడాలి అంటే భగవాన్‌కు అనన్య శరణాగతి వేడుకుందాం. వారి కరుణాకటాక్షములో మనకి కూడా బాహ్యదృశ్య.ములపై దృష్టిపోక మహర్షి ఆశీర్వచనముతో మన దృష్టి అంతర్ముఖమై ఆత్మజ్ఞాన బోధ కల్గును. కావున మనమందరము భగవానుని ఆ స్థితికి రావాలని వేడుదాం. శరణు శరణు భగవాన్ శ్రీ రమణ మహర్షి. భగవాన్ రమణా నీవే శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 25

ఆణిముత్యాలు 7 - ఆత్మ

భగవాన్ ఇప్పటివరకు సర్వం బ్రహ్మమే లేక ఆత్మయే తప్ప మరి ఇతరమంటూ ఏమీ లేదని చెప్పారు. ఐతే కొందరి భక్తులు ఆత్మను గురించి పలురకములైన ప్రశ్నలను వేసి అసలు ఆత్మ అంటే ఏమిటో దాని రూపమేమిటో అది ఎలా సాక్షాత్కరించుకోవాలో అనే సందేహాలు వెలిబుచ్చారు. భగవాన్ వాటికి సమాధానాలు ఇచ్చారు. భగవాన్ చెప్పిన సమాధానములలో కొన్ని ఆణిముత్యాలను ఏరి ఇక్కడ తెలియపరచుచున్నాము.

భగవాన్ ఎప్పుడూ అంటూ ఉండేవారు **ఆత్మ అంటేనే నేను అని. కాని పైకి కనిపించే వ్యక్తిగతం మటుకుకాదని. పైకి కన్పించే ఈ వ్యక్తిగత అహానికి ఉనికిలేదు. దీనికి మనస్సు కల్పిస్తుంది. కావున భగవాన్ అసలైన నేనుని తెలుసుకుని వ్యక్తిగత అహాన్ని వదలమన్నారు.** భగవానుని కొందరు ఇట్లు ప్రశ్నించేవారు, "ఎరుక ఉండవలెనని అన్నారు కదా! ఆ ఎరుకను ఎలా పొందాలని?" దానికి భగవాన్ **"నీకు మరొక పేరే ఎరుక అని దానిని క్రొత్తగా సంపాదించుకోవాలని ఉండదు. ఆత్మ కానుటవంటి విషయాలను అనగా అనాత్మయైన వాటిని ఎరుకను మరవాలని ఎప్పుడైతే వాటి గురించి ఎరుకను విడిచినచో మిగిలినది స్వచ్ఛమైన ఎరుకే అదే నీవు మరియు అదే ఆత్మ."**

భగవాన్ ఎప్పుడూ ఇలా చెప్పేవారు, ఆత్మ ఎప్పుడూ ఉంటూనే ఉంది అని అది ఒక క్రొత్త పదార్థము వలె జనులు చూడాలని కాంక్షిస్తారు. అది శాశ్వతముగా అందరిలోను ఉన్నది. కాని కొందరు **అదేదో మెరిసే కాంతి అని మరి ఇంకో విధముగా చూడాలని కోరుతూ ఉంటారు. ఆత్మ వెలుగు కాదు, చీకటీ కాదు. నిజానికి దానిని నిర్వచించలేము.**

కొందరు భగవానుని ఇట్లు ప్రశ్నించేవారు, "ఆత్మ సాక్షాత్కారమైన వారు చూసేది ఏమిటని?" దానికి భగవాన్ ఈ విధముగా చెప్పారు. **"ఆత్మ ఎప్పుడూ సాక్షాత్కారమై ఉండేదే. కావున ఆత్మ సాక్షాత్కారము పొందడమంటే క్రొత్తగా దేనినో చూడటము అని అర్థముకాదు. నిజము కానిదాన్ని**

నిజమనుకోవటం వదలాలి. అప్పుడే ఆత్మగానే గుర్తిస్తాము. అసలు చూడటమంటూ ఏమీ ఉండదు. దృశ్యానికి, దృష్టికి అతీతమైనది.”

భగవాన్ కొన్ని సందర్భాలలో మౌనమే ఆత్మ అని కూడా అంటూ ఉండేవారు. ఎందుకంటే ఆత్మ నిమగ్నులైన వారు అటువంటి వారికి భావాలిక ఉండవు. ఒక్క మౌనమే ఉండును. ఆ మౌనము అహంకార రహితమై అతీతమైన స్థితిలో ఉండును.

మరికొందరు భక్తులు “జీవరాసులు ఎన్నో కనబడుతుండగా ఒకే ఒక ఆత్మ ఉన్నదని ఎలా అనగలం” అని ప్రశ్నించేవారు. దానికి భగవాన్ నేను **ఈ దేహాన్ని అనే భావాన్ని అంగీకరిస్తే ఆత్మలు అనేకం. ఈ భావం మాయమైపోయే స్థితిలో ఉండేదే ఆత్మ.** భగవాన్ మరియొక విషయాన్ని స్పష్టం చేశారు, మెలకువలోకాని స్వప్నములోకాని లేదా సుషుప్తిలోగాని జరిగేవాటికి ఎటువంటి ప్రభావం ఉండదని. ఈ మూడు స్థితుల్లో ఆత్మగానే ఉంటారని చెప్పారు. ఈ విషయ.ం సాధకుడు తెలిసికొనినచో జాగ్రత్, స్వప్న మరియు సుషుప్తిలగు ఈ అవస్థలు ఎటువంటి ఇబ్బంది పెట్టవన్నారు. ఉదాహరణకు తెరపై చిత్రాలు చూపిస్తారు. కాని ఆ తెరకి చూపించే చిత్రాలు అంటుకోవు. తెరమీద చిత్రాలలో సముద్ర కెరటాలు పొంగుతున్నట్లు చెట్లు తగులబడుతున్నట్లు కనబడినప్పటికి తెరకు ఏమీ అంటుకోవు. అనగా తెరని ఏమీ చేయలేవు. కొందరు నేను స్వప్నము చూశాను అని, నేను బాగా నిద్రపోయానని మరియు నేను మేల్కొని ఉన్నానని అనినప్పుడు ఆ అనే వ్యక్తి ఆ మూడు స్థితులలో ఉన్నట్లే. కావున **ఈ మూడు అవస్థలు వచ్చిపోయినను అతను మాత్రము ఎప్పుడు ఉంటాడు. ఈ మూడు అవస్థలు ఆత్మకి పట్టవు. ఉన్నదల్లా ఒకే ఒక అవస్థ అది చైతన్య స్థితి లేక ఎరుక లేక ఉనికి. అన్ని అవస్థలలోను ఉండే ఆ “నేను” ఆ ఉనికే సత్యం.** చైతన్యానికి మెలకువను, నిద్రను, కలను జోడించగా వచ్చే మూడు స్థితులు జాగ్రత్, సుషుప్తి స్వప్నావస్థలు. భగవాన్ చెప్పిన ఈ అవస్థలను గురించి విన్న తరువాత కొందరిట్లు ప్రశ్నించారు. ఈ మూడు అవస్థలు ఆత్మ అనే తెర మీదకు ఎందుకు వస్తాయని. దానికి భగవాన్ ఇట్లు జవాబు చెప్పినారు. **“అసలు ఈ ప్రశ్న వేసిందెవరు ? ఈ అవస్థలు వస్తూపోతూ ఉంటాయని ఆత్మ అంటుందా ? ద్రష్టే అంటున్నాడు. అసలు మనస్సు ఎలా**

తయారవుతుందంటే ద్రష్ట, దృశ్యము కలిస్తేనే మనస్సవుతుంది. నిజానికి మన మనస్సనేది ఏదైనా ఉన్నదా అని గమనించు. మనస్సు ఆత్మలో లీనమైనప్పుడు ద్రష్టలేదు, దృశ్యములేదు. ఉండేది మాత్రం ఆత్మే.

భగవాన్ మరియొక రహస్యము కూడా చెప్పారు. ఆత్మకి భిన్నంగా మనస్సనేది ఉండదని. ఆత్మ మనస్సు లేకుండా ఉంటుంది. కాని ఆత్మ లేకుండా మనస్సు ఉండలేదు. **అంతర్ముఖమైన మనస్సే ఆత్మ. అదే మనస్సు బహిర్ముఖమైతే అహము మరియు ప్రపంచమవుతుంది.** పరిపూర్ణ ఆనందమే బ్రహ్మమని పరిపూర్ణ శాంతి ఆత్మ అని ఆ ఆనందమే ఆత్మ యొక్క స్వరూపమని భగవాన్ చెప్పారు. కావున అటువంటి సత్యాన్ని తెలుసుకుని ఆత్మలో ఉంటూ ఆనందాన్ని పొందమన్నారు. **అసలు సంతోషమనేది సహజముగా ప్రతి జీవి లోపలే ఉందని ఆ సంతోషము బాహ్య పరిస్థితుల వల్ల పొందేదికాదని చెప్పారు భగవాన్.** ఉదాహరణకు మనము మంచి నిద్రలో ఉన్నప్పుడు అతను ఒక దేహమని జ్ఞాపకముకాని, సిరిసంపదలతో ఉన్నాడనిగాని నిద్రలో తెలియదు. కాని ఎంతో సంతోషంగా ఉంటాడు. కావున ఎవరైనా తమ ఆనందము బైట కనిపించే సంపదల వల్ల అనుకుంటే అది తప్పే.

భగవంతుడు ఆత్మ హృదయం చైతన్య స్థావరం అన్నీ ఒక్కటే. హృదయమే కేంద్రం. అది భౌతికం కాదు. ఆ హృదయము లేకపోతే ఏదీ లేదు. అక్కడి నుండే భావాలు ఉదయించి మళ్ళీ దానిపై ఆధారపడి అందులోనే లయమయి పోతాయి. మనస్సు ఈ భావాల సమూహం. ఆ భావాలే ప్రపంచానికి రూపు కల్పిస్తాయి.

భగవాన్ చెప్పిన మాటలను జ్ఞప్తికి ఉంచుకొని, మనకి ఆత్మ అంటే ఏమిటో ఎరుక కలుగవలెనని భగవాన్‌ని వేడుకుంటూ శరణువేడుదాం.

రమణశ్శరణాగతి

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము - 26

ఆణిముత్యాలు - 8 - ఆత్మ జ్ఞానం - కొన్ని ముఖ్యమైన బోదనలు / రహస్యాలు

భగవాన్ శ్రీ రమణ మహర్షులవారు ఎల్లప్పుడు మౌనముగా ఉంటూ ఎవరైనా వారిని ప్రశ్నించిన, సాధరణముగా నేను ఎవరు అని ముందు తెలుసుకోమనేవారు. ఆ అసలైన నేనును తెలుసుకుంటే ఆత్మ సాక్షాత్కారమైనట్లే. ఈ నేను అనునది మనిషికి సంబంధించిన అనగా దేహమునకు గాని మనస్సునకు గాని కాదు. మూడు దశలలో అనగా జాగ్రత్, స్వప్న, సుషుప్తి లందు అనుభవించునదే ఆ నేను. ఈ మూడు అవస్థలు వ్యక్తిని ఎటువంటిబాధ పెట్టవు ఈ మూడు అవస్థలు ఆత్మను భాదింపకుండ వచ్చిపోయేవి. ఆత్మ ఎల్లప్పుడు సంపూర్ణముగా ఆనందముతో ఉండునని తెలిసికొనుటయే ఆత్మ సాక్షాత్కారముని భగవాన్ చెప్పేవారు.

భగవాన్ ఆత్మను తెలిసికొనుట ఎట్లు అని ప్రశ్నించే భక్తులకు వారు చెప్పిన సమాధానము **ఆత్మగా ఉండుటయే ఆత్మను తెలిసికొనుట అని అనేవారు.** ఉదాహరణకు మన కనులను మనము చూసుకొనలేము. అద్దములో మాత్రమే మన కనులను చూడగలము. ఒక వేళ ఆ అద్దమును ఉపయోగించక పోయినంత మాత్రమున మన కనుల ఉనికిని కాదనగలమా అనే ప్రశ్నను భగవాన్ వేసేవారు. కావున భగవాన్ చెప్పినదేమనగా ఆత్మను తెలిసికొనుట అనగా ఆత్మగా ఉండుటయే అని మరియు భగవాన్ ఇట్లనేవారు. "నీకు ఆత్మ తెలియదని చెప్పగలవా ? కావున మన కనులను మనము చూడలేక పోయినను అదే విధముగా ఆత్మ విషయముగా ఉండనప్పటికి నీవు ఆత్మను ఎరుగుదువు. లేదా ఆత్మ విషయముగా లేదు గనుక నీవు నీ ఆత్మను లేదనగలవా ?" అని భగవాన్ చెప్పేవారు. ఆత్మయే ఈశ్వరుడు, నేనున్నాను అనునది ఈశ్వరుడు భగవాన్ దీనికి నిదర్శనముగా భగవద్గీత యందు 10 వ అధ్యాయము నందు (విభూది యోగము) 20వ శ్లోకం ఇక్కడ వివరించినారు.

అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః ।

అహమాదిశ్చ మధ్యంచ భూతానామంత ఏవచ ॥

ఓ అర్జునా ! సమస్త ప్రాణుల హృదయములందున్న ఆత్మను నేనే. సకల భూతముల (ప్రాణం) ఆదియు, మధ్యస్థితియు అంతయు నేనే. (ప్రాణుల యొక్క సృష్టి స్థితి లయములకు కారణము నేనే.)

భగవాన్ చెప్పినదేమనగా ఈశ్వరుడు ఆత్మ కంటే వేరు కాదని ఆత్మయే ఈశ్వరుడని కాని అట్టి సందేహము రావడానికి గల కారణము ఎవరైతే అహంకారాత్మను పట్టుకున్న వాడు, ఈశ్వరుడు ఆత్మ కంటే వేరని భావన కల్గును అని చెప్పినారు. సత్యాత్మను పట్టుకున్న వారికి ఇలాంటి సందేహము రావని భగవాన్ చెప్పారు. ఆత్మ ఎన్నడు కనిపించదు. అలాగే అదృశ్యము కూడా కాదని కావున ఆత్మ శాశ్వతమని భగవాన్ చెప్పినారు. భగవాన్ సాక్షాత్కారమంటే శాంతముగా ఉండటమే అని సాక్షాత్కారమనేది క్రొత్తగా పొందేది కాదని సాధకుడు నాకు సాక్షాత్కారము కలుగలేదు అనే భావాన్ని వదులుకోమన్నారు. **ఆత్మ లేని క్షణమనేది లేదని భగవాన్ చెప్పేవారు. ఆనాత్మమైనవి వదులుకుంటే మిగిలేది ఆత్మే అని లోనున్న వాసనలన్ని వదిలించుకోమన్నారు. ఆత్మ అంటే నువ్వే అది తెలిసికోవటమే ఆత్మా సాక్షాత్కారమని** చెప్పేవారు. ప్రతి జీవిలో లోన ఆనంతమైన ఆనందం రూపేణా ఆత్మ ఉండునని కాని ఆ ఆనంద నిలయమైన ఆత్మని మాయతెర కప్పుటచే అది తెలియకపోవుటచే అవిద్య ఆవతరించునని దృష్టి దేహముపై పోయి మనస్సు అనేకమైన ఆలోచనలను కలిగించి వాటి వెంట పరుగిడును కాని దృష్టి అంతర్ముఖము కాదు భగవాన్ చెప్పినదేమనగా **ప్రతివారికి నేనున్నాని తెలుసని వారి ఉనికి ఎవ్వరూ కాదనలేరని** సుషుప్తిలో మాత్రము వారికి ఎరుక అనేది ఉండదని మెలకువ వచ్చిన వెంటనే ఆ ఎరుక తెలుస్తున్నదని చెప్పారు. సుషుప్తి లోను మెలకువ లోను ఉన్నది మనిషి ఒక్కడే. మరి తేడా నిద్రలో మాత్రము అతనికి శరీరస్పృహ లేదు. మెలకువలో మటుకు ఆ స్పృహ ఉన్నది. దేహము గురించిన ఈ ఎరుక పైకి రావటమే ఈ భేదానికి కారణం. కాని చైతన్యంలో మాత్రము మార్పులేదు. సుషుప్తిలో పరిమితులు అంటూ ఉండవు. అంటే బంధాలనేవి సుషుప్తిలో అంటవు. అదే మెలకువగా ఉన్నప్పుడు మాత్రమే పరిమితులు ఉండి అవి బంధాలుగా ఏర్పడతాయి. ఈ మెలకువలోనే ఈ శరీరమే నేను అనే తప్పుభావన ఏర్పడుతుంది. కావున భగవాన్ చెప్పినదేమనగా

ఈ శరీరము నేనే అనే తప్పుడు భావన పోవాలని అసలైన నేను అనేది ప్రతి వారిలో ఎప్పుడు ఉంటుందని చెప్పారు. ఈ మూడు అవస్థలలో సుషుప్తి మరియు మెలకువను తీసుకుని గ్రహించినచో శరీర ధ్యాస అనేది ఒక దానిలో కనబడుతుంది. కాని చైతన్యం అనేది మటుకు ఉంటుంది. **భగవాన్ ఈ శరీరమే నేననే తప్పుడు భావము పోవుటయే సాక్షాత్కారమని అంతే తప్ప సాక్షాత్కారమంటే ఏదో ఒకటి మనముందు సాక్షాత్కారించుటము కాదని ఈ శరీరమే నేనను మిధ్యాజ్ఞానము పోయిన పిదప మిగిలినది ఆత్మే. కావున ఆత్మ సాక్షాత్కారము అయినట్లు. ఇదే ఆత్మా జ్ఞానము కూడా. ఆత్మ అనేది కేవలము ఎరుకే. ఈ మూడు స్థితులు అనగా సుషుప్తి స్వప్నము మెలకువ ఆత్మపై తాత్కాలికమైన ఏర్పడే స్థితులు మాత్రమే. కాని ఆత్మ మాత్రము నిశ్చలముగా స్థిరముగా శాశ్వతముగా ఉండేది.** ఆ ఎరుక ఆత్మ. సుషుప్తిలో, మెలకువలోను మనిషి ఉంటాడు. ఆ రెండు స్థితులకి భేదమేమిటంటే మెలకువలో శరీరము, ప్రపంచము, వస్తువులు కనిపిస్తాయి. కాని సుషుప్తిలో కనబడవు. ఆ సుషుప్తి మరియు మెలకువ అవిచ్ఛిన్నముగా కొనసాగుతూ ఆ స్థితి స్వచ్ఛమైన ఉనికే ఇలాంటి బోదనలు విన్నపుడు ఒక భక్తుడు భగవాన్‌ని ఈ విధంగా ప్రశ్నించినాడు. "సుషుప్తిలో నాకు ఎరుక ఉండదు కదా." దానికి భగవాన్ చెప్పినది. " నిజమే శరీరము కాని ప్రపంచము కాని మరియు వస్తువులు కాని సుషుప్తిలో నీకు తెలియవు. కాని ఇప్పుడు నువ్వు వేసిన ప్రశ్న సుషుప్తిలో నాకు ఎరుకే ఉండదు అని నువ్వు అన్నావంటే ఆ అవస్థలో కూడా నువ్వున్నావన్నమాట. కాని ఆమాటలను ఇప్పుడనేది ఎవరు మెలకువగా ఉన్న మనిషి. కాని నిద్ర పోయేవాడన లేడు. కాబట్టి నిద్రలో ఈ శరీరము ఆత్మ అని మనిషికి ధ్యాస ఉండదు అని ఋజువైనది. మెలకువలో మాత్రమే నీవు దేహంతో తదాత్మ్యం చెందుటవలన కనబడే ప్రపంచాన్ని చూసి మురిసిపోతావు. కాని సుషుప్తిలో నీవంటూ ఒక వ్యక్తిగా లేకపోవుటచే అవేవీ ఉండవు. కావున ఉనికి శాశ్వతమని శరీరము ప్రపంచము కావని అవి చైతన్యమనే తెరపై వస్తూ పోయేవని ఆ ఉనికే, ఆ చైతన్యమే శాశ్వతము.

నేను అనే భావము మెలకువ స్థితిలోనే వస్తుంది. అప్పుడే భావాలు శరీరవ్యాపకాలు తదితరమైనటు వంటివి ప్రారంభమవుతాయి. సుషుప్తి స్థితి మటుకు శుద్ధ చైతన్యానికి చేరువగా

ఉంటుంది. అలా అని ఈ నేను అనే అహం వృత్తి భావము మెలకువలోనే వస్తున్నది కదా. మన మెల్లప్పుడు సుషుప్తిలోనే ఉందామనుకుంటే పొరపాటే ఇతర స్థితులు కూడా జ్ఞాని. అయిన వానికి వస్తు ఉండాలి. సామాన్యుడికి, జ్ఞానికి అ స్థితులలో అనుభవించే ఆనందానికి మటుకు తేడా ఉంటుంది. జ్ఞాని ఆనందము శాశ్వతమైనది. దేనితోను కూడా మారదు. జ్ఞానికి ఎరుక ఉంటుంది. భగవాన్ పదేపదే వారిని ప్రశ్నించిన భక్తులకు ఆత్మను గురించి ఆ స్థితిని అందుకోలేకున్నాము. అనే వారికి భోదించినదేమనగా నువ్వే ఆత్మవని నువ్వెప్పుడు ఉంటూనే ఉన్నావని తప్ప ఆత్మ గురించి వేరుగా చెప్పవలసినది ఏమీ లేదన్నారు. మరియు భగవాత్ సాక్షాత్కారమన్నా, ఆత్మసాక్షాత్కామన్నా ఒక్కటేనని నువ్వునీవుగా, నీఆత్మగా ఉండుట అని చెప్పేవారు . ఈ శరీరము నేనని అనాత్మ విషయాలను విడనాడినచో మిగిలినదే ఆత్మ.

నేను అనే ఈ అహంకారము వస్తూ పోతుందని అది తాత్కాలికమైనదని అసలైన ఆత్మ శాశ్వతమని నువ్వే ఆ ఆత్మవని కాని నేను అనే అహంకారాన్ని తప్పుగా అర్థం చేసుకుని దానితో తదాత్మ్యం చెందుచున్నారని భగవాన్ సూచించారు. ఎప్పుడైతే నీవు దేహానివనుకున్నప్పుడు ప్రపంచం ఉంటుందని అట్లుకాక నువ్వు ఆత్మవే అనుకున్నప్పుడు ఉండేదల్లా ఆత్మేనని భగవాన్ సూచించారు. భగవాన్ వాస్తవానికి అవిద్య అంటూ ఏమీ ఉండదని అది మన అజ్ఞానమే తప్ప మరేమీ కాదని అది కూడా **ఆత్మ గురించి మరుపే అజ్ఞానమని భగవాన్ సూచించారు. అసలు ఆత్మ జ్ఞానమంటే ఆత్మగా ఉండటమే అని ఆత్మగా ఉనికే అని అనగా నీ ఉనికే అని భగవాన్ చెప్పేవారు. ఆత్మని అందరూ వేరే విధంగా భావించుకొనుట చేత జ్ఞానాన్ని పోగొట్టుకొని అవిద్యలో చిక్కుకుంటారు.** ఎప్పుడూ నీ గురించి చెప్పుకుంటూ ఆలోచిస్తూ ఉంటావని కాని ప్రశ్నించినప్పుడు ఆ నేను ఎవరో తెలియదంటావని భగవాన్ చెప్పేవారు. కావున ఆత్మ అంటే నువ్వేనని భగవాన్ సూచించారు. ఒక భక్తుడు కనిపించే చెట్లు, చేమలు, కొండలు, విషయముల గురించి మరేమిటని ప్రశ్నింపగా భగవాన్ దానికి జవాబుగా “ఆత్మకి భిన్నంగా ఉండవని నిజానికి నువ్వు వాటిని చూస్తున్నాననుకుంటున్నావుగాని ఆ భావము ఆత్మ నుంచే లేస్తుందని అది ఎక్కడినుంచి లేస్తుందో కనుక్కోమని అప్పుడిక ఆలోచనలురాక ఆత్మే మిగులుతుందన్నారు.

ఉదాహరణకు సినిమా తెరమీద కాంతి పడుతుంది. దానిమీద నీడలు నడుస్తున్నట్లు చూచేవారికి కన్పిస్తుంది. ఆ నాటకంలోని ప్రేక్షకులను కూడా తెరమీద నాటకమాడే వారిలో భాగంగా చూపిస్తే చూచేవాళ్ళు చూడబడేది తెరమీద ఉంటాయి. **దీనిని నీకు వర్తించుకో. నువ్వు తెరవి. ఆత్మ అహంకారాన్ని సృష్టించింది. అహంకారానికి గల భావాలు ప్రపంచంలాగా ప్రదర్శింపబడతాయి. కావున నువ్వు చెప్పిన చెట్లు, చేమలు వీటిలోనివే. ఇవన్నీ ఆత్మ తప్ప వేరేమీ కావని నువ్వు ఆత్మని చూస్తే అన్నీ ప్రతిచోట మరియు ఎప్పుడు అదేనని తెలుస్తుంది. ఆత్మకి తప్ప వేరేదేనికి ఉనికి లేదు.**

భగవాన్ మరియొక ముఖ్యమైన విషయం చెప్పినదేమనగా అజ్ఞాని ఎల్లప్పుడు మనస్సునే చూస్తాడని నిజానికి అది ఆత్మనుంచి ఉదయించే శుద్ధ చైతన్యానికి ప్రతిబింబం మాత్రమే. అతడు అజ్ఞాని అవుట వలన మనసునే చూస్తాడు కావున అతని మనసు సహజంగా బైట పరుగెడుతుందని, దానివల్ల తన మూలాన్ని తెలుసుకోలేకపోతున్నాడు. **హృదయం నుంచి వచ్చే ఆ అనంతమైన చైతన్యపు కాంతిని మనిషి మనస్సులోని వాసనలు ప్రతిబింబించడం అవుతాయి. ఈ ప్రతిబింబం యొక్క రూపాలనే మనస్సంటారని ఆ ప్రతిబింబాన్ని చూసి అజ్ఞాని తాను జీవుడని, వ్యక్తి అని భ్రమపడి అతడు పరిమితుడని అనుకుంటాడు.** దీని వలననే ఆత్మ సాక్షాత్కారానికి ఆటాంకాలు మనస్సు యొక్క వాసనలే అని భగవాన్ చెప్పారు.

భగవాన్ ఉన్నదల్లా జ్ఞానమేనని, అసలు అవిద్య అంటూ లేదని, కానీ దానిగ్రహింపు సంస్కారాల వల్ల అని సూచించారు. **ఆత్మను అహంకారంగా భావిస్తే అహంకారమే అవుతాయని, మనస్సుగా భావిస్తే మనస్సు అవుతామని, దేహంగా భావిస్తే దేహమవుతామని భగవాన్ చెప్పారు. ఇన్నింటికి గల కారణం భావమేనని,** కావున అహంకారాన్ని అది చేసే పనులను లెక్కపెట్టక దాని వెనుకనున్న కాంతినే గమనించమని, అహంకారమంటే "నేను" అనే భావమేనని నిజమైన నేను ఆత్మేనని భగవాన్ హెచ్చరించారు. ఈ భావాలవలనే మనలోపలనున్న ఆనందాన్ని మనస్సు అడ్డుపడి భావములచేత ఆ ఆనందాన్ని బైటకి తీయదు. కావున మనస్సు యొక్క నిజ స్వరూపము తెలుసుకుంటే ఆత్మ అన్వేషింపబడుతుంది. **మనచుట్టూ చూసేవన్నీ మనలోనే ఉన్నది.** మనకొక

గమ్యముందని ఆ గమ్యాన్ని చేరుకోవాలని దానికొక మార్గమున్నదని భావనే తప్పని భగవాన్ సూచించారు. నిజానికి ఆ గమ్యం మరియు ప్రశాంతత మనమేనని గ్రహించాలి. **మనస్సు అణిగిపోతే ప్రపంచము కూడా అణిగిపోతుందని భగవాన్ చెప్పేవారు.**

భగవాన్ చెప్పిన ఈ ఆత్మ జ్ఞానమును వారి అమూల్యమైన బోధనలను రహస్యాలను మనము కూడా ఆచరిద్దాం. ఆ ఆచరించటానికి కావలసిన శక్తిని భగవాన్‌ని వేడుకుందాం. మనకు అవిద్యే లేదని ఉన్నదల్లా జ్ఞానమేనని, మనము ఒక దేహముకాదని కనిపించే జగత్తు మిథ్యేయని ఆత్మయే సత్యమని మనమందరము ఆ భగవాన్ కృపతో వారి ఆణిముత్యముల వంటి బోధనలు మనకు అర్ధముకావాలని, ఆత్మగానే మనము ఉండాలని అసలు మనము ఆత్మే అని తెలుసుకోవాలని భగవాన్ శ్రీ రమణ మహర్షిని సర్వశ్య శరణాగతి వేడుతూ ఓ అరుణాచల రమణా నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 27

అణిముత్యాలు - 29

ఆత్మ జ్ఞానము – పునర్వీక్షణము

భగవాన్ 'నేను' అనునది పంచకోశములకు అతీతమైనదని. కావున ఏవైతే ఆత్మకానివి అనగా అనాత్మవైన దానిని విడిచినచో మిగిలినది ఆత్మఅని అదే సచ్చిదానందమని లేదా పరమానందమని చెప్పారు. దేహ వ్యామోహమున్నవాడు మరియు దేహమే నేను అని అనుకొనినవాడు అన్నింటియందును భేదములను చూచును. అతనికి ఏది మంచిది అటువంటి భావమును కల్గించును. కాని భగవాన్ చెప్పినట్లుగా ఒకవేళ దేహమే నేనని అనుకొనిన వాని ప్రకారము అతను గాఢ నిద్రలో ఉన్నప్పుడు మరి అతను తన దేహమును ఎరిగియున్నాడా ? లేదు. కాబట్టి మెలకువలో ఉన్నప్పుడు బాధించునది ఆ నేను అనునదే అహంకారము. అహంకారమును వీడితే మిగిలేది ఆనందమే. ఎవరైతే దేహ రహిత భావమున్న వానికి అతను తన శరీరముతో ఉన్నను జ్ఞానముచే అన్నిటిని ఒకే విధముగా చూచుచు భేదభావము ఎరుగడు. అటువంటి జ్ఞానికి జనన, మరణములు లేవు. దాని ప్రకారము **ఉన్నది ఒక్క చైతన్యము మాత్రమే. అది జాగృత్, స్వప్న, సుషుప్తి దశలలో ఉండును.** నేను దేహమే అనుకొనిన వాని అహం (నేను) నిద్రలోలేదని తాను మేల్కొన్న తరువాత ఆవిర్భవించి తరువాత ప్రపంచమంతా కనబడును. ఒక్కసారి అటువంటి వ్యక్తి (అహం–నేను) నిద్రలో ఈ నేను ఎక్కడ ఉండినదని అది అక్కడే ఉందా లేదా అని ప్రశ్నించుకొనినా అతడు అనుకున్నట్లుగా నిజానికి అది అక్కడ కూడా ఉండి తీరవలెను. కాని అనుకొనిన విధముగా ఉండదు. అది కేవలము అహంభావన. **కాని నిద్రించుచున్న సమయములో ఉన్న నేను వాస్తవమైన నేను. అది సర్వదా అన్నివేళల్లో ఉండును. అదే చైతన్యము.** ఆ అసలైన నేనును తెలుసుకొనవలెను. ఈ అసలైన చైతన్యమును ఏ ఆలోచనలు కాని అడ్డుపెట్టవు.

భగవాన్ ప్రపంచము బాహ్యము కాదని ప్రపంచమును గుర్తింపగలిగేది చైతన్యముతో

మాత్రమే అని కావున ఇంద్రియానుభవములకు బాహ్యమూలము ఉండనేరదని చెప్పినారు. ప్రపంచము తానున్నట్లుగా చెప్పినదా? లేదు అది నీ అనుభవము మాత్రమే. ప్రపంచము కూడా గాఢనిద్రలో ఉన్నవారికి గుర్తింపబడదు. కావున **ప్రపంచము అహంకారము యొక్క అనుక్రమము అని చెప్పారు. నీ అహంభావమే ఆలోచనలకు మూలమై అది దేహమును మరియు ప్రపంచమును కల్పించునని భగవాన్ సూచించినారు.** నీ మనస్సు ఎప్పుడూ నిన్ను వెంబడించునని నీవు సంసారములో ఉన్నను లేక పరిత్యజించినను ఒకవేళ ఏ అరణ్యమునకు పోయినను ఆ మనస్సు నిన్ను వెంటాడునని భగవాన్ చెప్పినారు. నీవు గృహస్థుడవని ఆలోచన కలిగినచో గృహస్థ పరిసరములు గూర్చి చింత కల్గింపచేయును. అలాగే నీ మనస్సు నీవు సన్యాసివని ఆలోచన కల్గింపచేసినచో కుటుంబ పరిసరములకు బదులుగా అరణ్య వాతావరణము నిలుపును. మనస్సే ఆటంకము కావున భగవాన్ చెప్పినది మనస్సును జయింపమని.

స్ఫురణ గూర్చి భగవాన్ చెప్పినది అది ఆత్మానుభవము యొక్క ప్రథమానుభవమని అది శుద్ధమని, కర్త కర్మ దానినుండి బయలుదేరును. వ్యక్తి తానే కర్త అని అనుకొనినచో తాను చేయు పనులన్ని తనకంటే వేరని తోచును. అవి అప్పుడప్పుడు ప్రపంచమును కర్త యొక్క ప్రపంచానుభవమును కల్పించుచూ, మరల్చుకొనుచూ బహిర్గతమగును. ఇట్టి సమయములో **మానవుడు దీనికి భిన్నముగా తాను ఒక సినిమా తెర అని ఆ తెరమీద కర్త విషయములు ప్రతిఫలించుచున్నవనియు అనుకొన్నచో ఎట్టి కలవరము ఉండదు. అప్పుడతను సాక్షిగానే గమనించగలడు. కావున భగవాన్ చెప్పినదేమనగా మానవుడు తాను కర్త అని భావింపరాదని భావించిన యెడల చిక్కు ప్రారంభమగునని సమస్తము నడిపించునది పరమశక్తియే అని మానవుడు మాత్రం ఒక పనిముట్టని గ్రహించవలెను.** కాని మానవుడు తనను తాను పరిమితునిగా చూచుకొనరాదు. పై చెప్పిన విధముగా నిద్రలో ప్రపంచము అహంభావము కష్టము లేదు. అటువంటి సుఖమయి జీవికి 'నేను' అను ఒకటి మేల్కొని ఆ నేనని అహంభావము ప్రపంచమును చూపుచున్నది. అహంభావము ఆవిర్భవింపక ముందు ఉన్న ఆనందము ఆ అహంభావము ఆవిర్భమగుటచే కష్టములు ఎదురై తన సహజ ఆనందమును మరచుచున్నాడు.

ఒకానొక సందర్భములో ఒక వ్యక్తి మరణవార్త భగవాన్ చెవికి చేరినది. దానికి భగవాన్ ఈ విధముగా అన్నారు. **"నిజానికి మరణించిన వారు ఆనందమయిలు. దేహమును వదిలించుకున్నారు. మరణించినవాడు దుఃఖింపడు కాని బ్రతికి ఉన్నవాడు పోయిన వాడి కొరకు దుఃఖిస్తున్నాడు. మానవులు నిద్రకు భయపడుదురా ? దానికి భిన్నముగా నిద్రను కోరుకుందురు. నిద్రించిన వ్యక్తి మేల్కొనిన పిదప తాను హాయిగా నిద్రపోయితినని చెప్పును. నిద్ర తాత్కాలిక మరణమైతే మరణము దీర్ఘ నిద్ర.** బ్రతికి ఉండగానే మానవుడు మరణించినచో అతడు ఇతరుల మరణమునకు శోకింపనక్కరలేదు. దేహమున్నను లేకున్నను జాగ్రత్, స్వప్న, సుషుప్తిలందు **వ్యక్తి యొక్క ఉనికి మాత్రం స్పష్టమే.** కావున శరీర బంధములలో కొనసాగవలెనని వ్యక్తి ఎందుకు కోరుకొనవలెను ? మానవుడు అమరమైన తన ఆత్మను తెలుసుకొని మరణించి అమరుడుగా ఆనందమయుడుగా ఉండుగాక" అని భగవాన్ ఆణిముత్యముల వంటి బోధనను ప్రకటించారు. భగవాన్ మనస్సు గురించి మళ్ళీ ఇలా చెప్తున్నారు, "మనస్సనేది ఆత్మనుండి ఏర్పడిన ప్రతిబింబం మాత్రమేనని అది కేవలం జాగ్రదవస్థలోనే కన్పించునని సూచించినారు. గాఢ నిద్రలో మనస్సు లీనమగునుకాని నశింపదని ఆ లీనమగునది మరల కన్పించునని భగవాన్ చెప్పినారు." యోగి అయినవాడు మనస్సును నశింప చేయుటకు యత్నించవలెను. **ధ్యానము చేసేవారికి మనస్సు నశింపదు కాని లీనమగును. కాని అది చాలదు. మనో నాశనము కొరకు సాధన చేయవలెను. ఆత్మకంటే వేరుగా మనస్సు ఉన్నట్లు గుర్తింపకుండుటే మనో నాశనము కావున మనస్సును నశింపచేయుటకు యత్నించవలెను.** భగవాన్ చెప్పినది మనము ఆత్మకొరకు ఎటువంటి పరిశోధనలు చేయవలసిన అవసరమే లేదని కాని అనాత్మను మాత్రమే పరిశోధించవలెనని గుర్తుంచుకొనవలెను. ఆత్మ ఎప్పుడు ఉన్నదే. క్రొత్తగా దాని కొరకై ప్రయోగము చేసి కనుగొన నవసరం లేదు. భగవాన్ చెప్పినట్లుగా నీవే ఆత్మ, నీవే ఆత్మ గుర్తుంచుకో. అలాగే ఈశ్వరుడు కూడా ఆత్మకంటే వేరుకాదు. గుర్తుంచుకో. భగవాన్ **నీవే క్రియాశీలుడవని అనుకొనుచున్నవాని కూడా హెచ్చరించెను.** ఉదాహరణగా, ఎవరైనా వేరే చోటు నుండి బండిలో బయలుదేరి ఇక్కడికి వచ్చినచో అట్టి ప్రయాణము చేసినవాడు 'నేను ఇంతదూరము ప్రయాణము

చేసినానని చెప్పేదడు. కాని అది నిజమా ? ఆ కదలికలు నీ కదలికలని భ్రమించినట్లే. **ఇతర కార్యకలాపములు కూడా నీవేనని, అది నీవని భ్రమించుచున్నావు.** నిజానికి అవి నీవేవీ కావని ఈశ్వరుడి కార్యములని భగవాన్ సూచించారు. భగవాన్ చెప్పినట్లుగా ఒక వ్యక్తికి తనకొక రూపమున్నదని భావించినంతనే దుఃఖముండునని ఎప్పుడైతే ఆ రూపమును అతిక్రమించినచో సుఖము కలిగి ఆత్మను శాశ్వతముగా తెలిసికొనును. కాబట్టి జననమరణములు లేవు. **పుట్టినది శరీరం మాత్రమే. అది అహంకార కల్పనయే. అనగా అహంభావనకు ఒక శరీరము కావాలి కాబట్టి అది దేహముతో తాదాత్మ్యం పొందును. శరీరము లేకున్నచో ఆ అహంభావము కనబడదు.** అహంకారము ఆవిర్భవించినపుడు అదే మెలకువ. ఆ సమయములోనే ఆలోచనలు వచ్చుచుండును. అవి ఎవరికి ఆలోచనలు కలుగుచున్నవని అతడు కనుగొనవలెను. పైగా అవి ఎక్కడి నుండి వచ్చుచున్నవని ప్రశ్నించుకొనవలెను. అవి చైతన్యవంతమైన ఆత్మనుండి వచ్చుచున్నవని వానిని అస్పష్టముగానైనను తెలుసుకొన్నచో అది అహంభావ నాశనమునకు సాయపడును. కావున ఆలోచనయే ముఖ్యమైనది. జ్ఞానియైనవాడు తాను గాఢ నిద్రలో ఎట్లా ఉన్నాడని మెలకువలో ఎట్లా ఉన్నాడని ఆ రెండింటి భేదమేమో తెలిసికొనును. శాశ్వతమైన సత్తాకంటే వేరుగా వ్యక్తులు ఉండరని గ్రహించును. భగవాన్‌ని ఒక శిష్యుడు తన మూడేండ్ల వయస్సుగల కుమార్తెను కోల్పోయినప్పుడు, బాధపడినప్పుడు భగవాన్ అతనితో ఇట్లనినారు, **"మానవుడు తాను పుట్టినానని అనుకొనినచో మరణ భయమును ఎట్లు నివారించుకొనగలడు ? కావున తాను పుట్టియున్నాడా, లేక ఆత్మకు జన్మ ఏమైనా ఉన్నదా ? అను విషయమును అతను కనుగొనవలెను. ఆత్మ సత్యమని, శాశ్వతమని పుట్టిన దేహము ఆలోచనలో కరిగిపోవునని ఆలోచనలు రావడమే అన్ని అనర్థములకు కారణమని** అతడు తెలుసుకొనవలెను. అసలు ఆలోచనను ఎక్కడి నుండి వచ్చుచున్నదోనని గ్రహింపవలెను. అప్పుడే నీవు అంతరాత్మయందు సుస్థిరముగా ఉండెదవని మరియు పూర్వజన్మలో లెక్కలేనన్ని అంటిపెట్టుకున్న వాసనలే ఆలోచనలుగా వచ్చునని వాటిని నాశనము చేయుటే లక్ష్యమని భగవాన్ సూచించారు. ప్రతిజీవి కూడా తాను శాశ్వతుడని తలుస్తాడని అటువంటి వ్యక్తి ఎందరో తనముందు మరణించినను

తాను శాశ్వతుడని తలంచును. మానవుడు చైతన్యవంతమైన ఆత్మను జడ దేహముతో కలిపివేయుట చేత భ్రాంతి చెందుతున్నాడని అహంభావమును అణచివేయవలెను. ఆత్మ ఎప్పటికి శాశ్వతముగా సన్నిహితముగానే వున్నది. భ్రమను తొలగించుకుంటే చాలునని భగవాన్ హెచ్చరించారు.

భగవాన్ చెప్పిన ఆత్మజ్ఞానము, పునర్వీక్షణములోని అంశములు మనకి అర్ధముకావలెనని మన మనస్సు పూర్వజన్మ వాసనలచే ఆలోచనలను కల్గింపకుండ మన దృష్టి జననమరణములపై భయభ్రాంతులు పొందకుండా మనమొక దేహము కాదని దైవమేనని తెలుసుకొనుటకు మళ్ళీ భగవాన్ శ్రీ రమణ మహర్షిని అనన్య శరణాగతి వేడుతూ “రమణా! నీవే మాకు దిక్కు. మా అవిద్యను తొలగించుటకు జ్ఞానిగా మార్చుటకు మేము ఆత్మలమే అను ఎరుక కలిగించుటకు నీవు తప్ప మాకెవరు దిక్కు. రమణ నీవే మాకు శరణాగతి.”

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము - 28

ఆణిముత్యాలు - 10 - ఆత్మ జ్ఞానము - పునర్వీక్షణము

(తరువాయి భాగం)

భగవాన్ మరికొన్ని ముఖ్యమైన విషయాలను తెలియచేసినారు. **కనిపించే ప్రపంచము మనస్సులోనే ఉదయించి మళ్ళీ మనస్సుతోనే అస్తమించునని కావున ఉదయించేది, అస్తమించునది మనస్సుమాత్రమే కాని ఆత్మ కాదని** గాఢ నిద్రలోను, మరియు మెలకువలోను ఈ రెండు దశలలో ఒకే ఆత్మ ఉన్నది.

కాని ప్రపంచమును ఎరుగుటలోను, మరియు ఎరుగక పోవుటలోను మాత్రమే ఉన్నది. భగవాన్ ఇట్లు చెప్పెను. **"నీవు ఎవరు ? అని అడిగినప్పుడు నీవు నీ చేతిని రొమ్మునకు కుడివైపు ఉంచి నేనున్నాను అని అందువు. అది ప్రతివారికి అప్రయత్నాముగానే ఆత్మను చూపుతున్నారు. ఆవిధంగా ఆత్మ తెలియబడును.** కాని జీవుడు మనస్సు, దేహము, ఆత్మ అని భ్రమించును కనుక దుఃఖములో మునుగుతున్నారు. ఈ భ్రాంతి మిధ్యా జ్ఞానము వలన కల్గునది." మనస్సు యొక్క స్వభావము పరిభ్రమించుట మనస్సు నీవు కావని ఆ మనస్సు పైకి లేచి పతనము చెందునని అది ఆశ్వాతమని నీవు శాశ్వతుడవని ఆత్మ తప్ప వేరేమీ లేదని మనస్సు ను పట్టించుకొనవద్దని ఆ మనస్సు మూలము ను వెతికినచో అది అదృశ్యమగునని భగవాన్ సూచించినారు. ఎప్పుడైతే మనస్సు అదృశ్యమగునో అప్పుడే ఆత్మ ప్రకాశించును. మనస్సు, శరీరం, ప్రపంచము ఆత్మ కంటే వేరుకావని అవి ఆత్మ నుండి ఆవిర్భవించి ఆత్మలోనే లయించునని భగవాన్ చెప్పినారు.

భగవాన్ మరియొక ముఖ్యమైన విషయాన్ని విశదీకరించినారు. **అదే మనగా ఆత్మ హృదయమని, హృదయము స్వయంప్రకాశమానము. ఆ హృదయము నుండి ఒక జ్యోతి ఆవిర్భవించి మనస్సు యొక్క స్థానమైన మెదడును చేరును మనస్సు తో అనగా ఆత్మ యొక్క ప్రతిబింబ కాంతితో ప్రపంచము చూడబడును. మనస్సు యొక్క సాయముతో ప్రపంచము కనబడును మనస్సు వెలిగినపుడు అది ప్రపంచపు ఎరుకతో ఉండును.** ఆ మనస్సే అట్లు

వెలుగనపుడు ప్రపంచపు ఎరుకతో ఉండదు. ఆమనస్సు జ్యోతి యొక్క మూలము వైపు త్రిప్పినచో విషయ జ్ఞానము నశించి ఆత్మ హృదయముగా ప్రకాశించును. మనసు దాని యొక్క ప్రతిబింబిత కాంతి వలన మాత్రమే ఉపయోగకరముగా ఉండును అది విషయములను చూచటకు ఉపయోగపడును. అది లోపలకు త్రిప్పబడినపుడు కాంతి మూలము స్వయముగా ప్రకాశించి మనస్సు అస్పష్టమై నిరూపయోగమగును. దీనిని బట్టి తెలిసినదేమనగా ఆత్మ హృదయములో ఒక కాంతి ఉద్భవించుటచే ఆ వెలుగు మెదడుకు చేరును. మెదడు మనస్సు యొక్క స్థానము. మనస్సుతోనే ప్రపంచము చూడబడును అది ఎలా అనగా హృదయములోని కాంతి మెదడుకు చేరినపుడు ఆత్మే హృదయము కాబట్టి ఆ ఆత్మ యొక్క ప్రతిబింబిత కాంతితో ప్రపంచమును చూడబడును. మనస్సు యొక్క సాయముతో ప్రపంచము కనబడును. మనస్సు వెలిగినపుడు ప్రపంచము ఎరుక వెలగనపుడు ఆ ఎరుక ఉండదు. అటువంటి మనస్సును మళ్ళీ జ్యోతి యొక్క మూలము వైపు త్రిప్పగా విషయములు నశించి ఆత్మ మాత్రమే మిగులును.

భగవాన్ తన వద్దకు వచ్చిన భక్తులు ఆత్మ అనగా ఎట్టిది అని ప్రశ్నించినపుడు భగవాన్ ఇట్లు జవాబు చేప్పేవారు. “ఆత్మ ప్రతి వ్యక్తికి తెలిసినదే కాని స్పష్టముగా తెలియదు నీవు ఎల్లప్పుడు ఉన్నావు. ఆ ఉండుట ఆత్మ. ఆత్మ తెలిసినచో భగవంతుడు కూడా తెలియును. నిజానికి దేవుడు ఆత్మ కంటే వేరు కాదని భగవాన్ సూచించినారు.” నిద్రలో లేని విషయములు ఇంద్రియముల వ్యాపారము మెలకువలో ఉన్నపుడు ఉన్నవి. కారణం అహంభావము ఆవిర్భవించి అవి ఇంద్రియముల ద్వారా క్రీడించి విషయములను చూచును. దాని వలన తానే దేహమని భ్రమించి ఆత్మయే అహంభావమని చెప్పుచున్నది. ఆత్మలో మార్పు లేదు. కాని మధ్యలో వచ్చియున్నదే అహంభావం అని కూడా భగవాన్ చెప్పారు. మనస్సు అనేది నశించినచో దుఃఖము లుండవు. మనస్సు నిద్రయందు ఉంచిన చాలదు. అది మేల్కొనిన తరువాత పూర్వము ఉండినట్లుగానే ఉండును. ప్రపంచము అహంకారము మనస్సు నందే ఉన్నవి. కావున అవి అదృశ్యమవాలి. అంటే మనస్సు నశించవలెను మనస్సును అన్వేషించినచో చివరికి అది అదృశ్యమగును. కావున నశింపచేయుట అనగా దానిని అన్వేషించవలేనని అర్థము. మనస్సు అంటేనే ఆలోచనల కలయిక ఆలోచించుట అహంకారమే. ఆ అహంకారమును అన్వేషించిన

అది అదృశ్యమగును. కావున **అహంకారమన్నా మనస్సన్నా ఒక్కటే.** మనస్సును అన్వేషించుట అనగా అంతుర్ముఖ మవుటమే. భగవాన్ ఒక ముఖ్య విషయం చెప్పినారు. "యాంత్రికమైన శ్వాస నిరోధం వ్యక్తిని గమ్యమును చేర్చదు. ఎందుకనగా అట్లు నిరోధించునపుడు మనస్సు నందు జాగరూకుడవుగా ఉండుటకు శ్రద్ధవహించి నేను అను ఆలోచన గుర్తుంచుకొని దాని మూలమును అన్వేషింపుము. అప్పుడు శ్వాసమునుగు చోట నేను అను ఆలోచన ఉదయించుచున్నదని నీకు తెలియును. అది కలసి మనుగుట, ఉదయించుట జరుగును నేను అను ఆలోచన కూడా శ్వాసతో నహా మునిగి పోవును. ప్రశాంతమైన మరియొక నేను అభివ్యక్తమగును. అది నిరంతరముగా ఉండును. దానికే ఈశ్వరుడని, ఆత్మఅని చైతన్యమని, కుండలినీ శక్తి, అని యోగమని, భక్తి అని, జ్ఞానమని వివిధ నామములు కలవు. అదే నీ గమ్యం.

భగవాన్ మనస్సు గురించి మరియు ఆత్మ గురించి మరియు కనిపించే ప్రపంచము గురించి చెప్పిన విషయాలు మరియు నీ వెవరు అని అడిగినపుడు అప్రయత్నముగా ఆత్మ ఉండే స్థానాన్ని చూపించిన రహస్యమును ఆత్మ హృదయమేనని హృదయములో ప్రకాశించే జ్యోతి దాని వివరణ గురించి మరియు అహంకారము గూర్చి మనస్సును గురించి అ మనస్సు నశింప చేసే పద్ధతి శ్వాస నిరోధ విధానము ద్వారా నేను ని నశింపచేసి అసలైన నేను కనుగొనుట మొదలగు ముఖ్యమైన రహస్యాలన్నీ అందరికి చెప్పినారు. కావున భగవాన్ చెప్పిన ఈ అణిముత్యాములను ప్రతిసాధకుడు. జాగ్రత్తగా శ్రద్ధతో నిధానముగా భగవాన్ చెప్పినది గ్రహించినచో చెప్పినవన్నీ అర్ధమయ్యే మనము కూడా జ్ఞానులుగా మారవచ్చును. ఇది సదవకాశము. ఈ అవకాశము బహిర్గతముగా భగవాన్ చెప్పిన రహస్యాలు. ఇవే కాక భగవాన్ వారు స్వయంగా అనుభవించినవి. ఏ విషయము దాచు కొనక బహిర్గతముగా అందరికి ఉపయోగపడేలా చెప్పినారు. కావున భగవాన్ రమణ మహర్షి చెప్పిన విషయాలను శ్రద్ధా భక్తితో గ్రహిద్ధాం. దానికి వారి సంపూర్ణ ఆశీస్సులు ఉంటేనే ఇటువంటి కష్టతరమైన తత్వజ్ఞానము బోధ పడుట అంత సులువు కాదు. కావున భగవాన్ నీవే మాకు శరణాగతి. అనన్య శరణాగతితో మిమ్ములను వేడుతున్నాం, మీ ఆశీస్సులు మాపై కురింపించి దేహ భ్రాంతితో ఉన్నా మమ్ములను కనువిప్పు కలిగించు. మాకు ఆత్మ జ్ఞానమును ప్రసాదించమని వేడుతున్నాం. రమణా శ్శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము - 29

ఆణిముత్యాలు - 11

(ఆత్మ జ్ఞానము - పునర్వీక్షణము తరువాయి భాగం)

భగవాన్‌ను కొందరు “నేను ఆత్మనెట్లు చేరగలను” అని ప్రశ్నించెను. దానికి భగవాన్ “ఆత్మ చేరుట అన్నదే లేదు. నీవే ఆత్మవని నీవు ఇంతకు ముందే అదిగా ఉన్నావని నీవు నీ ఆనందమయ స్థితిని తెలుసుకొనలేకపోవుటచే ఈ విధమైన ప్రశ్న నీ వేయుచున్నావు.” అని జవాబు చెప్పెను. ఆత్మను ఎట్లా చేరుట అన్న ప్రశ్నలో జాగ్రత్తగా గమనించినచో **అసలు ఆత్మ ఎక్కడో ఉంటేనేకదా అక్కడ మనము చేరుటకు ఆత్మ ఎప్పుడు ఇక్కడే ఉండునని దాని అర్థం.** అది క్రొత్తగా లభించేది కాదు. అశాశ్వతమైనది కాదు. పైగా ప్రయత్నింప తగినది కాదు. నీవే ఆత్మవని భగవాన్ చెప్పినట్లు తెలిసికొనవలెను. ఆనందమయస్థితి ఎరిగి ఉన్నవాడు ఆత్మయే. ఆ ఆనందమయస్థితి ఎరగనీకుండా అజ్ఞానము అడ్డుగా వచ్చును. దాని వలన శుద్ధానందము కప్పివేయును. కావున ఆ అజ్ఞానము తొలగించుకొనవలెను. ఆ అజ్ఞానము మిథ్యా జ్ఞానముగా ఆమిథ్యా జ్ఞానమే దేహము మనస్సు మొదలగు వానితో ఆత్మ యొక్క మిథ్యాతదాత్మ్యంలో ఇమిడి ఉంది. కాబట్టి భగవాన్ చెప్పినది ఈ మిథ్యాతదాత్మ్యం పోవలెనని అప్పుడే ఆత్మ మిగులునని చెప్పినారు.

భగవాన్ మరియొక మఖ్యమైన విషయము సాధకులకు సూచించారు. **మనస్సు కంటే వేరుగా ఉండమన్నారు. నీవు మనస్సువి కావని చెప్పినారు. ఇట్లు ఉంటే ఆత్మే మిగులును.** కావున మనము మనస్సును ఎల్లపుడు గమనిస్తూ దానిలో లగ్నము కాక దాని కంటే వేరుగా ఉండుట నేర్చుకొనవలెను. **బంధము కూడా దేహానికి సంబంధించిదని అట్లు కానిచో అసలు బంధమే లేదని** బంధించు వస్తువు కూడా లేదని కావున బంధింపబడేవాడు కూడా లేడని భగవాన్ సూచించారు. కాని ఇది జాగ్రదవస్థలో కన్పిస్తున్నాయి. అదే నిద్రవస్థలో ఉన్నాయా ? లేవు కావున ఇవి ఎవరికి కన్పించుచున్నవో ఆలోచించమనే వారు భగవాన్.

ఆత్మానుభవము ఎట్లు సాధ్యమని భగవానుని ప్రశ్నింపగా భగవాన్ రహస్యాన్ని ఈ విధముగా భోదించినారు. ఆత్మ నుండి, అగ్ని నుండి వలె అగ్ని కణం బయలుదేరును. ఆ అగ్ని కణం అహంభావము. ఆ అహంభావము పుట్టిన వెంటనే అజ్ఞాని విషయములలో తాదాత్మ్యం చెందునని అది స్వతంత్ర్యముగా ఉండదని మరియు అది వస్తువులతో సంపర్కము కలిగి యుండునిని ఈ సంపర్కమే ఆజ్ఞానమని భగవాన్ చెప్పిరి. విషయాలను నిర్మూలించినచో అది శుద్ధమగునని మూలములో లయము కూడా పొందునని భగవాన్ చెప్పారు. దేహముతో మిధ్యాతాదాత్మ్యమే దేహాత్మ బుద్ధి అని అనగా నేను దేహమని భావము. నిజానికి మనము దేహముతో కాని మనస్సుతో కాని సంబంధము లేకుండా సుషుప్తిలో ఉన్నామని మిగిలిన జాగృత్ మరియు స్వప్న అవస్థలో మనము మనోదేహములతో సంబంధము కలిగియున్నమని భగవాన్ చెప్పిరి. మనము, మనకు బాహ్యమైన దాని నుండి మనల్ని వేరు చేసుకొనగలము. కాని మనతో ఏకమైన దాని నుండి వేరుచేసికొనజాలము. కాబట్టి అహంభావము దేహముతో ఏకముకాదు. రెండు అవస్టల మధ్యగాని రెండు అలోచన మధ్యగాని శుద్దమైన ఆహంభావము అనుభవగోచరమగుచుండును. అహంకారము వేరొక ఆధారము చిక్కిన వెంటనే పూర్వపు ఆధారము వదులును కావున విషయములతో కాని, ఆలోచనలతో కాని అహంకారమునకు సంపర్కము లేనప్పుడే దాని నిజ స్వరూపము తెలియును.

భగవాన్ ధ్యానమును అభ్యసించుట గురించి రెండు ముక్కలలో ఎంతో అద్భుత సందేశముతో సూచించారు. **ధ్యానము ఆత్మ నిష్టయే అని మనస్సులో ఆలోచనలు కలిగినపుడు దానిని తొలగించుటకు చేయు ప్రయత్నము ధ్యానమని ధ్యానము ఆత్మ నిష్టయే అని కావున నీ వాస్తవ స్వభావము ఆత్మ నిష్టయే అని నీవు వున్నట్లే ఉండమని చెప్పారు.** భగవాన్ ఆత్మ ఎన్నటికి మాయమయ్యేది కాదని అది ఏకైక సత్యమని ఏది ఎన్నడూ కనిపించదని అట్లే అదృశ్యము కూడా కాదని కాని దృశ్యమనునది అదృశ్యమగును. దృశ్యము అశాశ్వతమని ఆత్మ శాశ్వతమని చెప్పినారు.

భగవాన్ భోదించిన భోదనలు ఎన్నెన్నో కలవు. వారి భోదన ఒక మహాసముద్రము కన్న లోతైనవి. వారి భోదనలు ఎన్ని చెప్పినా తనవి తీరవు. వారెన్నెన్నో ఆత్మను గురించి ఆత్మ

సాక్షాత్కారము గురించి దేహము, జగత్తు, దైవము, బంధము, ధ్యానము, మనస్సు ఇలా ఎన్నో విషయాలపై అమూల్యమైన భోదనలు తన జ్ఞానవర్షముతో కురిపించారు. భగవాన్ చెప్పినవన్నీ అర్థము చేసుకునే నంతటి జ్ఞానిని నేను (రచయిత) కాదు. కావున కొన్నింటిని మాత్రమే అణిముత్యాలుగా తీసుకొని ఆ భగవాన్ అనుగ్రహం వలన నాకు అర్థమైన రీతిలో చెప్పబడినది. వారి భోదనలు అనంతమైనవి. చదివిన కొద్దీ క్రొత్త రహస్యాలు ఆనందమయ స్థితి కలుగుతుంది. రాగి పాత్రను తోమిన కొద్దీ మెరుగు ఎలావచ్చునో అలాగే భగవాన్ చెప్పిన అమూల్యమైన మాటలను జ్ఞాపకముంచుకొని ఎల్లప్పుడు ఆ భోదనలపై మనస్సు నిలిపి వారు చెప్పిన విషయాలనే జ్ఞాపక ముంచుకుని మన సన్నిహితులతో భగవాన్ చెప్పిన మాటనలు చెప్పుకుంటూమన జ్ఞానాన్ని కూడా రాగి పాత్రవలె రోజూ తోమిన కొద్దీ మెరుగు వచ్చే విధంగా ప్రతిరోజు భగవాన్ భోదనలతో మన జ్ఞానాన్ని కూడా మెరుగు పెట్టుకుందాం. దీనికి భగవాన్ ఆశీర్వచనము ఎంతో అవసరము. రమణుని శరణు వేడుదాం.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము - 30

(శ్రీ దత్తుడు భార్గవునికి ఉపదేశించిన జ్ఞానం)

కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని ఆరాధించే భక్తుడు. అతనిని యోగ శక్తిచే మరియు దత్తుని అనుగ్రహముచే కావల్సినపుడు వేయి చేతులను పొందగలడు. ఒకసారి వేటకై వనమునకు పోయి జమదగ్ని మహర్షి ఆశ్రమములో ఆతిధ్యమును స్వీకరించి ఆఆశ్రమమున అన్నిటిని ఒసంగు కామధేనువు మహిమను ఎరింగి ఆ గోవును దూడతో సహా తన రాజ్యమునకు తీసుకుని వెడలి పోయెను. ఈ విషయము ఎరింగన పరుశురాముడు కార్తవీర్యార్జుని నగరమునకు ప్రవేశించి సైనముతో యుద్ధము చేసి చివరకు వేయి బాహువులు కలిగిన కార్యవీర్యుని శీర్షమును ఖండించెను భార్గవరాముడు. ఆ భార్గవరాముని పరాక్రమమును చూచిన కార్త్యవీర్యుని పుత్రులు పదివేల మంది భయపడి పారిపోయిరి. భార్గవరాముడు దూడతో సహా ఆ కామధేవుని తన ఆశ్రమమునకు తిరిగి వచ్చి జరిగిన దంతయు తన తండ్రికి విన్నవించగా ఆ తండ్రి అట్లు వధించుట మహా పాపమని క్షమాగుణము గొప్పదని కావున ఆ రాజును చంపినందుకు దానికి పరిహారముగా పాపము పోగొట్టుకొనుటకు మహావిష్ణువును ధ్యానించమని చెప్పగా తండ్రి ఆదేశానుసారము పరశురాముడు తీర్థయాత్రలకు వెళ్ళెను. పరుశురాముడు లేని సమయమున కార్తవీర్యుని కుమారులు పగ తీర్చుకొనుటకై ఆశ్రమమునకు వచ్చి జమదగ్ని శీర్షములు ఖండించి పారి పోయెను. భార్గవరాముని తల్లి అగు రేణుక దుఃఖమును చూచి మరియు తన తండ్రి యగు జమదగ్ని మృతదేహమును చూచి భార్గవరాముడు కార్తవీర్యుని కుమారులు తలలను ఖండించుటే కాక కనిపించిన క్షత్రియులందరిని వధిస్తూ చివరికి అదే సమయమున దశరధుని పుత్రుడైన శ్రీరామచంద్రుడు శివుని విల్లుని ఎక్కుపెట్టి జనకుని పుత్రికయగు సీతాదేవిని పరిణయమాడినాడని వార్త విని చివరకు ఆ భార్గనరాముడు శ్రీరామునితో పోటీ పడి తన వింటిని ఎక్కుపెట్టమని సభలో కోరగా శ్రీరాముడు భార్గవరాముని చేతి నుండి ధనువును శరమును తీసుకొని ఎక్కుపెట్టి బాణమును వదిలెను. శ్రీరాముడిట్లనెను. “దీని చేత నీ పాదగతిని ఖండింపు మందువా లేక తపస్సుచే నీవు ఆర్జించిన లోకములను ఛేదింప మందువా?” అని అనగా పరశురాముడు ఆ

ఎక్కుపెట్టిన వీరుడు మహావిష్ణువే అని తలంచి ఇట్లనెను. "నేను ఆర్జించిన పుణ్యలోకములు పెక్కు కలవు. కావున వానిని ఆ బాణమునకు లక్ష్యమెనరింపుము." అని కోరగా అందరూ చూచుచుండగా రాముని బాణమును పరశురాముడు ఆర్జించిన పుణ్యలోకములన్నీ భస్మము లయ్యెను. ఆ దెబ్బతో భార్గవరాముడు వేదన పొందెను. భార్గవరాముడు జీవితములో ఎప్పుడు పరాజయమెరుగని వాడుగుచే మొదటిసారిగా నిర్వేదము కలిగెను. తపస్సుచే ఆర్జించిన లోకములు తాను చూచు చుండగానే బూడిదయ్యేనని ఒకవేళ మళ్ళీ వాటిని సంపాదించినను నశింపక తప్పదని కావున కర్మచేత సంపాదింపబడులోకములన్నీ అశాశ్వతములని గ్రహించెను **దీని ద్వారా కర్మ చేత మోక్షము కలుగదని తెలిసికొనెను.** ఇట్లు చింతిం చుచూ ఉండగా భార్గవరాముడు దారిలో ఒకతనిని గాంచెను అతడు చూచుటకు పిచ్చివాని వలె మరియు మహా పురుషుని వలె కన్పించెను. అతనిని చూసి పరశురాముడు ఈ విధంగా ప్రశ్నించెను. "పురుషవరేణ్యా ఎవరు నీవు ? మహా పురుషుని వలె కనిపించు చున్నావు. నీ ఈ స్థితి ఎట్టిదో చెప్పుము." అని పలుకగా అతను ఇట్లనెను. **"ఎవరు నీవు అని ప్రశ్నించితివి కదా వినుము. నీవు అను పదము యొక్కఅర్థము నీకు తెలిసినచో నీ పశ్న వ్యర్థమని అర్థము తెలియనిచో నీ మాట అర్థము లేనిదగును. ఈ శరీరమును ఉద్దేశించి నీవు అనుపదము ప్రయోగించినందువేని ఇందులో ఉన్న చైతన్యము నీ కు తెలియలేదన్నమాట. ఈ శరీరము నీకు ప్రత్యక్షముగా కనిపించుచున్నది కదా. ప్రశ్నింపవలసిన సంశయమేమున్నది? కావున నీ ప్రశ్న పేరునకు మాత్రమే సంబంధించినది. కాని పేరు శరీరముతో పాటు సహజముగా సిద్ధించుటలేదు. అది అనేక రకములుగా కన్పింపబడుతున్నది. జనుల సముదాయములో ఒక పేరు ఒక శరీరము నందే నియమితమై ఉండదు. కావున నీవు నన్ను సరిగ్గా ప్రశ్న వేసినచో జవాబు చెప్పెదనని"** పలికెను. అతని మాటలు విని పరశురాముడు ఒక మహా పుంగవుడని తలంచి తన వృత్తాంతమునడగగా అతడు అంగీరసుడని మూడు లోకముల యుందును. సంవర్తుడని ప్రఖ్యాతుడై ఉంటిరని పరశురామునకు చెప్పెను. భార్గవరాముడు ఆ మహాత్ముని శుభమైన మార్గము చూపమని కోరగా సంవర్తుడు దత్తాత్రేయుని వద్దకు ఆ పరశరాముడిని వెళ్ళమని మరియు ఆ దత్తుని శరణువేడమని చెప్పెను.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము - 31

(శ్రీ దత్తుడు భార్గరామునికి ఉపదేశించిన జ్ఞానం)

తరువాయి భాగం

సంవర్తుని ఆదేశ ప్రకారము పరుశురాముడు శ్రీదత్తుని దర్శించుటకు బయలుదేరెను. దారిపొడుగున లోకవ్యవహారముల గురించి తన దేహమును గురించి అశాశ్వతమైన వాటి గురించి కామక్రోధాల గురించి సుఖసంపదల గురించి ఒక్కసారి తలచుకుంటూ అవి ఏమీ శాశ్వతము కావని మనశ్శాంతి ఇవ్వలేవని వైరాగ్యమును పొంది ఆలోచించుకుంటూ చివరికి శ్రీదత్తుని దర్శనమయెను. భార్గవరాముడు కొన్ని ప్రశ్నలు దత్తుని అడుగగా శ్రీదత్తుడు తత్వ భోద ఈవిధంగా చేసెను. పరశురాముడు శ్రీ దత్తుని ఒక ప్రశ్న వేసెను. "దృశ్యముగా కనిపించుచున్న ఈ జగత్తు అంతయు దృక్కు మాత్రమే ఎట్లగును? దృశ్యమును ఒదిలి దృక్కును మాత్రమే గ్రహించుట ఎవరికి అనుభవమునందు లేదు. చూచుచున్నవాడు వేరుగా వానిచే చూచు దృశ్యములైనపదార్ధములు వేరుగా కనిపించుతున్నవని" ప్రశ్నింపగా శ్రీదత్తుడు ఇట్లు భోధించెను. **"మనకు కనిపించునదంత దృూక్కు మాత్రమే అని దానికి భిన్నముగా దృశ్యమనునది లేదని" శ్రీదత్తుడు చెప్పెను. ఉదాహరణకు మనము చూసే ప్రతిపదార్ధము ఒక కారణము నుండి పుట్టి కార్యమగుచున్నదని** ఎలాగంటే మట్టి వల్ల కుండ పుట్టుట కార్యము ఇందులో మట్టి కారణమైతే దాని నుండి పుట్టిన కుండ కార్యము నిజంగా మట్టియే కుండ యొక్క ఆ కార్యములో క్రొత్తగా కనిపించుచున్నది. ఈ క్రొత్తగా కనిపించుటయే పుట్టుట. **ఈ విధముగా పదార్ధములన్నీ ప్రతి క్షణము క్రొత్తగా కనిపించుట వలన జగత్తు కనిపించుచున్నది.** మట్టి మట్టిగానే అఖండముగా ఏకరూపముగా ఎలాగైతే ఉందో అట్లే మన విజ్ఞానము నందు కూడా ఎన్ని ఆకృతులు తోచినను ఆ విజ్ఞానము ఎప్పుడు అఖండముగానే ఏకరూపముగానే ఉండును. **కారణములేకుండా కార్యము పుట్టదు** లోకములో ప్రతి కార్యము చేతనుడైన కర్త వలననే జరుగును. అట్లే జగత్తు కూడా చేతనుడైన కర్త వలననే ఏర్పడుచున్నదని గ్రహింపవచ్చును. **జగత్తు నిజానికి సామాన్యమైన**

కార్యము కాదు. అట్టి జగత్తునకు కర్తయైన ఈశ్వరుడు శక్తి కలవాడై ఉండును. ఆ ఈశ్వరుడు తన స్వరూపము నందే జగత్తు అను చిత్రమును భాసింప చేసుకొనెను. ఆ పరమేశ్వరుడు విలాసముగా తాను భాసింప చేయుచున్న జగత్తును తానుగా వ్యవహరించుచున్నాడు. కాని ఇది ఆయనకు స్వరూపము కాదు. ఎన్ని దేహములు మారుచున్నను ఆ దేహములన్నిటిని చూచుచున్న దృక్కు మాత్రమే నీ స్వరూపమైనట్లు ఈ జగత్తు కూడా ప్రళయములో నశించినపుడు దృక్కు మాత్రమే ఆ పరమేశ్వరునకు కూడా స్వరూపము. ఆ దృక్కు నందే ఆయన చేత ఈ జగత్తు ఒక చిత్రముగా భాసింపబడి ఉన్నదని అసలు సృష్టికి పూర్వము దృక్కు తప్ప రెండవది లేదని చెప్పెను. దృక్కే చైతన్యము. చైతన్యము వలనే ఉనికి ప్రకాశము కలుగును. చైతన్యము లేక జగత్తు ఉండదు.

చైతన్య రూపమైన తనయందే ఆయన గోడ మీద బోమ్మను వలె ఈ జగత్తును భాసింపచేసెను. కావున ఈ జగత్తు ఆయన యందే భాసింపచుచున్నది. చైతన్యమే ఆయన అగుటచే ఆయనకు భిన్నముగా పదియు ప్రకాశించుట లేదు. అద్దము నందు ప్రతిబింబిము వలె ఆయన యందు ఈ జగత్తు కన్పించుచున్నది. లోక మంతయు కేవలము మనోమయమే, మనస్సు నందు పుట్టినది. చైతన్యము లేని దేశము కాని కాలము కాని ఏదీ ఉండదు. పదార్ధానికి ఉనికి చైతన్యము వలనే కలుగుచున్నది. కావున చైతన్యమే చిత్, దృక్కు అను పెక్కు పేర్లతో పిలువబడుచున్నది. అది లేనిచో ఏ పదార్ధానికి ప్రకాశముండదు. ఒక చోట ఒక పదార్దము కనిపించినప్పుడు ఆ పదార్ధము ఏమిటో మనము చూసి చెప్తున్నాము.పదార్ధము ముందుగా మన జ్ఞానము నందు ప్రకాశించిన తరువాతే అది ఉన్నదిగా తెలియును **కావున పదార్ధము యొక్క అస్థిత్వము (ఉనికి) ప్రకాశము ఆ రెండు కూడా జ్ఞానము పైననే ఆదారపడియున్నాది.** కావున ప్రతిబింబము యొక్క అస్థిత్వము ప్రకాశము.పదార్ధము యొక్క అస్థిత్వము చితి యొక్క ప్రకాశం కన్న భిన్నము కాదు. కావున చితియే జగత్తు యొక్క అస్థిత్వము. చితి తనయందే జగత్తును ప్రకాశము చేయుచున్నాది. జగత్తు తానుగా భాసింపక చితి వలన అది భాసించుచున్నది. దీని వలన అద్దములో ప్రతిబింబము వలె చితిలో జగత్తు ప్రతిబింబముగా ప్రకాశించుచున్నది. అద్దములో ఎన్ని ప్రతిబింబములు

కనిపించినను అవి వివిధ రంగులతో ఉన్నను ఆద్దానికి అంటుకొనని విధముగానే జగత్తులోని విశేషములు చితికి అంటుకొనవు. ప్రతిబింబము అద్దము కన్న భిన్నముగ ఎట్లుండునో జగత్తు కూడా చితి కన్నా అన్యముగా లేదు. చితి యొక్క స్వాతంత్యము వలన ప్రతిబింబము ఏర్పడుచున్నది. సంకల్పముల వలన మనస్సు నందు ఎన్నో భావాలు ప్రతిబింబించుచున్నది. వెలుపలి పదార్ధముతో దేనితోను సంబంధమ లేకుండా చిదాత్మ యందు జగత్తు ప్రతిబింబించుచున్నది. శ్రీదత్తుడు పరశురామునికి ఇ విధముగా జగత్తు గురించి తత్వభోద చేసినారు. పరశురామునితో ఇట్లనినారు. “నీ యొక్క స్వాతంత్ర్యమే సంకల్పరూపమై నీ మనస్సు నందు ఎన్నో భావాలు ఎలా ప్రతిబింబింప చేయుచుండునో అలా చిదాత్మ యొక్క సాతంత్ర్వమే సంకల్ప రూపమై జగత్తును భాసింప చేయుచున్నది.

కొన్ని ముఖ్యమైన రహస్యములు : -

1. దృక్ అంటే కంటితో చూచేది. (కంటి చూపు)

2. కంటి చూపుతో గ్రహించునది దృక్ అయితే అ కంటి చూపుతో ఏది గ్రహింపబడుచున్నదో అది దృశ్యం.

3. దృక్ అంటే ఒక్క మనము చూసేదే కాదని గ్రహించేది కూడా ఔతుంది ఉదాహరణకు ఒక దృశ్యమును కంటితో చూడగలము గాని ఒక పాటను కంటితో చూడలేము కదా ? కాని వినగలుగుతాము. ఆ వినుట లేక గ్రహించుట కూడా దృక్కే ఆవుతుంది. ఇలా **ఇంద్రియాలన్ని దృక్కలే ఔతాయి.** వాటి ద్వారా తెలుసుకోబడుచున్న విషయాలన్ని కూడా దృశ్యమే ఔతుంది.

4. మనస్సు కూడా తీసుకొనవచ్చును. ఎలాగంటే ఒకప్పుడు ఆరోగ్యముగా ఉన్నానని చెప్పేవాడు. కొన్ని రోజూల పిదప ఇప్పుడు సరిగ్గా ఉండటం లేదని చెబుతారు. కావున **మనస్సు చక్షుర్మేంద్రియముల విశేషములను** గ్రహించుచున్నది. కావున **మనస్సు కూడా దృక్కే దానిచే గ్రహింపబడుచున్న ఇంద్రియాములు దృశ్యమగును.**

5. మనస్సు యొక్క, బుద్ధి యొక్క విశేషములని, మనము గ్రహించుచున్నాము. ఆ రెండింటిని మనము గ్రహిస్తున్నాము. కాబట్టి **మనస్సు, బుద్ధి దృశ్యములై ఆ రెండిటిని గ్రహించుచున్న**

మన యందున్న చైతన్యము దృక్ అగును.

6. నేను అని మన యందు స్ఫురించుచున్న చైతన్యము కావున దేని చేతను గ్రహింపబడుట లేదు.

7. **దేహము, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి ఎన్ని రకాలుగా మార్పు పొందినను చైతన్యం మాత్రము ఎటువంటి మార్పులేక వాటి మార్పులను (దేహము, ఇంద్రియాములు, మనస్సు, బుద్ధి) అన్నింటిని చూస్తూ అన్ని దశలలో ఒకే రూపముగా ఉంటూ దృక్ గాని, దృశ్యముగా కాక మిగిలినవి అన్నియు దృశ్యములే ఔతాయి.**

8. దృక్కు లేకుండా దృశ్యము ఉండదు. కాని దృశ్యము లేకుండా దృక్కు ఉండగలదు.

9. చైతన్యము మనోరూపముగా ఉండుటచే ఏ దృశ్యము గ్రహింపక దృక్కు మాత్రముగా ఉండి సుఖముగా ఉండును.

10. దృశ్యమును వదిలి మన స్వరూపమైన దృక్కునే ఎల్లప్పుడు భజించవలెను. నీకు దృశ్యమైన ఈ జగత్తు దృక్కుగా ఉన్న నీయందే ఉన్నది.

11. నేను వేరు... కనబడే జగత్తు వేరు అనేది అజ్ఞానం తప్ప మరియొకటి కాదు. ఆ అజ్ఞానము కూడా ఎన్నో జన్మల నుండి ఉండుటచే కలిగిన భావం.

12. సుఖమనేది ప్రతి వారిలోను వారియందే ఉన్నది. కాని విషయములయందు లేదు.

13. విషయములనందు ఉన్నచో అవి ఎల్లప్పుడు సుఖమునే కలిగించవలెను. కాని అప్పుడప్పుడు మరి మనకు దుఃఖమెందుకు కలుగుచున్నది ?

14. నిద్రలో ఎంతో సుఖము కలుగుచున్నది కదా దానికి కారణం మనకున్న ఇంద్రియములన్నియు పనిచేయవు కాబట్టి.

15. దీనిని బట్టి ఇంద్రియలోలుడైతే లోనున్న ఆత్మను తెలుసుకొనలేము అని నిర్ధారణమైనది.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 32

(శ్రీ దత్తుడు భార్గవ రామునికి ఉపదేశించిన జ్ఞానం తరువాయి భాగం)

శ్రీ దత్తుడు కనిపించే జగత్తు సత్యము కాదని అదియొక భ్రాంతి అని దానికి గల కారణం అజ్ఞానమే అని ఆ అవిద్య వలన చిదాత్మను చూడలేక జగత్తును మాత్రమే ఉన్నట్లుగా భావించి లేని జగత్తును ఉన్నదని అనుకొంటున్నామని ఈ మాయకు గల కారణం మానవుడు వారి శరీరములే ఆత్మ అని వారి భావన యొక్క దృఢ సంకల్పముచేతనే వారికి శరీరమే ఆత్మగా కనిపించుచున్నది అని మరియు వారి యొక్క అవిద్యా భావనముచే లేని జగత్తు సత్యమని అనిపిస్తుందని అటువంటివారు ఆత్మయే సత్యమని అగుపించే జగత్తు అసత్యమని దృఢముగా భావించవలెనని ఎవరు ఎట్లు జగత్తును గురించి భావించుచున్నారో అతనికి ఆ జగత్తుకూడా అట్లే కనిపించుచున్నదని పరశురామునికి సూచించినారు. ఆత్మ చైతన్యమునకు వెలుపలగా జగత్తునది ఏదియు లేదు. అది అంతయు అద్దములో ప్రతిబింబమున్నట్లు ఆత్మ చైతన్యమునందే యున్నది. కావున ఆత్మ ఒక్కటియే సర్వ ప్రపంచము తనయందే ప్రతిబింబింపచేయుచు ప్రకాశింప చేయుచున్నది. ఆత్మకు చైతన్యమే స్వరూపము ఆత్మయందు భిన్నముగా జగత్తనేది ఉండదు. ఎన్ని విధములైన ప్రతిబింబాలు అద్దములో కనిపించినను అద్దము పరిశుద్ధముగనే ఏ వికారం పొందక ఎలాగైతే ఉండునో అలాగే ఈ జగత్ ప్రతిబింబాలు ఎన్ని వచ్చిపోయినను ఆత్మ చైతన్యం కూడా అద్దమువలె పరిశుద్ధముగా ఏ వికారము లేకుండా ఉండును. ఆత్మ అలాగని అద్దముగా అనుకోకూడదు. అద్దానికి ఎదుట వస్తువున్నప్పుడే ఆ అద్దములో ఆ వస్తువు యొక్క ప్రతిబింబము కనిపించునుగానీ ఆత్మయందు ప్రతిబింబం కనిపించుటకు ఆ ఆత్మకెదురుగా ఏ వస్తువు కూడా ఉండనవసరం లేదు. కాని తన స్వతంత్రంచే ఏ వస్తువు లేకుండానే దాని మహిమచే జగత్తును భాసింపచేయును. సంకల్పముచే మనస్సునందు ప్రపంచము భాసించును. ప్రపంచమంతా మనస్సే తప్ప వేరొకటి కాదని శ్రీ దత్తుడు చెప్పెను. **ఆత్మయందు బాహ్య పదార్థమున్నట్లు తోచుటయే సృష్టి,** అదే అవిద్య కూడా నేను శరీరము అను భావనే అవిద్యకు కారణం.

శ్రీ దత్తుడు తత్వజ్ఞానాన్ని పరశురామునికి బోధించెను. ఇక్కడ ఈ సంఘటనను చెప్పుటకు గల కారణం సాక్షాత్తు త్రిమూర్తి అవతారమగు ఆ దత్త భగవానుడే 'నేను'ను గురించి, శరీరము గురించి, జగత్తు గురించి, ఆత్మ గురించి కొన్ని రహస్యాలు పరశురామునికి ఉపదేశించుట వలన భగవాన్ రమణ మహర్షిగారు చెప్పిన నేను గురించి, శరీరం గురించి, జగత్తు గురించి, ఆత్మను గురించి రహస్యాలతో పోల్చి చూసిన కనిపించే జగత్తు మిథ్యే అని శరీరము ఆత్మ అని భావించుట అసత్యమని నేను అనే అహంభావన వలన మానవులు తన అహంభావన చేతనే ఇంద్రియలోలుడై విషయ వాంఛితుడైలోనున్న అసలైన నేనును అనగా ఆత్మను మరచి తానే నేనుగా భావించి తన దృష్టిని బాహ్య విషయాలపై మరల్చుటచే అవిద్యారూపుడై సుఖములను బైట వెతుకుతున్నాడేకాని శాశ్వత సుఖములను లోనున్న దానిని తెలిసికొనలేక బాహ్యముగా కనిపించే అశాశ్వత సుఖాలకు లోనవుట వలన దుఃఖాన్ని కూడా పొందుచు జన్మ జన్మలు ఈ విధముగనే పుడుతూ మరణిస్తూ తత్వజ్ఞానమును తెలుసుకొన లేకపోవుచున్నాడు. **భగవాన్ రమణ మహర్షిగారు ఏ రహస్యాన్ని దాచుకోకుండా ఉన్నది ఉన్నట్లుగా సులువైన పద్ధతి ద్వారా ఆత్మజ్ఞానాన్ని గూర్చి విశదీకరించినారు.** కావున భగవంతుడు మనకు మానవ జన్మ ఇచ్చినందుకు మన జన్మను సార్ధకము చేసుకోవలెను. అన్ని జన్మలలో ఉత్తమమైనది. **మానవ జన్మయే మానవ జన్మకు ప్రాముఖ్యత ఏమిటంటే జ్ఞానాన్ని ప్రసాదించినాడు ఆ భగవంతుడు.** కావున మనకిచ్చిన ఆ జ్ఞానముతోనే మనకిచ్చిన అమూల్యమైన ఈ మానవ జన్మయందే ఆత్మజ్ఞానాన్ని తెలుసుకుందాం. కనీసం ఆ ఆత్మజ్ఞానాన్ని గురించి తెలుసుకొనుటకు ప్రయత్నించినను ఒకవేళ ఈ జన్మలో అది సాధ్యము కాకపోయినను మరో జన్మలోనైనా పూర్వజన్మ సంస్కారానుగుణముగా పొందే అవకాశము కలుగవచ్చును. కావున భగవాన్ రమణ మహర్షిగారిని మనకు ఈ జన్మయందే ఆత్మ జ్ఞానము కలుగువలెనని మన కాలాన్ని వృధా చేయకుండా ఆత్మ సాక్షాత్కారమునకై యత్నించే మన ప్రయత్నము సఫలీకృతము కావాలని భగవంతుడిచ్చిన ఈ మానవ జన్మ సార్ధకము చేసుకోవాలని అనన్య శరణాగతితో భగవాన్ రమణ మహర్షిని వేడుకుందాం. ఓ రమణా నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 33

సద్గుణ రూపుడు భగవాన్

భగవాన్ శ్రీ రమణ మహర్షిగారు ఎల్లప్పుడు మౌనముగా ఎంతో శాంతముగా కూర్చుని ఉండేవారు. వారి దగ్గర వచ్చిన భక్తులు ఎన్నో రకాలుగా ప్రశ్నలను కురిపించినప్పటికి వారు సాధ్యమైనంత వరకు మాట్లాడకుండా మౌనమునే పాటించేవారు. పది ప్రశ్నలు వేస్తే భగవాన్ ఒకే ఒక్క మాటతో జవాబు చెప్పేవారు. ఆ మాట ఎంతో అంతరార్ధము కలిగి భక్తులకు కావలసిన జవాబు దొరికిపోయేది. **భగవాన్ ఎల్లప్పుడు భక్తులకు చెప్పేది కూడా మౌనముగానే ఉండమని సత్యాన్ని తెలుసుకోమని దృష్టిని అంతర్ ముఖము కావించమని లోనున్న ఆత్మనే ధ్యానించమని భగవాన్ చెప్తూ ఉండేవారు.** ఇకపోతే భగవాన్ ఎంతో శాంతమూర్తి. ఎటువంటి సంఘటనలు ఎదురైనను వారి శాంతానికి అటంకము లేకుండానే నిశ్చల స్థితిలోనే ఉండెడివారు. దీనికి ఉదాహరణగా ఒకసారి ఆశ్రమములో దొంగతనము జరిగినది. ఆ దొంగలు మహర్షికి దగ్గరలోనున్న కిటికీని బ్రద్దలుకొట్టి లోపల చొరబడ్డారు. అది గమనించిన భగవాన్ మౌనముగానే కూర్చున్నారు కాని అరవటము కాని వారిపై తిరగబడటముకాని చేయక నిశ్చలముగా ఎంతో శాంతముగా ఆ స్వామి కూర్చుని యున్నారు. బైట ఉన్న ఇద్దరు ముగ్గురు భక్తులు గమనించగా భగవాన్ ఇట్లనినారు, **"వాళ్ళని వాళ్ళ ధర్మము చేసుకొనీ మనము మన ధర్మానికి కట్టుబడిఉందాం. వాళ్ళ ఇష్టాన్ని కాదనక మనం భరించాలి. ఓపిక పట్టాలి. వాళ్ళకి ఏమీ అంతరాయం కలిగించవద్దు"** అని ఆ మహానుభావులు ఎంతో శాంతముగా ఉండినను చుట్టు ఉన్న భక్తులపై ఆ దొంగలు వారివద్దనున్న కర్రలతో కొట్టగా ఒక దెబ్బ భగవాన్ ఎడమ తొడపై కూడా తగిలింది. ఐనా మహర్షి తన సహనాన్ని, శాంతాన్ని, మౌనాన్ని వదలక **"నీకు ఇది చాలకపోతే రెండవ కాలిమీద కూడా కొట్టండి"** అని అన్నారట. ఆ దొంగల **బెదిరింపుకు భయపడక భగవాన్ పైగా "మేము హాలంతా మీ ఆధీనములో ఉంచి బైటకు వెళతాము. మీక్కావలసింది తీసుకుని మీ ఇష్టము వచ్చినట్లుగా చేసుకోమని చెప్పారు.** ఆ దొంగలు బీరువా పగులగొట్టి కొన్ని వస్తువులను, డబ్బును

తీసుకుని పారిపోయినారు. దొంగలు వెళ్ళిపోయిన తరువాత భగవాన్ నవ్వుతూ తనకి, **“చాలినంత పూజ జరిగింది” అని అన్నారు. పైగా మనం సాధువులము. మన ధర్మాన్ని విడనాడరాదని భగవాన్ బోధించినారు.** పోలీసులు ఈ సంఘటన జరిగిన పిదప వచ్చి మహర్షిని వాఙ్మాలము (వాంగ్మూలము) అడుగగా భగవాన్ ఇట్లనిరి, “కొందరు ఆశ్రమములో చొరబడుట నిజమే కాని ఏమీ దొరక్కపోవుటచే వెళ్ళిపోయినారని” తనకి తగిలిన దెబ్బలు కూడా చూపకుండా మహర్షి వచ్చిన పోలీసులను తిరిగి పంపించినారు. భగవాన్‌కు జరిగిన ఈ సంఘటన చూస్తే వారు ఎంత కరుణామయులో, శాంతమూర్తులో మరియు వారి మౌనము ఎంత గొప్పదో తెలుస్తుంది.

భగవాన్ ఎంత శాంతమూర్తియో అంత నిరాడంబరుడు కూడ. ఒక భక్తుడు భగవాన్‌కి వెండి పాత్రలు ఇచ్చి వాడుకోమని అనగా భగవాన్ వాటిని తమ బీరువాలో ఉంచుకొనక ఆఫీసుకు పంపించి పైగా ఆ భక్తుని ముందు **“రేపటి నుండి సొంత కప్పు వాడుకుందాం, తీసివ్వు” అని అనగా చివరికి ఆ సొంత కప్పులేమిటంటే టెంకాయ చిప్పలు అని చూపించారు.** “మనకెందుకు ఆడంబరములు ఖరీదైనవి ఆశ్రమములో ఉంటే వాటిని కాపలా కాయాలని కొందరు స్వామి కదా అని వాటిని అడిగినా అడిగెదరు. దానికి కాదనేందుకు వీలులేదు అని భగవాన్ చెప్పినారు.

మరియొక భక్తుడు పాదుకలను చేయించి వాటిపై బంగారు పుష్పములు పెట్టి భగవాన్‌కి సమర్పించి ఆ పాదుకలు వేసుకొని కొండ మీదికి వెళ్ళమని కోరగా భగవాన్ ఇట్లనినారు. **“నాకు పాదుకలున్నవే” అంటూ తమ పాదాలను చూపిస్తూ “ఇవిగోనండి నా పాదుకలు. ఇవి భగవంతుడిచ్చిన పాదుకలు. మీ పాదుకలు ఏమి చేసుకోను”** అని అన్నారు.

భగవాన్ చివరికి వంటిపై కూడా ఎటువంటి వస్త్రములు ధరించక కేవలము ఒక కౌపీనముతో కాలము గడిపేవారు. ఆ కౌపీనానికి కూడా బెజ్జాలు పడితే భగవాన్ సూది మరియు దారం కొనేందుకు కూడా డబ్బును యాచించక ఒక ముల్లుతో ఆ కౌపీనములోని దారాన్నే తీసి కుట్టుకొన్నారు. పైగా వారి కౌపీనము గురించి ప్రశ్నిస్తే భగవాన్ ఇట్లనినారు, **“దేవేంద్రునికి వేయి కళ్ళున్నట్లు నా కౌపీనానికి వేయి కళ్ళున్నాయి.”** భగవాన్ పాత కాగితాలన్ని ఏరి అది ఒక

పుస్తకముగా కుట్టుకుని వాటిలో వ్రాసుకునేవారు. భగవాన్ ఒక తుండుగుడ్డ కౌపీనము తప్ప మరేదీ ముట్టలేదు. వచ్చిన భక్తులు ఖరీదైన వస్తువులు, దుస్తులు, శాలువలు తెచ్చినప్పటికి భగవాన్ ముట్టేవారు కారు. చివరికి ఒక భక్తుడు ఒక టేబుల్ ఫ్యాన్ భగవాన్‌కివ్వగా **భగవాన్ తన విసనకర్ర చూపుతూ నాకు చేతులున్నవి కదా కావలసినచో విసురుకొనెదనని అన్నారు.** భగవాన్ తమ పాదములకెప్పుడు చెప్పులు తొడిగేవారు కాదు. చివరికి వారు ఎంత కరుణామూర్తి అంటే చెట్టుకి బాధ కలిగినను వారు ఓర్చుకొనలేక పోయేవారు. ఒకసారి ఒక భక్తురాలు లక్ష తులసిపత్రి వ్రతం చేసెనని భగవాన్‌కి చెప్పగా భగవాన్ ఇట్లనినారు, **"ఆ చెట్టుని అన్నిసార్లు గిల్లటంకన్నా లక్షసార్లు నిన్ను నువ్వు గిల్లుకో పోయవా?"**

ఒక భక్తుడు తన భార్యపోయినదని తన పిల్లలు తల్లిలేనివారయ్యారని ఏడ్చుచూ భగవాన్‌కు చెప్పగా స్వామి మౌనవ్రతుడై కొంతదూరం ఆ భక్తునితో ముందుకువెళ్ళి రెండు మేక పిల్లలను చూపించి ఆ భక్తుడితో ఇట్లనినారు. **"వీళ్ళు కూడా తల్లిలేని పిల్లలే"** అని సంబోధించినారు.

భగవాన్ అందరిని సమాన దృష్టితో చూచేవారు. ఈ పక్షపాతము వారికడ ఉండదు. ఆశ్రమములో భోజన సమయము భక్తులకు ఒక రకమైన వండిన పదార్థములు భగవాన్‌కి ప్రత్యేక పదార్థములు ఆశ్రమమువారు చేసిపెట్టినచో దానిని అంగీకరించక భక్తులు ఏ పదార్థాన్ని అయితే తింటున్నారో దానినే భగవాన్ కూడా స్వీకరించేవారు. ఉదాహరణకు భగవాన్‌కి చిక్కటి మజ్జిగ పోసినచో భక్తులకు కూడా ఆ చిక్కటి మజ్జిగనే పోయమనేవారు.

భగవానునిలో ఉన్న మౌనము, శాంతి స్వరూపము, కరుణ, నిరాడంబరము మరియు సమత్వము అగు సద్గుణములు ఇవన్ని కూడా మనకి కూడా కలగాలని ఆ రమణ మహర్షిని శరణు వేడుతూ కోరుదాం.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 34

భగవాన్ ఉవాచ

ఇక్కడి నుండి భగవాన్ కొన్ని ముఖ్యమైన విషయాలు తమ బోధనల ద్వారా తెలియపరిచారు. ఈ భగవాన్ చెప్పిన అమూల్యమైన ఉపదేశాన్ని గ్రహించినచో గ్రహింప బడినవారు తప్పక జ్ఞానిగా మారుతారు. కావున భగవాన్ చెప్పిన బోధలు ఏమిటో చూద్దాం.

ఒక భక్తుడు భగవానుని ఎప్పుడు "దేనినో చూస్తున్నట్లు కనిపిస్తూ ఉంటారు కదా. మీరు ఎవరిని చూస్తూ ఉంటారు" అని ప్రశ్నింపగా, **భగవాన్, "నన్ను నేనే చూసుకుంటున్నాను. నాకంటే అన్యము లేదు చూడటానికి"** అని జవాబు చెప్పారు. భగవాన్ చెప్పిన దానిని బట్టి వారు దేనిని బాహ్యముగా చూచుటలేదని ఒక జ్యోతినో లేదా సాక్షాత్ ఆ అరుణాచలేశ్వరునో కూడా కాదని తనను తానే చూస్తున్నారని తనకంటే అన్యము ఏదీ లేదని కావున తానే భగవానుడని ప్రతి వారికి సూచన నిచ్చారు. ఇది నిరూపించుటకు మరియొకసారి ఒక భక్తుడు దేవుడున్నాడా అని ప్రశ్నించగా ఒకవేళ ఉంటే ఆ దేవుని చూచారా అని అనగా, **భగవాన్ దేవుడు ఉన్నాడని ఒక విధముగా నిలబడి, "నేనెవరునకున్నావ్"** అని అన్నారు. ఇంకొకసారి భగవాన్‌కి భక్తులు ఎన్నో కానుకలు, ప్రసాదాలు అర్పించుట చూసిన ఒక భక్తుడు "మీరు ఎందుకు వాటిని స్వీకరిస్తున్నారు అసలు మీ గొప్పేమిటి ?" అని ప్రశ్నించగా భగవాన్, **"బెల్లం వినాయకుని నుండి చిన్న ముక్కను తుంచి నైవేద్యం పెట్టినట్లుగా వీరు నాకు ఇస్తున్నారు. అంతా నేనేకదా మరియు అంతా నాదేకదా"** అన్నారు భగవాన్. అలాగే మరియొక భక్తురాలు తాను విదేశాలకు వెళ్తున్నట్లు భగవాన్‌కి చెప్పి "మీరక్కడికి వస్తారా" అని అనగా **భగవాన్ "నేను కాలాన్ని, దేశాన్ని అధిగమించి ఉన్నాను. కావున నేను అక్కడున్నాను" అన్నారు.**

భగవాన్‌కి ఒక భక్తుడు పళ్ళు తెచ్చి ఇవ్వగా, భగవాన్, **"ఈ ఆశ్రమములో ఎంతోమంది ఫలహారం చేసేవారు ఉన్నారు. ఇన్ని ముఖాలతో తినగా, ఈ ముఖంతోనే తింటేనే తిన్నట్లా" అని అన్నారు. అందరి ఆకలి తీరితే తన ఆకలి తీరునని భగవాన్ ఉద్దేశం.** ఒక భక్తుడు

పాండురంగని పూజించే వాడగుటచే పండరీయాత్ర చేసి ఆశ్రమానికొచ్చి భగవానుని ఆనందముతో కౌగిలించుకోగా భగవానుని శరీరమంతా కమిలిపోయింది. భగవాన్ అతనితో ఇట్లనెను, **"పండరీపురములోని దేవుడిని కౌగిలించుకొన్నట్లుగా నన్ను కౌగిలించుకున్నావు. అక్కడి దేవుడు రాయి. కాని ఇది సజీవం, ఇలా అవుట దీని ధర్మం"** అని అన్నారు. హిమాలయంలో శ్రీ రామకృష్ణ పరమహంస పరమభక్తుడైన శ్రీ శంకరానంద ఆ పరమహంసను నిరంతరము ధ్యానిస్తూ అలాంటి పరమహంస దర్శనము కావాలని ప్రార్థించగా హఠాత్తుగా వారి కుటీరములో భగవాన్ వచ్చారు. వారితో చాలాసేపు చర్చించి రమణులు వెళ్ళిపోయారు. శ్రీ శంకరానంద తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఆశ్రమానికి ఒక లేఖ ద్వారా పంపినపుడు ఆ సంఘటన జరిగిన రోజున భగవాన్ ఆశ్రమములోనే ఉన్నట్లు ఋజువైనది.

కొందరు భక్తులు రమణాశ్రమములో కొన్ని పుస్తకాలను కొని వాటిని భగవాన్ చేతిలో ఉంచి ఆశీర్వదిస్తూ పేరు రాయమని కోరగా **భగవాన్ "ఏం పేరు రాసేది నాకు పేరా ఊరా ఏదైనా ఉంటేకదా!" అని అన్నారు.** భగవాన్ ఎట్టి పరిస్థితిలోను తాను ఒక శరీరమని తనకొక పేరు మరియు ఊరు ఉన్నదని ఎన్నడూ భావించలేదు. ఏ రోజైతే వారికి ఆత్మ సాక్షాత్కారము కలిగినదో అప్పటినుంచి వారు తమ పేరును చెప్పలేదు. భగవాన్ తల్లి అలగమ్మ ఒకరోజున శ్రీ రమణ మహర్షి గారి దేహము మాయమై ఆ స్థానమున శివలింగాన్ని స్వయముగా చూచినదని ఆ తల్లి చెప్పినారు. ఒకసారి ఒక భక్తురాలు పుట్టు కురుపుతో చివరి స్థితిలో భగవానుని చూసి తన బాధను భరించక దుఃఖముతో తన తలను గోడకు కొట్టుకొనగా భగవాన్ ఇట్లనినారు, **"ఈ దేహమే రమణుడు అనుకుంటున్నారు. ఈ దేహ వికారాలన్ని నాకు అంటగడుతున్నారు. ఎంత చెప్పినా వినరు. నేను ఎక్కడికి వెళతాను. అసలు వెళ్ళటానికి చోటేది"** అని అన్నారు. ఇంకొక భక్తునికి భగవాన్ తమ దేహత్యాగము చేసిన పిదప వారికి రక్షకుడెవరని తలంపగా భగవాన్ ఇట్లనినారు, **"మీరు ఈ శరీరమే నేను అని తలుస్తున్నారు. నేను ధరించి తిరుగుతున్న ఈ శవమే మీకు కనబడుతోంది. ఇది మీ తప్పు. నేను సర్వత్రా నిండి వున్న ఆత్మను. ఎక్కడికి వెళతాను, చోటేది ? ఇక్కడే ఉంటాను"** అని సెలవిచ్చారు. సద్గురువు శ్రీ సాయినాధుడు తమ

దేహమును వదిలేముందు కూడా వారివద్ద వచ్చిన భక్తులు తమ తదనంతరము రక్షకులు మాకెవరని ప్రశ్నింపగా శ్రీ దత్త అవతారమగు శ్రీ సాయినాధుడు నేను సర్వత్రా నిండియున్నాను నన్ను శరణుజొచ్చిన వారికి నా సమాధియే మాట్లాడునని వచ్చిన భక్తులకు సమాధాన మిచ్చునని చెప్పినారు. ఒకసారి భగవాన్‌కి ఫోటో తీసినప్పుడు ఆ ఫోటో వెనుక ఏదో రాసి ఉండగా ఆ రాసినది ఏమిటని ఒక భక్తురాలు భగవాన్‌తో ప్రశ్నించగా భగవాన్ ఇట్లనినారు, **"శరీరాన్నెరుగని పెద్ద ఆత్మ, ఆత్మనెరుగని పెద్ద శరీరము ఒకే స్థలములో ఉన్నవి"** అని అన్నారు. అలాగే ఒక భక్తుడు తన ఊరికి వెళ్ళబోవుముందు స్వామి ఆశీర్వచనమునకు రాగా ఆ సమయమున భగవాన్ తమ శరీరాన్నంతా దుప్పటితో ముసుగు కప్పుకుని ఉన్నారు. వచ్చిన భక్తుడు భగవాన్ నిద్రపోతున్నారేమో అని భావించి మెల్లగా ముసుగు తీయగా భగవాన్ ఆ భక్తుని చూసి ఇట్లనినారు. **"ఆత్మ కంటిలో మాత్రమే ఉన్నదనా ? కళ్ళు మూసుకుంటే చూడలేనా ? వస్త్రము ఆత్మను కప్పుతుందా ?" అని చెప్పారు.** భగవాన్ ఏ క్షణమునైనా తానొక శరీరమని భావింపక తానొక ఆత్మ అని ప్రతి నిమిషము గుర్తుచేస్తూ తానేకాక ప్రతివారు కూడా ఆత్మేనని బోధిస్తు తాను శరీరము కాదు ఆత్మ అనే ఎరుక ఎల్లప్పుడు ఉండవలెనని సూచిస్తూ ఉండేవారు. భగవాన్ చెప్పిన విషయాలు జ్ఞప్తికి చేసుకుంటూ మనము కూడా వారి అడుగుజాడలు మ్రొక్కుతూ వారి దారిలో నడిచేందుకు శరణు వేడుదాం.

రమణ శరణాగతి

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 35

భగవాన్ ఉవాచ తరువాయి భాగం

భగవాన్ పలికిన అమూల్యమైన మాటలు కోట్లు కలవు. కాని అన్ని చెప్పుటకు అసాధ్యం. కావుననే కొన్నింటిని మాత్రం సేకరించి చెప్పడమైనది. ఒకసారి ఒక భక్తుడు భగవానుని సాధన గురించి ప్రశ్నింపగా భగవాన్ ఇట్లనినారు. **"సాధన ? దేనికి సాధన ? ఏముంది సాధన చేయటానికి ? ఇలా కూర్చోవటమే సాధన. ఎల్లప్పుడు ఇలాగే కూర్చొని ఉండేవాణ్ణి. అప్పటికీ ఇప్పటికీ తేడా ఒక్కటే. అప్పుడు కళ్ళు మూసుకొనే వాడిని. కాకపోతే ఇప్పుడు కళ్ళు తెరుస్తున్నాను. నేను తప్ప వేరొకటి ఉంటే కదా సాధన. తనను తాను చూడక అశాశ్వతమైన శరీరాన్ని చూసి భ్రమించేవాడికి అటువంటి భ్రమను వీడుటకు సాధన అవసరమని"** భగవాన్ చెప్పారు. జ్ఞానియైన పిదప అనగా ఆత్మజ్ఞానము పొందినవారు ఆత్మగానే ఉండేవారికి ఏ సాధనతో పనిలేదని గ్రహించవలెను. ఊరికే ఉన్నచోటున కూర్చుని ఆత్మను ఎరుకతో ఉంటే చాలు. సాధన శరీర వ్యామోహము కలిగిన వారికి ఆ అవిద్యను తొలగించుటకు ఉపయోగపడేది. భగవాన్ ఒక్క నేను తప్ప మరియొకటి లేదు అనే దృఢ నమ్మకముతో ఉన్నారు. కాబట్టే వారు నేను తప్ప వేరొకటి ఉంటేకదా సాధన అని అన్నారు. మరియొక సందర్భములో భగవాన్ వారికి గురువు లేరని చెప్పారు. కాని సాధన చేసేవారికి గురువెంతో అవసరమని శరీరమే తానని అనుకున్న వారికి మనోవ్యాపారాల భ్రాంతిలో ఉన్న వారికి ఆ భ్రమని తొలగించటానికి గురువు అవసరమని భగవాన్ చెప్పారు.

భగవాన్ శ్రీ రమణ మహర్షులు సాక్షాత్తు కుమార స్వామి అవతారమని ముందుగానే చెప్పుకున్నాము. దీనికి నిదర్శనముగా ఒక భక్తుడు ఎన్నో ఏళ్ళ నుండి సుబ్రహ్మణ్య స్వామి మంత్రాన్ని జపిస్తున్నప్పటికి ఆ స్వామి సాక్షాత్కరించలేదని నిరుత్సాహముతో భగవాన్‌కి చెప్పగా భగవాన్ ప్రక్కనున్న మరియొక భక్తుడు ఇట్లనిరి, **"మీ ఎదుట ఉన్నవారు ఎవరనుకుంటున్నారు?"** అని అనగా ఆ భక్తుడు తదేకముగా స్వామిని చూసి ఆనందముతో పొంగిపోయినారు. త్రివేణిగిరి

స్వామి అనే మరియొక సుబ్రహ్మణ్యస్వామి భక్తుడు తిరుచందూరు సుబ్రహ్మణ్యేశ్వరాలయములో ఉంటూ కాలం గడిపే రోజులలో వారు ధ్యానములో ఉండగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఇట్లనినారు, **"నేను ఇక్కడ మాట్లాడని దేవుడిగా ఉన్నాను. తిరువణ్ణామలైలో మాట్లాడే మరియు నడిచే దేవుడిగా ఉన్నాను, అక్కడి వెళ్ళు"** అని అన్నారు.

భగవాన్ ధ్యానము గురించి చెప్తూ **తలంపులను ఎప్పుడైతే తీసివేస్తామో అదే ధ్యానమని ఆ తలంపులు ఎప్పుడూ ఉంటాయని వాటిని తొలగించటానికి ఒక సంకల్పముపైన దృష్టిని ఉంచటమే ధ్యానమని అటువంటి అభ్యాసము చేయగా చేయగా మనస్సుకు శక్తి కలుగుతుంది** అని చెప్తూ భగవాన్ తన ధ్యానమార్గము దీనికి భిన్నమైనదని ధ్యానించే వాడినే ధ్యానించాలని అనగా ఆ నేనును పట్టుకుని దాని మూలాన్ని కనుక్కోవాలని ఇలా చేయగా నిజమైన నేను అనగా ఆత్మ స్వరూపముగా మిగులుతుందని చెప్పారు. అసలు నేను అను తలంపు పుట్టిన తరువాతే ఈ నేనును ఆశ్రయించుకొనే మరెన్నో తలంపులు పుడతాయని కావున ఈ నేనెవరు అని నిరంతరం ప్రశ్నిస్తే ఈ నేను అదృశ్యమై నిజమైన నేను తెలుస్తుందని భగవాన్ చెప్పినారు. భగవాన్ దీనికొక ఉపాయాన్ని కూడా చెప్పినారు. నిద్రపోయే ముందు మరియు మేల్కొనిన తరువాత నేనెవడనని ప్రశ్నించుకోమన్నారు. ఈ నేను అనునది ఆత్మ నుండి పుట్టుకు వస్తుంది కనుక నేనుపై ధ్యాస ఉంచి నేనును పట్టుకుంటే ఆత్మలోకానికి వెళ్తామని భగవాన్ రహస్యాన్ని చెప్పినారు. **అసలు ఆత్మను తెలుసుకున్నవాడే నిజమైన పుట్టినవాడని ఆ రోజే పుట్టిన రోజని చెప్పారు.** కావున భగవాన్ సూచించిన దేమనగా ప్రతి మనిషిలో రెండు నేనులుంటాయని ఒకటి మిథ్యా నేను మరియొకటి సత్యమైన నేను. తన్ను తాను విచారించగా మిథ్యానేను అదృశ్యమై నిజమైన నేను మిగుల్తుందని ఇదే ముక్తి మరియు మోక్షమని భగవాన్ చెప్పారు. **కావున ముక్తి అంటే మరియు మోక్షమంటే అవేవో మనము మరణించిన తరువాత మరేదోలోకములో పొందుతామని కాదు. ప్రతివారు ఆ రెండు నేనులలో ఉన్న మిథ్యానేనును తొలగించుకొని అసలైన నేనును పట్టుకుంటే ఆ పట్టుకున్నవాడు తాను జీవించి ఉండగనే ముక్తుడౌతాడు. అనగా అతడే జీవన్ముక్తుడు. అతనికే మోక్షము కలిగినట్లు.** మరి ఈ మిథ్యానేనును వదులుటకు మరియు అసలైన నేనును

పట్టుకొనుటకు కావలసిన శక్తిని భగవాన్‌ని మనమందరము వేడుకుందాం. మనము జీవించి ఉండగనే జీవన్ముక్తులగుదాం. మోక్షమును పొందుదాం. కావున ఆ భగవానుని పరిపూర్ణముగా సర్వశ్య శరణాగతి అంటూ వేడుతూ ఓ భగవాన్ నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము - 36

భగవాన్ ఉవాచ - తరువాయి భాగం

భగవాన్ సంసారమనే పదానికి అర్థం చాలాగొప్పగా విశదీకరించినారు. సంసారమంటే మనస్సు సారమే అని దానిని విడిస్తే ఎక్కడ ఉన్న ఏదీకూడా బాధించదని భగవాన్ నొక్కి చెప్పారు. **ఒకసారి ఒక భక్తుడు అనునిత్యం దైవనామము జపిస్తూ ఉన్నప్పటికి అనేకమైన తలంపులు బయలుదేరుతున్నాయని భగవాన్‌కి తన బాధను చెప్పుకొనగా భగవాన్ అటువంటి సంధర్భములు ఏర్పడినప్పటికిని ఏ నామమైతే పట్టుకొని జపిస్తున్నావో ఆ నామాన్ని పట్టుకొనమని సలహా ఇచ్చినారు.** ఆ భక్తుడు తనకు కలిగిన అంతరాయంకు గలకారణం సంసారమని దానిని వదిలి వేద్దామని అనుకుంటున్నానని అని ఆ భక్తుడు **భగవానుని ప్రశ్నింపగా దానికి భగవాన్ "సంసారములోపల ఉన్నదా ? బైట ఉన్నదా ?" అని అనగా ఆ భక్తుడు భార్య పిల్లలు అదే సంసారమంటే అని అనగా భగవాన్ "వారేం చేశారండి. అసలు సంసారమంటే ఏదో తెలుసుకో. ఒకవేళ నీ భార్య పిల్లలును వదిలి ఇక్కడుంటే ఇదొక సంసారమని లేదా భార్య పిల్లలను వదిలి సన్యసించి కమండలము కర్ర మొదలగునవి పట్టుకుని తిరిగినచో అదొక సంసారమని కావున అసలు సంసారమంటే మనస్సంసారమే. ఆ సంసారాన్ని విడిస్తే ఎక్కడ ఉన్నా బాధించదు.** కావున ఆ మనస్సంసారము విడవటానికి ఏ నామమైతే జపిస్తున్నావో జపించేటప్పుడు తలంపులు వచ్చినపుడు చేసే జపం మరచి పోతున్నావని జ్ఞప్తికి తెచ్చుకుని ఆ జ్ఞప్తినే వృద్ధి చేసుకుని ఆ జపించే నామాన్నే పట్టుకుని ఉంటే తలంపులు బలం తగ్గి నామ జపం వల్ల ఉత్తములు అవుతామని ఎటువంటి ఆటంకాలు రావని" భగవాన్ విశదీకరించినారు. కావున దీనిని బట్టి మన మనస్సులో అలజడి చేసే తలంపులను ఎల్లప్పుడు వచ్చిన వెంటనే నొక్కిపెట్టవలెనని రహస్యాన్ని భగవాన్ తెలియజేశారు.

మరియొక భక్తురాలు ధ్యానం చేసుకుంటూ ఎల్లప్పుడు కూర్చోవాలనిపిస్తుందని కాని పని ఉండుటచే కుదురుట లేదని భగవాన్‌ని ప్రశ్నింపగా భగవాన్ **"మనస్సును ఉన్నచోటనే ఉంచి శరీరము పనిచేయనీ"** అని అన్నారు. ఆ భక్తురాలు మరొకసారి భగవాన్‌తో బంధాలు ఇంకా

వదలటం లేదని అనగా దానికి భగవాన్ **"వచ్చేదిరాని, పోయేది పోనీ. ఆ నేను అనేది ఏదో సరిగ్గా చూడగలిగితే ఎటువంటి బాధలు ఉండవని" భగవాన్ చెప్పినారు.**

ఇంకొకసారి ఒక భక్తురాలు భగవాన్ వద్దకు వచ్చి మోక్షం కావాలని మరేమీ అక్కరలేదని మోక్షమొక్కటిస్తే చాలని కోరింది. పైగా ఆ భక్తురాలు ఎప్పుడో ఇస్తేకాదని ఇప్పుడే ఇవ్వాలని అని అన్నది. ఆమె వెళ్ళిన పిదప భగవాన్ చుట్టూ ఉన్న భక్తులతో ఇట్లనినారు. **"ఏమీ వద్దని అన్ని విడిచిపెడితే ఉండేది మోక్షమే. ఇక ఒకరిచ్చేదేమి ? అది ఉండనే ఉంది కదా." అందులో ఉన్న మరియొక భక్తురాలు మాకు మోక్షం ఇవ్వాల్సిందే. మేము అందుకే వచ్చి ఉన్నాం అని అనగా భగవాన్, "అది మూటా, ముల్లెయా కట్టి ఇచ్చేందుకు ఇంక ఏమీ కోరరట. ఒక్క మోక్షమిస్తే చాలునట. అది మాత్రం కోరిక కాదు కాబోలు. ఉన్నవన్నీ పోగొట్టుకుంటే మిగిలేదే మోక్షం అవి పోగొట్టుకునేందుకే సాధన చేయాలని" భగవాన్ సూచించినారు.**

ఒకసారి భగవాన్‌కు విపరీతమైన కాళ్ళు నొప్పులు రావటంచే భక్తులు ఒక్కొక్కరు ఒక రకమైన సేవను అంటే కాళ్ళు వత్తేవారు ఒకరు, తైలం రుద్దేవారు మరొకరు ఇలా ఎవరికి తోచినట్లు వారు చేయుచుండగా భగవాన్ వారి సేవలను గమనించి ఇట్లనినారు, **"ఇంటికి చుట్టం వస్తారు. చూచి చూడనట్లుంటే త్వరగాపోతాడు. కాని మర్యాదలు చేస్తే వెళ్ళనే వెళ్ళడు. కావున వ్యాధి కూడా అంతే, మీరట్లా చేస్తూ వుంటే అది వదిలి ఎందుకు పోతుంది. లక్ష్యం పెట్టకుండా ఉంటే అదే పోతుంది. ఐనా ఇది కూడా ఒక విధంగా మంచిదే. మీరిలా నాకు కాళ్ళు వత్తుచుంటే వచ్చే జనం అంతా నన్ను చూసి ఈ స్వామి తానే కాళ్ళనొప్పులతో బాధపడుతుంటే ఇక మనకేం చేస్తాడని వచ్చినవారు వచ్చిన తోవలోనే పోతారు. కావున చేయండి"** అని భగవాన్ అన్నారు.

భగవాన్ నిజమైన నేనును గూర్చి ఇట్లనినారు, "నేను దేహం కాని పంచేంద్రియాలు, ప్రాణం, మనస్సు మరియు సుషుప్తికాదు. వాటన్నిటిని విడిచిపెట్టంగా మిగిలేది 'నేను' అది చైతన్యము అనే అదే సచ్చిదానంతమని ఆ స్థితిలో 'నేను' అన్న భావావేశం కూడా ఉండక మిగిలి ఉన్నదే మౌనమని అదే ఆత్మ అని చెప్పేవారు. కనిపించే సృష్టి, అహము మరియు ఈశ్వరుడు వీటన్నిటిని వేరువేరుగా తలుచుట భ్రాంతి అని భావాలకు మూలమైన మనస్సు మాయమైనచో

కనిపించే వస్తుజాలము కూడా పోవునని కావున మనస్సంటేనే భావాల సమూహమని అదొక శక్తి అని అది ప్రపంచంగా రూపము ధరించి కన్పిస్తుందని ఎప్పుడైతే ఆ మనస్సు ఆత్మలో లయమౌతుందో అప్పుడే నిజమైన తత్వం కన్పిస్తుంది. కావున నేనెవరిని అన్న చింతన కొనసాగిస్తుఉంటే భావాలకు సమూహమైన ఆ మనసు అదృశ్యమౌతుంది. ఏ పని చేసినా అహంకార రహితుడై నేను చేస్తున్నాననే భావన లేక తన అహాన్ని ఆత్మకు అంకితం చేయాలని భగవాన్ చెప్పినారు. కావున మనస్సు మాయమవుటకు కొన్ని పద్ధతుల ద్వారా దానిని నిశ్చలం చేయుటకు యత్నించినను అది తాత్కాలికమే అవుతుంది. కాని మళ్ళీ ఆ మనస్సులో తలంపులు వస్తూనే వుంటాయి. కావున అంతరంగములోకి చూస్తూ వెళ్ళినకొద్దీ అవి బలహీనమవుతాయి. అలా ఆత్మలో చొచ్చుకొని పోయేకొద్ది మనస్సు మాయమవుతుందని చివరికి అదే ఆత్మగా కనిపిస్తుందని భగవాన్ చెప్పినారు. ఒక ఆలోచన బైట పడినప్పుడల్లా దానిని ధ్వంసము చేయుటయే ఉపాయము. అంటే దానిని పుట్టే స్థానములోనే నశింపచేయాలి. నిరంతరము ఆత్మ గురించి చింతన చేయాలని భగవాన్ చెప్పారు.

భగవాన్ భగవంతుని గురించి కూడా ఒక అద్భుతమైన విషయాన్ని చెప్పారు. **భగవంతునికి ఏ సంకల్పము లేదని మరి ఏ పనైనా ఆయనకు సంబంధించినది కాదని ప్రపంచంలో జరిగేదేదైనా ఆయనని ప్రభావితం చేయదని సాక్షీభూతునిలాగా ప్రవర్తిస్తూ ఉంటాడని చెప్పారు. కాని జీవులకు మాత్రము వాటి ప్రభావము యధావిధిగా ఉంటుందని, భగవంతుడు నిర్ణయించిన క్రమానన్నుసరించి అనగా వారి వారి కర్మలననుసరించి వచ్చే ఫలితాలు వారివేగాని భగవంతునివి కాదని ఆ భగవంతుడు దానికి బాధ్యుడు కాదని భగవాన్ చెప్పినారు.**

ఈ విధంగా భగవాన్ సంసారమంటే, ధ్యానమంటే, మోక్షమంటే, నిజమైన నేను గూర్చి మరియు భగవంతుని గూర్చి కొన్ని ముఖ్యమైన రహస్యాలు చెప్పినారు. కావున మనము కూడా మనము సంసారంలోనే వుంటూ మనస్సంసారమును గురించి ఎరింగి, ధ్యానం గురించి మరియు అన్ని విడిచిపెడితే ఉన్నదే మోక్షమని తెలిసికొని మరియు నిజమైన నేనుగా గుర్తించుటకు కావలసిన శక్తి ఆ భగవానుని ప్రార్థిస్తూ శరణు వేడుదాం.

ఓ రమణా నీవే మాకు శరణు.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 37

భగవాన్ ఉవాచ తరువాయి భాగం

భగవాన్ కోరికలు లేకుండా ఉండటానికి ఒక సులువైన దారి చెప్పారు. **ఈ కోర్కెలు ఎవరికి ? అని ప్రశ్నించుకుంటే దానికి సమాధానంగా నాకు అని కోరుకునేవాడికి వస్తుందని వెంటనే నేనెవరు ? అని ప్రశ్నించుకోమన్నారు. తద్వారా ఆ కోర్కెలకు మూలమైన 'నేను' పడిపోతుందని చెప్పారు. మన దేహంలో కుడివైపున హృదయం వుంటుందని అదే ఆత్మ స్థానమని ఇక్కడినుండే నేను అను తలంపు మొట్ట మొదటగా పుట్టి అది శరీరంలోకి వచ్చి తద్వారా శరీరమే తానని భ్రాంతి కల్పించి సంసారచక్రంలో తగుల్కొని పరిభ్రమిస్తూ ఉంటుంది. ఇదే నేను గాఢ నిద్రలో తిరిగి పుట్టుక స్థానానికి వెళుతుందని భగవాన్ చెప్పారు.** కావున అది రాకపోకలతో కలిగి ఉండేది. గాఢ నిద్రలో ఏది తప్పో, ఏది ఒప్పో తెలియడం లేదు. కావున భగవాన్ చెప్పేదేమనగా మెలకువలో నిద్రపోవటం అభ్యాసం చేయమని అది ఆత్మలో నిలకడ చెందినపుడు మాత్రం మరియు చుట్టుప్రక్కలను మరిచినపుడు మాత్రము సాధ్యమవుతుందని భగవాన్ చెప్పినారు. కావున భగవాన్ చెప్పినది 'ఈ శరీరమే నేను' అనే భావన అజ్ఞానమని ఈ శరీరము ఆత్మకంటే భిన్నముకాదని ఆత్మేనను ఎరుక ఉండుటయే జ్ఞానమని భగవాన్ బోధించినారు.

భగవాన్ కర్మను గురించి ఈ విధముగా బోధించినారు. కర్మ అంటే ఒక పని. కర్మ కర్త అంటే పనిని చేసేవాడు. అలాగే కర్మ ఫలభోక్త అంటే ఆ పనికి కలిగే ఫలితాన్ని అనుభవించేవాడు. ఈ పనిని నేను చేశాను అనే భావం ఉన్నంతవరకు ఆ చేసిన పనికి వచ్చిన ఫలితమును అతడు అనుభవించవలెను. ఇదే ఆ పనిని చేసినది నేను కాదు అనే సంకల్పమున్న వారికి ఆ కర్మ ఫలితం తనకు అంటదు. కావున **భగవాన్ చెప్పినది కర్మ చేస్తున్నదెవరు ? అని ప్రశ్నించుకోమన్నారు. నేను కర్తను కాదు. ఒక శక్తి తన ద్వారా ఆ కర్మను చేస్తున్నదని గ్రహించినప్పుడు ఆ కర్మ ఎంతటిదైనను ఆ కర్త అయిన జ్ఞాని నిశ్చలుడై ఉండును.** దాని

ఫలితము అతనిని తాకదు. కావున భగవాన్ చెప్పినది తాను కర్తకాదు అనే జ్ఞానము కలవాడే నిజమైన సన్యాసి అని చెప్పినారు. మనస్సు, వాక్కు మరియు శరీరము ఈ మూడింటిని కర్మ త్రయములని ఈ మూడింటితో చేసే మూడు కర్మలు వాటి కర్తృత్వము అనగా కర్మ ఫలములు వదులు కున్నప్పుడు అనగా నేను చేస్తున్నాను అనే భావము కూడా వదిలినప్పుడు వాటి ఫలితము అంటదని భగవాన్ చెప్పినారు. భగవాన్ ఎల్లప్పుడు మౌనముగా ఉండేవారు. మౌనమే ఆత్మకు మరో పేరని చెప్పేవారు. మరియు భగవంతుడు, గురువు మరియు ఆత్మ ముగ్గురు ఒక్కటే అని కూడా చెప్తూ ఉండేవారు. **మనుష్యులు ఎల్లప్పుడు ఏవేవో ఊహిస్తూ తన పథకాలను ఒక ప్లానులా వేస్తూ ఉంటాడు. కాని భగవాన్ వేసిన ప్లాను ప్రకారము ఈ విశ్వమంతా నడుస్తుందని ఆ ప్లాను ప్రకారమే జరుగుతుందని భగవాన్ సూచిస్తూ ఉండేవారు. కావున అందరిని ఆ దైవాన్ని శరణువేడమని చెప్పేవారు.**

భగవాన్ సుఖాన్ని గురించి ప్రస్తావిస్తూ అసలు సుఖమంటే ఆత్మ స్వరూపమని **సుఖము మరియు ఆత్మ వేరు వేరు కాదని అవి ఒక్కటే అని చెప్పేవారు. మనస్సు ఆత్మవైపుకు తిరిగినపుడది ఆత్మ సుఖాన్ని పొందుతుందని అదే మనస్సు బాహ్యానికి వచ్చినప్పుడు దుఃఖానికి గురి అవుతుందని భగవాన్ సూచించారు.** ప్రపంచ వస్తువులలో అసలు సుఖమనేది లేదని చెప్పారు. దీనిని బట్టి మనస్సు ఎప్పుడు లోపలా బైట తిరుగుతుందని ఆ మనస్సును లోపలే ఉంచి బైటకు రానీయకుండా ఆత్మలోనే ఉండేటట్లు చేయుటయే సాధన అని భగవాన్ గొప్ప రహస్యాన్ని బోధించారు. సాధకుడు అహం వృత్తిని పట్టుకునే ఆత్మను చేరుతారని భగవాన్ చెప్పినారు. లోపల ఉన్న మనస్సు శుద్ధ మనస్సని అంటారు. భగవాన్ పనిచేసేవాళ్ళ గురించి ఒక పనిని ఎగ్గొట్టే వారి గురించి ఒక రహస్యాన్ని బోధించారు. అదేమనగా **పనిచేస్తాను చెయ్యను అని ముందే అనుకోవద్దని సూచించారు. ఎందుకంటే "నీకు పనిచేయవలసిన విధి లేకపోతే నీవు పనికై ప్రయత్నించిన దొరకదని అలాగే పనిచేయవలసిన విధి నీకు ఉంటే దానిని నీవు తప్పించుకోవాలని చూసినా ఆ పని నీకై వేటాడి నీచేత బలవంతముగానైనా చేయిస్తుందని" భగవాన్ చెప్పినారు.** ఆహా! ఈ విషయాన్ని ప్రతి వ్యక్తి తాను ఉద్యోగము చేయుచున్న సమయమున రమణుని ఈ మాటలను గుర్తుంచుకుని

ఉంటే ఆ ఉద్యోగికి తప్పకుండా ధైర్యంతోపాటు శాంతి కూడా లభ్యమవుతాయి.

కావున మనము కూడా భగవాన్ చెప్పినట్లుగా కోరికలు లేకుండా ఉండేందుకు, మెలకువలో నిద్రపోవుట అనే అభ్యాసాన్ని చేయుటకు, **ఏ కర్మనైనా చేసేది మనము కాదని ఒక శక్తి మనద్వారా చేయిస్తుందని, మనస్సును ఎల్లప్పుడు మనం అంతర్ముఖం చేసి ఆత్మ సుఖాన్ని పొందటానికి ప్రయత్నించవలెనని బాహ్య వస్తువులలో ఏదీ సుఖము కాదని, మనస్సును బైటకి పోనీయకుండా లోపలే ఉండేటట్లు ప్రయత్నిద్దాం.** మరియు ఏ పనైనా వచ్చినా దానిని తప్పించుకొనుటకు ప్రయత్నించకుండా భగవాన్ పనిని గురించి చెప్పిన బోధలను గుర్తుంచుకొని జీవనం గడుపుదాం. మరి ఇన్ని అభ్యాసాలు చేయటానికి సామాన్యమైన మానవులమైన మనము మనకున్న శక్తి సామర్ధ్యములు చాలవు కనుక ఆ భగవాన్ రమణుని శరణువేడుదాం. ఓ అరుణాచల శివా నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 38

భగవాన్ ఉవాచ తరువాయి భాగం

భగవాన్ ఉవాచ అంటేనే సాక్షాత్ భగవాన్ రమణ మహర్షి వారి నోటినుండి వెలువడిన అమృత తుల్యములై నటువంటి ప్రవచనం అమృతము మరెక్కడో దొరకదు. మహా పురుషుల ప్రవచనాన్ని శ్రద్ధగా విని పాటించుట మన ధర్మము. ఆ ధర్మాన్ని పాటించిన వాళ్ళందరూ అమృతాన్ని త్రాగినట్లే అమరజీవులుగా ఉన్నట్లే.

భగవాన్ సందేహాలు గురించి కొన్ని విషయాలు చెప్పారు. సందేహం ఎవరికైనా కలిగినప్పుడు ఆ సందేహాన్ని నివృత్తి చేయటానికి ప్రయత్నించక ఆ సందేహం ఎవరికి కలిగిందో తెలుసుకోమనేవారు. దృఢ నిశ్చయముతో ఆత్మలోనికి చొచ్చుకొని పొమ్మనేవారు. ఆ విధముగా చేయగా చేయగా మనస్సనేది మాయమై ఆత్మ ఒక్కటే మిగులును. అనగా మనస్సే ఆత్మగా మారిపోయిందని దాని అర్థం. కావున **మనస్సుకు ఆలోచనలను కలిగించే శక్తి ఉన్నదని గ్రహించవలెను.** ఈ ఆలోచనలను కొనసాగించకుండా ఆత్మలో చొచ్చుకొనిపోయే కార్యము కొనసాగుతునే ఉండవలెను. ఒక ఆలోచన వచ్చిన వెంటనే దానిని ధ్వంసము చేయవలెను. అనగా దాని జనన స్థానములోనే ధ్వంసము చేయవలెను. ఆ ఆలోచన పెరగకుండానే తుదిలోనే నరకమని దాని భావన. ఇలా ఆత్మ సాక్షాత్కారమయ్యే వరకు ఈ విధముగా చింతిన చేస్తూనే నిత్యము ఆత్మ గురించి తప్ప మరి ఏ ఇతర విషయములపై ధ్యాస నిలువకూడదు. **ఆలోచనలను జనన స్థానములో నశింప చేయుటయే వైరాగ్యమని** సూచించారు భగవాన్.

భగవాన్ భగవంతునికి ఏ సంకల్పము ఉండదని ఏ కార్యము అతనికి సంబంధించినది కాదని ప్రపంచములో ఏది జరిగినను ఆయనను ప్రభావితము చేయదని భగవాన్ సూచించారు. కేవలం సాక్షీభూతునిగా ఉంటాడని చెప్పేవారు. భగవంతుడే సృష్టి స్థితి మరియు లయకారకుడైనను **ఏ కార్యాలైనా ఎటువంటి సంకల్పముతోను మరియు ఒక ప్రయోజనము కొరకు భగవంతుడు చేయడు.** కాని సామాన్య జీవులకు మాత్రం వాటి ప్రభావము ఆ జీవులపై ఉంటుందని భగవంతుడు

నిర్ణయించిన ప్రకారము అనగా కర్మలననుసరించి ఫలితాలు జీవులవేగాని భగవంతునివికావు. ఆ కార్యాలకు భగవంతుడు బాధ్యుడుకాడు మరియు వాటి ప్రభావం ఆ భగవంతునిపై పడదని భగవాన్ చెప్పారు.

భగవాన్ రమణ మహర్షి గారు సాక్షాత్కారము గురించి విపులముగా వివరించారు. సామాన్యముగా సాక్షాత్కారమంటే దేవుడు మనముందు ప్రత్యక్షమవటం అని అనుకుంటాము. అంటే భగవంతుని దర్శించటమే సాక్షాత్కారమనే భావన. సామాన్యమైన మనము ఒక్కొక్కసారి దేవుడు ప్రత్యక్షం కాకపోయినా పరోక్షంగా దేవుడు వ్యవహరిస్తాడని అనుకుంటూ ఉంటాము. అదీ తప్పేనని భగవాన్ చెప్పేవారు. **భగవాన్ చెప్పినది ఏమనగా జీవన జ్యోతి మనిషిలో అతని చేష్టల ద్వారా వ్యక్తమవుతుందని ఆ జ్యోతి వల్ల ప్రభావితమైనప్పుడు ఎన్నో రకములైన చేష్టలు బైటపడతాయని చెప్పేవారు.** ఉదాహరణకు ఒక దీపం ఎదుట రంగుల గాజు పెంకు పెట్టినచో తెరమీద రంగుల బొమ్మలు కనిపించునట్లు. దీనిని బట్టి భగవాన్ చెప్పినది మనస్సనేది తెరవంటిదని ఆ తెరపై కాంతి మార్పుచెంది అతనికి భగవంతునికి కాంతికి నడుమ ప్రాపంచిక విషయాలు అడ్డుపడడం వల్ల మనస్సనుతెరపై స్వచ్ఛమైన కాంతి మార్పుచెంది ఆ కాంతి తగ్గుతుందని సూచించారు. తెరపై అనేక రంగులు పడునట్లు మనస్సుపై ఫలితాలు పడతాయని కావున ధృశ్యమానమైన ప్రపంచాన్ని తొలగిస్తే కనిపించేది ఒక జ్యోతి! అదే భగవంతుడని సూచించారు. కావున మనకు సందేహాలను కలిగించి మన మనస్సు ఊహించే ఆ ప్రపంచాన్ని తొలగిస్తే భగవంతుడనే జ్యోతే ప్రకాశిస్తుందని ఆ ప్రపంచాన్ని తీసివేయటానికి ఒక చిన్న చిట్కా కూడా భగవాన్ చెప్పారు. **మన కళ్ళ ఎదుట ఎవరైనా కనిపించినపుడు అతనిని మనిషి అని అనుకోకుండా దేహధారి అయిన భగవంతుడని అనుకోమన్నారు భగవాన్.**

భగవాన్ ఆరాధనను గురించి ఉత్తమమైన మార్గము చెప్పారు. సర్వస్వాన్ని భగవంతునికి అంకితం చేయటం వల్ల బుద్ధిపూర్వకంగా కాని మరి ఏ ఇతరమైనటువంటివిగా కాని చేసే ప్రతి కార్యము ఆలోచన భగవంతుని ప్రేరణ వలననే అని భావించమన్నారు. **అసలైన ఆరాధనంటే ఇదే తప్ప ప్రత్యేకమైన ప్రార్థనలు అవసరంలేదని భగవాన్ సూచించారు.**

కావున భగవాన్ నీవు స్వయం ప్రకాశమౌ ఆత్మవని నీవే సత్యమని, తేజమని, హృదయ కేంద్రమని, శక్తివని ఆ శక్తిని వేరుగా ఏమీ లేదని అదే మనస్సుని కల్పిస్తుందని ప్రారబ్ధాన్ననుసరించి వృత్తులు ఉదయిస్తాయని అదే మనస్సుపై నీకాంతి పడగానే వృత్తులన్ని మహా ప్రపంచముగా సాక్షాత్కరిస్తాయని అవి తెరపై బొమ్మలవలె కన్పిస్తాయని చెప్పారు. మొదట పుట్టిన భావం నేను, తరువాత నీవు, వాడు, అది మొదలగునవి వస్తాయి. ఇవన్ని ఎవరికి వస్తున్నాయని ప్రశ్నిస్తే 'నాకు' అనే జవాబు వస్తుంది. వెంటనే ఎవరు నేను ? ఎక్కడీ నేను ? అని అన్వేషించాలి. అలా అన్వేషణ చేయగా మూలస్థానమైన హృదయాన్ని చేరుకుంటామని ఆ మూలాన్ని చేరుకున్నవారికి ముక్తి సిద్ధించినట్లని అక్కడ ద్వంద్వాలైన సుఖదుఃఖాలు, పాప పుణ్యాలు అన్ని పోయి నీ దివ్య తేజస్సుముందు ఉన్న అన్ని భ్రమలు కూడా నశిస్తాయని భగవాన్ సూచించారు.

కావున మనకు కలిగే సందేహాలను నివృత్తి చేయుటకు, భగవంతుడు సాక్షీభూతుడనే విషయాన్ని గమనించి మనము కర్మలను భగవత్ అర్పితము చేసి కార్యఫలితాలను ఆశించకుండా ఉంటూ ఆ ధైర్యాన్ని ప్రసాదించుటకు, సందేహాల వల్ల ఊహించే మన మనస్సు కల్పించే ప్రపంచాన్ని మన నుండి తొలగించటానికి మన జీవన జ్యోతియే భగవంతుడని ఆ జ్యోతియే సాక్షాత్కారమని తెలుసుకొనుటకు, ప్రతి కార్యము భగవంతుని ప్రేరణవల్ల జరుగుతుందని నిశ్చయము కలుగుటకు మరియు ఆరాధన అంటే ఏమిటో తెలుసుకొనుటకు మనమే స్వయంప్రకాశకులము, ఆత్మ, తేజము, శక్తి, సత్యము మొదలగునవి అని గ్రహించుటకు కావలసిన దృఢ సంకల్పము, ధైర్యము, శక్తి, స్థిరత్వము కలుగుటకు భగవాన్ చరణాలకు నమస్కరిస్తూ సర్వశ్యశరణాగతి వేడుతూ వారి సంపూర్ణ ఆశీర్వచనములను తీసుకొనుటకు జ్ఞానులుగా మారుటకు శరణు వేడుదాం. భగవాన్ నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 39

భగవాన్ ఉవాచ తరువాయి భాగం

భగవాన్ నిజమైన మానవుడు ఎవరో అని చెప్పుటకు **ఎవరైతే నిరంతరము ప్రపంచములో తను కృషి చేసుకుంటూ ఏ కోరికలు ఉండకుండా ఆత్మస్ఫూర్తిలో నిమగ్నుడై ఉంటాడో అతడే నిజమైన మానవుడు అని భగవాన్ చెప్పారు. పైగా మానవుడే అసలైన సత్య స్వరూపుడని అది తెలుసుకోమని భగవాన్ సూచిస్తూ ఉండేవారు. కొందరు దైవాన్ని దర్శించుకోవాలని ప్రయత్నిస్తారని అది అవివేకమని ఎందుకంటే చూచే తనను చూడక భగవంతుణ్ణి దర్శించుకోవడం అది అవివేకముకాక మరేమౌతుంది అనేవారు భగవాన్. తనను చూచేవాడు దైవాన్ని చూసేవాడు. మిగిలినవన్నీ మానసికమైన దర్శనాలే** అని భగవాన్ చెప్పారు. మానవుడు తన మూలాన్ని అనగా తను పుట్టినచోటును చూసినపుడు చూచే తాను మిగలడని అనగా అదృశ్యమౌతాడని అప్పుడు చూశానని, చూడలేదని చెప్పటానికి ఇక ఎవరు ఉంటారని భగవాన్ అనేవారు. భగవాన్ మరియొక సూచన ప్రతీవారికి ఇచ్చారు. అది ఏమనగా ప్రతివారు ఒక పనిచేయటానికే ఈ భూమి మీదకు వచ్చారు. **"నీవు ఇష్టమున్నా ఇష్టము లేకపోయినా నీకు విధించబడిన పనిని భగవంతుడు నీచేత బలవంతముగా చేయించి తీరుతాడు" అని భగవాన్ చెప్పారు.**

ఒకరు భగవాన్‌ను కర్మయోగము గురించి ప్రస్తావించినపుడు **"తాను కర్తను కాదని తెలుసుకోవటమే కర్మయోగమని"** భగవాన్ జవాబు చెప్పారు. ఐతే కర్తలేనిచో కర్మ జరిగేదెలా అని తిరిగి ప్రశ్నించినపుడు భగవాన్ **"అహంకారములేని స్థితిలో కర్మ దానంతటికి అదే సాగిపోతుందని కావున నేను ఇది చేస్తాను, అది చెయ్యను అని ముందుగా నిర్ణయించుకోవద్దని" భగవాన్ సూచించారు.**

భగవాన్ మరియొక రహస్యాన్ని చెప్పారు. ఎవరైనా మనల్ని దూషిస్తే బాధపడుట సహజం. అటువంటి స్థితిలో ఏమిటి ఉపాయం అని అన్నదానికి భగవాన్ ఇచ్చిన జవాబు **"ఎవరైతే మనల్ని దూషించునో వాడే నిజానికి మన మిత్రుడు. ఎందుకంటే ఆ దూషించేవాడు దూషించునది**

ఆత్మజ్ఞానం విరోధియగు మన దేహాన్ని మాత్రమే. కావున నిజంగా మనం జాగ్రత్త పడవలసినది మనల్ని పోగుడుతున్నవారి గురించి."

భగవాన్ ఆత్మనుండి మొట్టమొదట నేను అనే తలంపు పుడుతుందని అది పుట్టగనే తల్లిని (ఆత్మని) మరచి శరీరమే తాను అనుకుంటుందని కనుక **భగవాన్ చమత్కారముగా నేను పుడుతూనే తల్లిని (ఆత్మను) హత్య చేస్తోంది.** ఈ నేనును భక్తితో తల్లిపాదాలముందు అర్పిస్తే ఆ జగజ్జనని నీలోనుండి వెలుగుతుందని కావున భగవాన్ సూచించినది ఏమనగా దేహమే తానని అనుకున్న ప్రతివారు తల్లిని చంపినవారే కావున 'నేనును' చంపినవాడే తల్లిని బ్రతికించినవాడని భగవాన్ చెప్పారు.

భగవాన్ మౌనానికి దానికి వ్యతిరేకమైన ఉపన్యాసానికి భేదం చెప్పారు. **ఉపన్యాసం కొందరికి మార్పును అది కూడా తాత్కాలికంగానే ఇస్తుందని కాని మౌనమనేది అందరికి శాశ్వతమైన పరివర్తనాన్ని అనుగ్రహిస్తుందని భగవాన్ చెప్పారు.**

మరియొకరు భగవాన్‌ని 'నేనెవరిని' అని విచారించేందుకు మన కర్మలను సన్యసించవలెను అని ప్రశ్నించగా భగవాన్ అసలు సన్యాసమంటే ఏమిటి అని ప్రశ్నించారు. **కూర్చొనుట, లేవడం, తిరుగుట, తినడం ఈ లెక్కన ఇవన్ని కర్మలే ఔతాయి కదా అని భగవాన్ ప్రశ్నించారు. మరి వీటన్నిటిలో దేన్ని విడుస్తారు ? అని చెప్పి భగవాన్ ఒక రహస్యాన్ని చెప్పారు. నేను కర్తననే అహంభావం విడువమన్నారు భగవాన్.**

మరియొక భక్తుడు ఒక్కొక్కసారి లౌకిక జీవనంలో "ఇది నాది" అని అనవలసి వస్తుందని మరి దానికి ఏమిటి పరిష్కారమని భగవాన్‌ని ప్రశ్నించాడు. భగవాన్ అలా అన్నంత మాత్రాన అన్ని నేను అనుకుని ఖేదమోదాలు చెందవలసిన పనిలేదన్నారు. ఉదాహరణకు ఒక బండిలో ప్రయాణించినంత మాత్రాన ఆ బండి నేనని అనుకోము కదా. అలాగే సూర్యుడు నీళ్ళ కుండలోను, నదిలోను, దర్పణములోను అన్నిట్లో ప్రతిబింబిస్తాడు. అన్నంతమాత్రమున అవన్ని తాను అనుకోడు కదా. అవి భిన్నమైనప్పుడే చింతిస్తాడు. మనము కూడా అంతేనని నేను దేహాన్ని కాదని అనుకుంటే సూర్యుడు వలె ప్రకాశిస్తూ ఉంటాడని భగవాన్ చెప్పారు.

మరియొక భక్తుడు నేను ఈ శరీరాన్ని ఎలా పొందానని ప్రశ్నించగా భగవాన్ “నేను శరీరమని అనటం వల్ల నేను వేరు శరీరం వేరు అన్న అర్ధం వస్తుందని నిజానికి ఈ ప్రశ్న శరీరానికి మటుకురాదని ఎందుకంటే శరీరం జడమని చెప్పారు భగవాన్. అదే నిద్రలో శరీరం ఎటువంటి స్పృహ ఉండకపోవుటచే ఈ ప్రశ్న రాదని కనుక మరెవరికి ఈ ప్రశ్న కలుగుతుందని ఆ కలిగేది అహంకారానికని కావున శరీరము అహంకారము ఒకేసారి పుడుతున్నాయని అవి రెండు ఒకేసారి అణుగుతున్నాయని **నిజానికి ఈ అహంకారం శరీరానికి ఆత్మకు మధ్యగ పుడుతుందని అది ఎక్కడినుండి పుట్టుక వస్తుందో అన్వేషించమని భగవాన్ చెప్పారు.**

మరియొక భక్తుడు భగవాన్‌ని హృదయాన్ని ఎలా గుర్తించటమని ప్రశ్నించగా భగవాన్ “నీవు ఆత్మకన్న భిన్నంగా ఉన్నావా ? **నీవు ఆత్మవే. ఆత్మయే హృదయం** అని జవాబు చెప్పారు. నిద్రలో నీ వున్నప్పుడు ప్రపంచము తోచకపోవటం అదే జాగృత్‌లో ఉన్నపుడు ప్రపంచం తోచటం జరుగుతుందని కావున ఇలా మనస్సులో ప్రపంచం ఒకసారి లేస్తు మరియొకసారి అణిగేది నిజమైన ఆత్మకాదని భగవాన్ సూచించారు. నిజానికి **ఆత్మలోనే మనస్సు పుట్టి పెరిగి లయిస్తుందని కావున ఆత్మే మూలమని చెప్పారు భగవాన్.** హృదయం తెలియని వారెవరు లేరన్నారు భగవాన్. ఎందుకంటే మనం ఎవరినైనా ప్రశ్నిస్తే నీవెవరివని అన్న వెంటనే దేహానికి కుడివైపున చూపుతూ ‘నేను’ అంటావు. ఆ కుడివైపున ఉన్నదే హృదయ స్థానం. దేహాన్ని మనస్సును ఆత్మగా భ్రమించిన వారికి దుఃఖము తప్పదన్నారు భగవాన్. **నిజానికి మనస్సు అంటేనే సంకల్పాని ఆ సంకల్పాలలో నేను అనేదే ప్రథమ సంకల్పమని ఆ సంకల్పాలను వేరుచేసి అంతర్ముఖం చేస్తే మనస్సు తన మూలమైన ఆత్మతో కలిసి ఆత్మే అయిపోతుందన్నారు భగవాన్.**

ఎన్నిసార్లు ఎన్నో విధాలుగా ఆత్మను గురించి అనర్గళముగా అర్థమయ్యేటట్లు ఉదాహరణలతో సహా భగవాన్ ఆత్మను గురించి చెప్పినప్పటికి మళ్ళీ ఒక భక్తుడు ఆత్మ అంటే ఏమిటి ? అని ప్రశ్నింపగా భగవాన్ ఇలా చెప్పారు. **“నిజానికి ఆత్మ ప్రతివారికి అనుభవమే. కాని అది స్పష్టముగా తెలియటం లేదు. నీవు ఉన్నావు కదా ? ఆ ఉండుట అనేదే ఆత్మ ‘నేను’ అనేది భగవంతుని మొదటి నామం. ఈ ఆత్మే భగవంతుడు. ఆత్మను తెలుసుకుంటే భగవంతుని**

తెలుసుకోవచ్చు. అసలు నిజమేమిటంటే ఆత్మను విడిచి భగవంతుడు లేడు" అని అనగా మరియొక భక్తుడు ఆత్మను పొందటానికి సన్యసించాలా అని ప్రశ్నించగా భగవాన్ సన్యాసం అంటే వదలటమని అర్థం. కావున ఆత్మను విడిచి ఎప్పుడైనా నీవు ఉన్నవా ? ఇక సన్యాసం అంటే వదలటం ఎక్కడ కావున ఒక్కసారి దైవానుగ్రహం పట్టినవానికి ఇక వదలదని ఆత్మ దర్శనం చేయిస్తుందని భగవాన్ చెప్పారు.

ఇలా చెప్తూ భగవాన్ ఆత్మను గూర్చి ఈ విధంగా ముగించారు. "ఆత్మ ఎక్కడ ఉన్నది అంటూ ఆందోళన చెందేవారు ఎందరో ఉన్నారు. వారికి నేనేం చెప్పేది. **ఉన్నదే ఆత్మ. అది అంతా నిండి ఉంది. దాన్నే హృదయమని** అంటారని చెప్పినా కూడా కొందరు నా హృదయంలో నేను నిలకడగా ఉండేందుకు స్థలం లేదని ఏం చెయ్యాలని ప్రశ్నిస్తారు **లేనిపోని వాసనలతో తన హృదయాన్ని (మనస్సు) నింపుకొని స్థలం లేదంటే ఆ వాసనలను తీసిపారేస్తే స్థలం ఎందుకుండదు. అంతా స్థలమే. అంతా ఆత్మే. ఇక తానంటూవేరుగా ఉండదు. ఇంక స్థలమెక్కడ ? ఉండేదెవరు** ?

భగవాన్ చెప్పిన అమూల్యమైన రహస్యాలు ఆత్మ అనే దానిగురించి అనర్గళముగా ప్రతికోణము నుండి అర్థమయ్యే విధముగా ప్రతివారికి ఉదాహరణలతో చెప్పారు. ఇక మనము ప్రత్యేకముగా ఆత్మను గురించి మన సొంత తెలివి తేటలతో వెతుకుట అనవసరం భగవాన్ చూపిన మార్గము గ్రహించి వారి బోధలు అనునిత్యము స్మరించి బాగా జీర్ణించుకొని వారి అడుగు జాడల వెంబడి నడిచిన చివరికి చిమ్మచీకటిలోనైనను వారు నేర్పిన బోధలు ఆ మార్గములో ఆ చీకటిలో కూడా వారి అడుగు జాడలను గుర్తుపట్టులాగా మనమందరము కృషిచేసి ఆ అతీతమైన శక్తి స్వరూపుడు అనంత జ్ఞానము కల్గిన ఆ మహాపురుషుని స్మరిస్తూ ధ్యానిస్తూ మనకి కూడా ఆ శక్తి రావాలని మనసా వాచా కర్మేణా భగవాన్ రమణ మహర్షుల వారిని శరణు వేడుకుందాం. ఓ రమణా, శ్రీ రమణా, జయ రమణా, గురుదేవ రమణా, ఆత్మా రమణా నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 40

(భగవాన్ ఉవాచ తరువాయి భాగం)

భగవాన్ వారివద్దకు వచ్చిన భక్తులకు చిత్రమైన విధములలో ఉపదేశాన్ని ఇస్తూ ఉండేవారు. అందులో కొన్ని –

ఒకసారి మహాశివరాత్రి పర్వదినమున ఒక సాధువు భగవాన్ వద్దకు వచ్చి దక్షిణామూర్తి స్తోత్రం దాని అర్థం గురించి చెప్పమని ప్రార్థించాడు. భగవాన్ ఆ వచ్చిన పెద్ద మనిషిని గంటల తరబడి కూర్చోపెట్టి మౌనముగా అందరివంకా చూస్తూ ఉండిపోయారు. అలా ఎనిమిది గంటలు మౌనంగా ఉండిపోయారు. **సుమారు 4 గం॥లకు భగవాన్ "దక్షిణామూర్తి స్తోత్రం అర్థం ఇప్పుడు తెలిసింది కదా." ఆ విధంగా మౌనంలో పరబ్రహ్మతత్వం దక్షిణామూర్తి స్తోత్రంలో పరమార్థాన్ని బోధించారు.**

ఒకసారి ఆశ్రమంలో అందరూ ఫలహారం కొరకు కూర్చుని ఉండగా భగవాన్ సుందరేశన్ భక్తుడిని కూడా వచ్చి కూర్చొనమనగా అతడు ఆ రోజు పితృతర్పణం రోజని చెప్పగా భగవాన్ ఇట్లనిరి. **"ఎందుకు పితృతర్పణం. నీ తల్లిదండ్రులు ఇదివరకే ఊర్ధ్వలోకానికి వెళ్ళారు. ఇప్పుడు నువ్వు తర్పణం వదిలి వాళ్ళని పైకి పంపవలసిన పనిలేదని తినమన్నారు. ఆ రోజునుంచి సుందరేశం అమావాస్య రోజున పితృతర్పణం చేయటం మానేశారు.**

మరొక భక్తునికి షోలాపూర్‌లో ఉద్యోగమురాగా భగవాన్ వద్దకు వెళ్ళి చెప్పి ఆశీర్వచనం తీసుకొనిన తరువాత ఆశ్రమం గడపదాటుటకు అతనికి మనస్సు ఒప్పక "భగవాన్ మిమ్మల్ని వదిలిపోలేనని" ఏడ్చెను. **అప్పుడు భగవాన్ అందరితో ఇట్లనినారు. "ఇరవై సం॥ల నుంచి ఇతను ఇక్కడ ఉండి తెలుసుకున్నది ఇది. ఈనాడు భగవాన్ లేని స్థలానికి వెళ్తున్నానని దుః ఖపడుచున్నాడు."**

మరొకసారి భగవాన్ పుష్పాలను మనుష్యులు ఉండనీయరని ఆ పూలను కోసి సూదులతో బాధిస్తారని **దేవుడికి అసలు పూలుకావాలా. ఆ పూలు చెట్టు మీద ఉంటే దేవుడివికావా అసలు**

తమని అర్పించుకోవటం బదులు ఇలాంటి అగత్యాలు చేస్తారని చివరకు పూలనిచ్చే చెట్లను రాత్రికూడా నిద్రపోనీయరని ఆ చెట్లకు ఏమీ మిగల్చరని అంత ఆశ మనుష్యులకెందుకని భగవాన్ వాపోయినారు.

మరియొక భక్తుడు భగవాన్‌తో ముందరలాగా భగవాన్ యొక్క రూపము. తన కళ్ళ ఎదుట కనిపించుట లేదని దానికి నివారణం ఏదని కోరగా **భగవాన్ నామము జ్ఞాపకముంటే చాలని అది రూపముకన్న గొప్పదని నామము కూడా తరువాత పోతుందని అంత వరకు నామాన్ని పట్టుకోమన్నారు.**

మరొకసారి ఒక భక్తుడు ఉద్యోగము కావాలని భగవాన్‌ని కోరగా **"నాకే వీళ్ళు (ఆశ్రమం వాళ్ళు) తిండిపెడితే తింటున్నాను. పొమ్మంటే నాకు గతిలేదు. ఇక నేను ఒకరికి ఉద్యోగమిచ్చేదేమిటి ?" అని అన్నారు.**

భగవాన్‌కి పెట్టిన భోజనం పారవేయుటమంటే ఇష్టముండేది కాదు. దానికి ఒక భక్తుడు పారవేయకపోతే భూతాలకి తృప్తి ఎలా కలుగుతుందని ప్రశ్నించగా దానికి జవాబుగా భగవాన్ **"నువ్వు భోజనం చేయక ముందేవాటికి తృప్తి చేయరాదు. నీ ఎంగిలితింటే కాని తృప్తి కాదా" అన్నారు భగవాన్.**

ఒకసారి భగవాన్‌కు ఒక ఉత్తరం వచ్చింది. అందులో ఆ ఉత్తరం వ్రాసిన వాని తల్లి వృద్ధురాలని తనను పోషించేందుకు జీతం సరిపోవటం లేదని జీతం పెరగవలెనని కోరినారు. భగవాన్ దానికి సరే అని అన్నారు. మళ్ళీ ఇంకొక ఉత్తరంలో అతను తనకు జీతం పెరిగిందని పై గ్రేడ్ ఇప్పించమని కోరినాడు. భగవాన్ దానికి కూడా సరి అన్నారు. తరువాత ఉత్తరంలో అతనికి పెళ్ళి అయితే భార్య వస్తుందని ఎందుకంటే అతని అమ్మ మంచాన పడిందని కరుణించమని కోరగా భగవాన్ మళ్ళీ సరి అన్నారు. కొన్నాళ్ళకు మరియొక ఉత్తరంలో పెళ్ళి అయిందని తన భార్యకు గర్భము వస్తే చూసి తన తల్లి పోతానంటుందని అనుగ్రహించమని కోరారు. భగవాన్ మళ్ళీ సరి అన్నారు. మరియొక ఉత్తరంలో సంతానం కలిగిందని కాని ప్రమోషన్ కావాలని కోరాడు. సరి అన్నారు భగవాన్. మళ్ళీ ఉత్తరంలో అమ్మపోయింది అని రాశాడు. తరువాత

ఉత్తరంలో బిడ్డ పోయినాడని రాశాడు. మళ్ళీ ఇంకొక ఉత్తరంలో భార్య గర్భవతియై బిడ్డను కని ఇద్దరూ పోయారని రాశాడు. చివరి ఉత్తరంలో అతను ఉద్యోగానికి సరిగ్గా హాజరు కాకపోవుటచే పనిలోంచి తీసేశారని తెలిపాడు. చివరికి భగవాన్ ఇట్లనినారు – **మధ్యలో వచ్చిందేదో పోయింది. మిగిలింది ఎప్పుడూ ఉన్నది తాను చివరికి మిగిలేదో అది అన్నారు.**

ఇంకొకసారి ఒకతను భగవాన్ కూర్చున్న హాలులోకి వచ్చి చంపుతానని భగవాన్‌ని బెదిరించగా భగవాన్ మనలాగా భయపడలేదు. పైపెచ్చు ఇలా అన్నారు, **"చంపునాయనా నాకీ దేహభారం తప్పిపోతుంది."**

పోస్టాఫీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఒకతనికి ఉన్న ఒక్కగానొక్క కొడుకు చనిపోగా ఆ దంపతులు భగవాన్ వద్దకు వచ్చి వచ్చే జన్మలోనైనా మా అబ్బాయిని చూస్తామా అని కోరగా భగవాన్ తప్పకుండా చూస్తావు అన్నారు. వారు వెళ్ళిపోయిన పిదప తక్కిన వారు భగవాన్‌తో అదెలా సాధ్యమని అడుగగా **భగవాన్ భగవద్గీతను తెప్పించి దానిలోనున్న ఒక శ్లోకము చదివించారు. దాని తాత్పర్యమేమనగా "ఎవరి అర్హతను బట్టి వారికి జ్ఞానమివ్వాలి. సిద్ధంకాని వారికి వేదాంతం బోధిస్తే అసలు వారి విశ్వాసమే నాశనమవుతుంది."**

మనస్సుని అరికట్టటానికి జ్ఞాన, భక్తి మరియు కర్మ మార్గాల ద్వారా చేయవచ్చునని అదెలా అంటే జ్ఞానమార్గం ద్వారా మనసును నేను కాను అని తెలుసుకుని మనసును నిరోధించమని కర్మ మార్గము ద్వారా ఏదో ఒక కర్మయందు మనసును లగ్నంచేసి దానివల్ల మనసు నిలిచిపోతుందని మరియు భక్తిమార్గము ద్వారా మనసుని ఇష్టదైవం మీదకి పోనిచ్చిన ఆ మూర్తియందు లగ్నమై నిలబడుతుందని భగవాన్ చెప్తూ అన్ని మార్గములలో భక్తి మార్గము సులభమని దాని ద్వారానే **ఎవరి ఇష్టదైవం వారి మనస్సులో తీరిక ఉన్నప్పుడల్లా ధ్యానించుకోమని దాని వలన మనసు నిలబడిపోతుందని చక్కటి రహస్యాన్ని భగవాన్ చెప్పినారు.**

ఒకసారి ఒక శవాన్ని పెట్టెలో పెట్టి తీసుకుని వచ్చి ఆ పెట్టెలో ఉన్న ఒక్కగానొక్క కొడుకును బ్రతికిస్తారనే ఆశతో భగవాన్ వద్దకు వచ్చారు. భగవాన్ మౌనంగానే ఉన్నారు. తెల్లవారి ఆ తల్లి విశ్వాసముతో ఎదురు చూచినా అది విఫలమైనది. ఆ మర్నాడు శవాన్ని దహనం చేశారు.

భగవాన్ ఇలా అన్నారు, **"విశ్వాసంతో చాలా దూరము నుంచి వచ్చారు. కాని ఒక్కణ్ణి బ్రతికిస్తే ఇక అంతం ఉంటుందా."**

ఒక భక్తుడు భగవాన్‌ని ప్రశ్నించుచుండగా ప్రక్కనున్న ఒక కుక్క మొరుగుచున్నది. ఆ భక్తుడు కుక్కను విసుక్కొనగా దానికి భగవాన్, **"ఆ కుక్క మొరగటం లేదు నీ మనస్సు మొరుగుతోంది" అన్నారు.**

ఈ విధముగా భగవాన్ చెప్పిన బోధనలు చెప్పుకుంటూపోతే ఎన్నెన్నో కలవు. సముద్రాన్ని అంతా తాగగలమా. ఆకాశన్నంతా ఒక్కసారిగా మొత్తం చూడగలమా అసాధ్యం. కొన్నింటిని మాత్రమే అవి కూడా భగవాన్ తన అనుగ్రహముచే వారి ఇచ్చానుసారముగా ఏవేవి చెప్పదలచినారో అవి మాత్రమే భగవాన్ నాకు సమయస్ఫూర్తితో ప్రసాదించుట వలన వాటినే సేకరించి ఇక్కడ సమకూర్చటమైనది. భగవాన్ ఉపదేశాలు ఎన్నెన్నో కలవు. భగవాన్ చెప్పిన అమూల్యమైన సంభాషణలను ఒక అభ్యాసముగా తీసుకుని విద్యగా నేర్చుకుని జ్ఞానిగా అవుటకు విజ్ఞానము పొందుటకు శక్తి సామర్థ్యాలను భగవాన్ నుండి వేడుకుందాం. ఓ రమణా నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 41

(జీవ కారుణ్యము మరియు గిరి ప్రదక్షిణము)

భగవాన్‌కు జీవులు అంటే ఎంతో దయ, ప్రేమ మరియు కరుణ కలిగియుండేవారు. జంతువుల మీద కూడా వారికి అనన్యమైన ప్రేమ కలిగిఉండేవారు. వారి ఆశ్రమములో అనేకమైన జంతువులు కూడా భగవాన్ ప్రేమను నోచి ఆ ఆశ్రమ బిడ్డలుగా పేరు పొందాయి. వల్లి అను ఒక జింక, కాకి, కుక్కలు, నెమళ్ళు, లక్ష్మి అనే గోవు, కోతులు, ఒక నల్ల ఆవు, చివరకు పులులు, చిరుత పులులు కూడా వారి ప్రేమను నోచుకున్నాయి. ఇవేకాక పిచ్చుకలు, ఉడుతలు, తేళ్ళు, పాములు, చీమలతో సహా భగవాన్ కరుణను పొందినవి. ఈ రోజుకు కూడా అరుణాచలం ఆశ్రమములో నెమళ్ళు, కోతులు, కుక్కలు కన్పిస్తూ ఉంటాయి. కొన్ని జంతువుల సమాధులు కూడా ఆశ్రమ ఆవరణలో ఉన్నవి.

13వ అధ్యాయములో గిరి ప్రదక్షిణ మరియు దాని మహాత్మ్యం గురించి తెలుసుకుంటిమి. భగవంతుడే ప్రసన్నుడై గిరి రూపములో కొలువు తీరి ఉన్నాడు ఆ ఈశ్వరుడక్కడ. కావున ఈ గిరికి ప్రదక్షిణ చేస్తే సాక్షాత్తు ఆ పరమ శివునికి ప్రదక్షిణ చేసినట్లే. భగవాన్ పిన్న వయసులోనే అనగా వారు తిరువన్నామలైకి వచ్చిన నాటినుండే అనేకసార్లు గిరి ప్రదక్షిణ చేసినారు. మహర్షివెంట భక్తులు కూడా గిరి ప్రదక్షిణకై వెళ్ళేవారు. భగవాన్ ఒక్కొక్కసారి రాత్రి బయలుదేరి తెల్లవారుఝామున వచ్చేవారు. ఒక్కొక్కసారి ఉదయాన బయలుదేరి రెండు రోజుల్లో తిరిగి వచ్చేవారు. దీనికిగల కారణం అనగా ఇంతకాలం పట్టుటకు కారణం భగవాన్‌ని భక్తులు అడుగగా **భగవాన్ గిరి ప్రదక్షిణ చేసేవారు అతి నెమ్మదిగా నిండు గర్భిణిలా చివరకు వారి అడుగుల సవ్వడి కూడా వినబడునట్లుగా ఆ గిరికి ప్రదక్షిణ చేయవలెనని భగవాన్ చెప్పేవారు. వారు గంటకి ఒక మైలు మాత్రమే నడిచేవారు. వారు ప్రదక్షిణ చేసేటప్పుడు ఆత్మానందభరితులై వేటిని పట్టించుకొనక శ్రద్ధగా చేసేవారు.**

ఈ గిరిచుట్టు రోడ్డు ఉంటుంది. దానికిరువైపుల ఎన్నో దేవాలయాలు చెరువులు చక్కటి

పచ్చని చెట్లతో కలకల లాడుతూ ఉంటుంది. కొందరు నదులలో స్నానము చేసి ప్రదక్షిణ ప్రారంభిస్తారు. దారిలో దేవాలయాలను దర్శించి పుణ్యాత్ములకు నమస్కరించి ప్రదక్షిణ చేస్తారు. మరికొందరు సాగిలపడి మ్రొక్కుతూ గిరి చుట్టు తిరుగుతారు. ఆత్మ ప్రదక్షిణ చేసే వారు కూడా ఉంటారు.

ఆ గిరిపై ఉన్న ప్రతి రాయి పరమశివుడే. ఆ గిరి పైనున్న చెట్టుచేమలు గడ్డిపోచ మట్టి పరమాణువుతో సహా సాక్షాత్తు పరమశివుడే. తేజోలింగరూపధారిగా గిరి రూపమున ఆ పరమశివుడు వెలసినాడక్కడ. **అదే కైలాసము, హిమాలయము, మానస సరోవరము ఆ గిరి చుట్టు భగవాన్ వారి దివ్య పాదములతో నడిచిన త్రోవ అది.** భగవాన్ ఆ గిరిపై కొన్నాళ్ళు స్కందాశ్రమములో మరియు విరూపాక్ష గుహలో ఉన్నట్లు ఇప్పటికి ఆ గుహను చూసే అవకాశము ఉన్నది. భగవాన్ ఆ గుహలో ధ్యానము చేసుకునేవారు. వారు కూర్చున్న గుహలో మనము కూడా వెళ్ళి కూర్చొని ధ్యానము చేసుకునే అవకాశము కలదు. ఆ గుహలో కూర్చొని ధ్యానము చేసుకుంటే చెప్పలేని అనుభూతి తప్పక కలిగి ధ్యానముపై ఏకాగ్రత కుదురుతాయి. ఆ గుహనుండి క్రిందికి చూచినచో తిరువణ్ణామలై ఊరు అంతా కనబడుతూ ఉంటుంది. అరుణాచల శివక్షేత్రం యొక్క గోపురాలు చక్కగా ఆ గుహనుండి కనపడుతుంది. ఎంతో ప్రశాంతమైన ఆనందము కలిగేచోటు అది. మనిషి తాను శరీరమును వదిలేలోగా తప్పక అరుణాచలం దర్శించి ఆశ్రమాన్ని చూసి గిరి ప్రదక్షిణ గావించి గిరిపైనున్న స్కంద మరియు విరూపాక్ష గుహలను చూచి అక్కడ కాసేపు ధ్యానం చేసే అవకాశము పొందుటకై ప్రతివారు ప్రయత్నించవలెను. అయితే మనము వెళ్ళాలనుకుంటే సరిపోదు. దానికి భగవాన్ అనుగ్రహము ఉంటే తప్ప అక్కడకు వెళ్ళలేము. **ధనము, బలము, కీర్తి, పదవులు ఎన్ని ఉన్నా అవి భగవాన్ ముందు ఒట్టివే.** కావున అరుణాచలము చూచుటకు శివదర్శనము కల్గుటకు గిరి ప్రదక్షిణ చేయుటకు రమణాశ్రమములో ధ్యానం చేసుకొనుటకు ఆ భగవాన్ ఆశీస్సులను కోరుతూ ఓ అరుణాచలవాసి శ్రీ రమణా, భగవాన్ నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 42

(భగవాన్ శ్రీ రమణ మహర్షి అవతారము ముగించుట)

భగవాన్ శ్రీ రమణ మహర్షి తన 16వ యేటనే ఆత్మ జ్ఞానమును పొందినారు. వారు దేహము అశాశ్వతమైనప్పటికి ఆ నశించే దేహములోనే శాశ్వతమైన అమృత తత్వమున్నదని "నేను" అనే ఆత్మ చైతన్యం ఒక శక్తిగా శరీరంలో నడుస్తూ ఉన్న శక్తికి కేంద్రమని ఆ నేను ఆ శక్తి ప్రవాహం వల్ల అన్నీ వారు చేస్తున్నారని గ్రహించారు. 'నేనెవరు' అనే విచారణ తమ 16వ యేట వారు భౌతిక దేహము మరణించినదని వారి దేహము ఒక శవములాగా పడివున్నా భగవాన్ తను జీవించి ఉన్నట్లు స్పష్టముగా తమ ఉనికి స్ఫురణలోనే ఉన్నారు. వారు నేను అని పలుకకుండా మరియే ఇతర పదాలను కూడా పలుకకక తమ నోరును గట్టిగా మూసి ఉంచినప్పటికి నేను ఉన్నాను, **నేను శబ్దం ఉంది. నేను అనేది ఉన్నది అని 'నాలోనే నాకు అనుభూతి పూర్తిగా ఉన్నది అదేమిటి ? అది ఒక శక్తి లేక ప్రవాహంగా తన శరీరాన్ని పనిచేయిస్తున్న శక్తికి కేంద్రముగా శరీరము జడమై గట్టిగా ఉన్నప్పటికి దానితో ఆ శరీరము పనిచేస్తున్నా దానితో సంధింపబడి ఉన్నట్లు అనిపించింది. ఆ శక్తి ప్రవాహం కేంద్రమే నేనుగా నన్ను కదిలిస్తుంది. పనిచేయిస్తుంది"** అని భగవాన్ గ్రహించారు. ఈ అభిప్రాయము తెలుసుకున్న తరువాత భగవాన్‌కు మరణం గురించి భయం పోయినది. దానికి మరణము లేదని ఇక భయపడనవసరములేదని భగవాన్ తెలిపారు. కావున భగవాన్ మరణించే ఈ అధ్యాయము తెలుసుకునే ముందు **భగవాన్ స్వయముగా వారే ఆత్మజ్ఞానము పొందిన తరువాత మరణమే లేదని కావున భయానికి ఇక చోటెక్కడని చెప్పినారు. కావుననే భగవాన్ మరణించలేదు. కాబట్టే నిర్యాణము, సమాధి అని కూడా అనకుండా ఈ అధ్యాయానికి భగవాన్ శ్రీ రమణ మహర్షి తమ అవతారమును ముగించినారని చెప్పబడినది.**

ఇలపై అవతరించిన మహాపురుషులు తమ కార్యములను నెరవేర్చిన పిదప ఏదో ఒక కారణమును చూపి వ్యాధి కలిగించుకుని తమ శరీరములను వదిలివేయుదురు. అది మాయా

ప్రభావము తప్ప నిజానికి అటువంటి మహాపురుషులకు వ్యాధులు సోకవు. కానీ సోకినట్లుగా చూపి ఏదో ఒక నెపముతో వారి శరీరములను విడిచెదరు. అలాగే మన భగవాన్ శ్రీ రమణ మహర్షి వ్యాధిగ్రస్తులై తమ ఆరోగ్యము రోజు రోజుకి క్షీణింపచేసుకుని 1947వ సం॥ములో మొదలైనవి వారి బాధలు. వారికి కీళ్ళవాతము, నడుముకి వీపుకి వ్యాపించి బాధపడుతుంటే భగవాన్ **"ఈ దేహమే ఒక వ్యాధి. ఆ వ్యాధికి నివారణ చూడాలి కాని ఈ వ్యాధికి నివారణ దేనికి** ? అని అంటూ ఏ మందులు వేసుకొనక మౌనముగానే ఉండేవారు. అలా ఒక సం॥ము కీళ్ళవాత బాధతో ఉండి 1948 వ సం॥మున భగవాన్ ఎడమ చేతికి ఒక కురుపు వచ్చి అది పెరిగి పెరిగి వస్తూ ఉంటే భక్తులు భగవాన్‌ని దాని గురించి అడిగితే **"లింగం పుట్టినదని అది స్వయంభూలింగమని" అనేవారు. డాక్టర్లు శస్త్ర చికిత్స చేయాలంటే భగవాన్ "ఎదిగితే ఎదుగుతుంది. మనకేమి దాని పని అది చూసుకుంటుంది. మనమెందుకు కదల్చటం"** అని అనేవారు. భగవాన్‌ని బలవంతముగా ఒప్పించి శస్త్ర చికిత్స చేశారు. ఐనా ఆ కురుపు మళ్ళీ పెరిగి పెద్దదైనది. అసలు భగవాన్ ఇంత జరిగినా నొప్పితో బాధపడుతున్నట్లుగాని అసలు వారి శరీరముపై కురుపు ఉందని కాని శస్త్ర చికిత్స బాధగాని పడినట్లు కనపడలేదు. అసలువారు ఒక శరీరమని అనుకుంటే కదా. రెండవసారి ఆపరేషన్ పెద్ద డాక్టర్లు చేశారు. భగవాన్ దానికి ఒప్పుకుని మళ్ళీ వస్తే చూచుకుందాంలే అన్నారు. ఆపరేషన్ ఐన తరువాత కూడా భగవాన్‌కి ఎటువంటి గుణము కనబడలేదు. ఆ పుండు మానకపోగా రక్తం కారుట మొదలైనది. చివరికది విషగ్రంధి అని నిర్ణయించారు. **ఒక డాక్టరు భుజంతో సహాకోసి వేయాలన్నారు. అప్పుడు భగవాన్ "ఇది తలపై లేచిన తలను కొట్టి వేయుదురు కాబోలు" అని అన్నారు.** పుండుకు ఎన్నో చికిత్సలు చేసినా తగ్గలేదు. ఒకరు భగవాన్‌ను ఇట్లు ప్రశ్నించారు, **"మీరు సంకల్పం చేసుకుంటే తగ్గిపోదా?" దానికి జవాబుగా "దానిని నేను రమ్మంటినా పొమ్మనుటకు" అన్నారు భగవాన్.** ఇంత బాధ పడుతున్నా చమత్కారం చేస్తూ వారికి చీమ కుట్టినట్లు కూడా అనిపించేదికాదు. వారి భావన వ్యాధి శరీరానికేకాని వారు శరీరము కాదని ఆత్మ అని తెలిసికొనుటచే వారు ఆ విషగ్రంధి తమ చేతిపై వచ్చినా ఎటువంటి బాధపడలేదు. కన్నీరు కార్చలేదు. భక్తుల బాధలను

ఓర్చుకొనలేక వారి తృప్తికొరకై శస్త్ర చికిత్స చేసుకున్నారు. వైద్యశాస్త్రము చదివిన డాక్టర్లను నొప్పింపక వారికోసము ఆపరేషను చేయించుకున్నారు తప్ప వారికి ఎటువంటి మోహము తమ శరీరముపై లేదు.

భగవాన్ బాధలను చదువుతుంటేనే మనకి ఎంతో బాధ కలుగుతున్నదే, మరి అంత బాధను స్వయముగా అనుభవించిన భగవాన్ మాత్రము ఏ చలనము లేకుండా ఆత్మ నిమగ్నులై యున్నారు. అటువంటి జ్ఞానము, నిబ్బరము, ధైర్యము, ఓర్పు, దేహ వ్యామోహము లేకుండుటలాంటి మహోన్నత శక్తిని ప్రసాదించమని భగవానుని వేడుకుందాం. ఓ రమణా నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 43

(భగవాన్ శ్రీ రమణ మహర్షి అవతారము ముగించుట తరువాయి భాగం)

భగవాన్ వారి చేతిపై వచ్చిన వ్రణము తద్వారా పొందిన భయంకరమైన చికిత్సలు రోజురోజుకీ వారి వ్రణబాధ వారు పడకపోయినా వారి భక్తులెల్లరు ఆ బాధను తట్టుకొనలేక భగవాన్ వద్ద మొరపెట్టుకుని సంకల్పముచేసుకుని వారినే నయము చేసుకోమని భక్తులు కోరగా భగవాన్ **"శరీరము ఒకటున్నదని ఆ శరీరానికి చేతులున్నవని అందులో ఒక చేతికి వ్రణం ఉందని మీరంటుంటే నేను విని ఆ దృష్టితో చూస్తే తప్ప లేకుంటే నాకేమీ తెలియడం లేదే ? ఎవరి కొరకు సంకల్పం తెచ్చుకోవాలి. నిజానికి మానవుడు సజీవంగా ఉన్నప్పుడు కూడా ఈ దేహం చచ్చినదే. ఎందుకంటే శరీరం నిర్జీవ పదార్థం కదా. దానికి ఆత్మఛాయ ఆవరించుటచే దానిలో చైతన్య క్రియాశక్తి కనిపిస్తుంది" అని అనగా భక్తులు "మా కొరకు సంకల్పం తెచ్చుకోండి" అని మళ్ళీ కోరగా భగవాన్ "తమరొకరున్నారా ఇక్కడ ? అంటే వారికి భేద దృష్టి ఏ మాత్రము లేదని తెలియుచున్నది.** వైద్యులు ఆ పుండులో వున్న చెడునెత్తురుని తీసివేయుటకై ఆ పుండును **జలగలచే కరిపించారు. అవి భగవాన్ చెడు నెత్తురుని పీల్చి పీల్చి ఆ కురుపుకు అంటుకుపోయి వ్రేలాడినవి.** నిజానికి అటువంటి బాధ ఎవ్వరూ భరించలేరు. భగవాన్ ఏ చలనము లేకుండా వైద్యులతో "ఆ జలగలు జ్ఞానుల్లాగా సమాధిలోకి పోయినట్టులన్నవే" అని అన్నారు. పైగా భగవాన్ **"ఆ వ్రణం ఎందుకు వచ్చిందో దాని పని అది చూసుకుంటుంది" అని చెప్పినా మీరు ఊరుకోలేదు. కత్తులతో కోసి మొదలు పెట్టుటవల్ల అది మీ పని ఇట్లా ఉందా అని బుస్సున పెరిగి కూచుంది. ఇక మీ ఇద్దర మధ్య యుద్ధమే. ఎవరు గెలుస్తారో మనదేం పోయింది?" అన్నారు భగవాన్ ఒక మధ్యవర్తిలాగా.** ఒక్కొక్కసారి ఆ విషగ్రంధి వల్ల భగవాన్‌కి చలి జ్వరం వచ్చేది. ఐనను భగవాన్ మామూలుగా హాల్లో వణుకుతూ కూర్చుండేవారు. భక్తులు భగవాన్‌ని చూచి అయ్యో శరీరం వణుకుతుందే అని అనుకొనగా భగవాన్ **"ఓహో శరీరమా వణుకుతున్నదా ? వణకనీ" అని అనేవారు పైగా అది నటరాజ తాండవమయ్యా దానికి ఎందుకు గాబరా**

అనేవారు. భగవాన్ ఇన్ని బాధలు ఉన్నప్పటికీ భగవాన్‌ని వైద్యం చేసే వైద్యులు తట్టుకొనలేక ఏడ్చారుకాని భగవాన్‌లో మటుకు ఎటువంటి బాధ పడలేదు. కొందరు భక్తులు భగవాన్ కోలుకోవాలని విశేష పూజలు చేస్తూ ఉంటే భగవాన్ **"అది మంచి పనే ధనవంతులకు కైంకర్యంమౌతుంది. బ్రాహ్మణులకు భోజనం లభిస్తుంది"** అని అనేవారు. చివరికి మూడవ ఆపరేషన్ కూడా జరిగినా ఏమీ మార్పు రాలేదు. అది తగ్గినట్లుగా తగ్గి పాత గ్రంధి ప్రక్కన ఇంకొక గ్రంధి కనబడి ఇది కూడా విషగ్రంధేనని గ్రహించి మళ్ళీ ఆపరేషన్ చేసినా ఉపయోగం లేకపోయింది. కొన్ని నెలల తరువాత ఇంకొక గ్రంధి కనబడింది. ఐనా భగవాన్ లెక్క చేయలేదు. రాను రాను వారి ఆరోగ్యంలో మార్పు రావుటచే వారు తమ దర్శనాన్ని హాలులోకి వచ్చి ఇవ్వకుండా వారున్న గదిలోనే ఉండి దర్శన మిచ్చేవారు. నాల్గవ ఆపరేషన్ కూడా చేశారు. దాని తరువాత వారికి వాంతి చేసుకుని ఇక ఆహారము తీసుకొనడం మానేశారు. 19.03.1950 తెలుగు ఉగాది పండుగ వికృతి నామ సంవత్సరము కావటం వల్ల ఆ ముందురోజు ఒక భక్తురాలు ప్రతి సం॥ము తన ఆనవాయితీ ప్రకారము ఒక తుండు గుడ్డ, కౌపీనము భగవాన్‌కు తెచ్చి ఉగాది ముందురోజు అనగా 18.03.1950 న ఇవ్వగా భగవాన్ **"ఓహో వచ్చిందీ ఉగాది ? వికృతి వచ్చిందీ"** అని అన్నారు.

భగవాన్ వారు తమ అవతారము కొద్దిరోజులలో చాలిస్తారనగా ఒక పార్సీ భక్తుడు తన మతం ప్రకారం ఉదయించే సూర్యుడికి నేను సాష్టాంగ పడుతున్నాను అని ప్రార్థించగా భగవాన్ వెంటనే, **"సూర్యుడు అస్తమిస్తున్నాడు. అదెట్లా సందర్భ పడుతుంది" అని ముందే సూచించారు.** ఇంకొక భక్తుడు ఒక ఆయుర్వేదం డాక్టర్ని పంపించగా భగవాన్ **"ఎంగిలి విస్తరిది ఎవరైనా జాగ్రత్త చేసుకుంటారా"** అని అన్నారు. ఏప్రిల్ 12వ తేదీ 1950వ సం॥న భగవాన్ మందు పుచ్చుకొనుట పూర్తిగా మానివేసినారు. ఏప్రిల్ మొదటి వారం నుండే ఆయనకు మందులు ఇవ్వటానికి భక్తులు వస్తే భగవాన్‌కి మందులన్న విసుగు వచ్చింది. 12వ తేదీన వారసలు మందే పుచ్చుకొనలేదు. ముందురోజు రాత్రి భగవాన్‌కి ఆయాసం రావటంచే వారి బంధువు మందు ఇవ్వగా **"రెండు దినములలో పోవు దానికి మందెందుకు?"** అని అన్నారు. అనగా

భగవాన్ ఏప్రిల్ 14, 1950 వ సం॥న వారు నిర్యాణము అవుతున్నట్లు ముందుగనే సూచించినా భక్తులు తెలుసుకొనలేకపోయినారు.

మహాపురుషులకు జనన మరణములనేవి ఉండవు. వారు ఎలా అవతరించినారో అలాగే తమ అవతారమును చాలించెదరు. వారు తమ దేహాన్ని వదిలే మునుపు కొన్ని సూచనలు ముందుగానే ఇస్తారు. మానవమాత్రులమైన మనము వాటిని గ్రహించలేము. భగవాన్ వారు పడ్డ బాధలు పై రెండు అధ్యాయాలలో చదివితేనే మనము తట్టుకొనలేక ఎంతో నొప్పి మన గుండెకు కల్గినట్లు కనబడుతుంది. **మనకి ఆ మహాపురుషులకి భేదం ఇదే.** స్వయముగా భయంకరమైన బాధను అనుభవించిన భగవాన్ ఎటువంటి బాధ వారి కళ్ళల్లో కన్నీరు కాని ఎక్కడ కనిపించలేదు. వారసలు ఒక దేహమని అనుకుంటే కదా అలాంటి బాధలు పడి దుః ఖించటానికి. మనము మనదేహముపై ఉన్న వ్యామోహంచేత చదివితేనే తట్టుకొనలేక అటువంటి బాధలు ఎవ్వరికి రాకూడదని అనుకుంటూ ఉంటాము. మామూలు జ్వరమువస్తేనే భయపడి పదిసార్లు ఒళ్ళు వేడిగా ఉన్నదా లేదా అని చూసుకుంటాము. చిన్న గాయం తగిలితే పెద్ద కట్టుకడతాం. ఇవన్నీ ఎందుకు చేస్తున్నాము అని ప్రశ్నించుకుంటే వ్యామోహం దేహముపై గల మమకారం ఇంకా ఇంకా జీవించాలని ఆశ. ఆ ఆశ ఉండాలికాని దేనిపైనను అని ప్రశ్నించుకుంటే భగవంతుడు ఇచ్చిన ఈ మానవ జన్మ సార్ధకము చేసుకోవాలని దానికై ప్రాపంచిక సుఖాలకు లోబడి అశాశ్వత వస్తువుల కొరకు అదే ఆనందం అని భ్రమించి మధ్యమధ్యలో ఇటువంటి రోగాలు కలిగినపుడు దేహముపైనున్న మమకారం చేత బాహ్య ప్రపంచము సుఖమని అనుకొనుటచే దుఃఖమునకుపాలై మరణం అంటేనే భయపడి ఇంకా జీవించాలని ఆ మాయాజాల ప్రపంచములోనే కొట్టుమిట్టాడుతూ జన్మిస్తూ మరణిస్తూనే ఉంటాడు తప్ప శాశ్వతమైన సత్యాన్ని, ఆ నేనును అంటే ఆత్మను తెలుసుకోడు. కావున దైవమిచ్చిన ఈ జన్మ సార్ధకము కావాలంటే దృష్టిని అంతర్ముఖము చేసిన వానికి శాశ్వతమైన నేనును అన్వేషించు వానికి అటువంటి ఆత్మజ్ఞానికి భగవాన్‌లాగా ఎటువంటి బాధలు వచ్చినా వాటిని పట్టించుకొనక నిరంతరం ఆత్మ నిమగ్నులై ఉండుటచే మరణమన్న వారికి భయం ఉండదు. **కాని మరణానికి అటువంటి**

జ్ఞానిని చూస్తే భయపడును. కావున నేను దేహమును కాను ఆత్మను నాకు మరణమే లేదు. ఈ రోగాలు బాధలు అన్నీ జడమైన శరీరానికి కేకాని ఆత్మకు కాదు అనే ఎరుక ధైర్యం అటువంటి బాధలు వచ్చినా తట్టుకొనే శక్తి భగవాన్‌ని చూసిన తరువాత ప్రతివారు నేర్చుకోవాలని ఆ జ్ఞానం సంపాదించుకోవాలని అంతటి శక్తిని పొందటానికి భగవాన్ శ్రీ రమణ మహర్షుల వారిని ప్రార్థిద్దాం. ఓ రమణా నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

అధ్యాయము 44

భగవాన్ రమణ మహర్షి అవతారం ముగించుట తరువాయి భాగం

ఏప్రిల్ 14, 1950 వ సం॥ము రానే వచ్చింది. ఆ రోజు భగవాన్ తమ అవతారము ముగించేరోజు. ముఖ్యమైన భక్తులు ఆ రోజు భగవాన్ కడకువచ్చి వారి ఆశీర్వచనము తీసుకుని కన్నీళ్ళు కార్చి వెళ్ళినారు. వైద్యులు కూడా అదే రోజున మళ్ళీ పరీక్షించి ఆశ వదులుకున్నారు. భగవాన్ నీరుతాగే పరిస్థితిలో కూడా లేరు కాని డాక్టరుగారి భార్య నారింజ రసం భగవాన్‌కు ఇవ్వాలని కోరిక ఉండుటచే భగవాన్ భక్తుల కోర్కెను తీర్చుటకై నారింజ రసమును ఇవ్వమని అడిగినారు. **ఆ రోజు కృష్ణ పక్ష త్రయోదశి శుక్రవారం. ఆ సాయంత్రం 4 గంటల నుండే భగవాన్ ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. భక్తులకు దర్శనమిచ్చే స్థితిలో లేరని గ్రహించి వారి గదికి ఒక తెరను అడ్డుగా వేశారు.** కాని కరుణామయుడైన భగవాన్ ఆ తెరను తొలగించమని సాయంత్రం 6 గంటల వరకు దర్శనము ఇస్తూనే ఉన్నారు. రాత్రి 8 గంటలు అయిన తరువాత భగవాన్‌కు ఇష్టమైన 'అక్షర మణిమాల' భక్తులు గానం చేయుచుండగా **ఆనాటి రాత్రి 8 గంటల 47 నిమిషములకు ఒక దివ్యకాంతితో గల జ్యోతి భగవాన్ ఉన్న గదిగోడనానుకుని పయనిస్తూ అరుణాచల గిరివైపు సాగినది. భగవాన్ తమ అవతారమును చాలించినారు.** ఆ జ్యోతి విషయము మరునాడు వార్తాపత్రికలలో వచ్చినది. ఆ జ్యోతి ఉత్తర దిక్కుగా పయనిస్తున్న ఒక నక్షత్రాన్ని గతరాత్రి 8 గంటల 47 ని॥ములకు అనేక ప్రాంతాలలో జనులు దర్శించారని చివరకు ఆ జ్యోతి అరుణాచలం పర్వతాగ్రము చేరినదని ప్రచురించారు. రమణాశ్రమములోని భక్తులందరు ఎంతో రోదిచారు. ఇక భగవాన్ లేరని అనుకున్నారు భగవాన్ భౌతికకాయాన్ని వారు ఎల్లప్పుడు కూర్చునే హాలులో కూర్చుండబెట్టి దర్శనార్థమునకై ఉంచారు. మర్నాడు ఉదయం భగవాన్ దేహానికి అభిషేకము చేసి మాతృ భూతేశ్వరాలయానికి ఉత్తరాన ఒక గుంటను త్రవ్వి భగవాన్ శరీరాన్ని కూర్చుండబెట్టి కర్పూరముతో, సుగంధ ద్రవ్యములతో నింపి సమాధి చేశారు. **భగవాన్ 1-9-1896 నుండి 14-4-1950 వరకు అరుణాచలంలోనే ఉన్నారు. భగవాన్ ఎక్కడికి పోలేదు. వారు సర్వాంతర్యామి.** భగవాన్ సజీవముగా ఉన్నప్పుడే భగవాన్ శ్రీరమణమహర్షుల నల్లరాతి విగ్రహాన్ని కూర్చున్ని వున్నట్లుగా ఉన్న ఆ విగ్రహాన్ని తయారుచేసి భగవాన్‌కు చూపినారు. అది ఆశ్రమములో భక్తులు చూడవచ్చు. వారిని నమ్ముకున్న వారికి ఇప్పటికి కూడా ఏ లోటూ

లేదు. ఆ శక్తి ఎక్కడికి పోలేదు. ఇప్పటికి కూడా ఎంతో మంది భక్తులు తిరువణ్ణామలైకి వెళ్ళి రమణాశ్రమంలో వారి సమాధిని దర్శించి ఎనలేని అనుభూతులను పొందుచున్నారు. భగవాన్ సమాధిపై కూడా లింగాన్ని స్థాపించినారు. ఇప్పటికి కూడా యధావిధముగా భగవాన్ ఉన్నప్పుడు ఏ విధముగా కార్యక్రమములు జరుగుతున్నవో ఇప్పుడు కూడా అవి జరుగుతూనే ఉన్నవి. నేటికి ప్రతిరోజు తెల్లవారు ఝామునే భగవాన్ సమాధిపై స్థాపించిన లింగానికి మరియు మాతృ భూతేశ్వర లింగానికి పూజలు, వేద పఠనములు, నైవేద్యములు, అన్నదానములు, పారాయణములు జరుగుతూనే ఉన్నవి. భగవానుని పరిపూర్ణముగా నమ్ముకున్న భక్తులకు భగవాన్ వారితో మాట్లాడుతూనేయున్నారు. వారి ఆశీస్సులు వారిని నమ్ముకున్న భక్తులకు ఇస్తూనే ఉన్నారు. సముద్రము కంటెను లోతైన స్వామి మహిమలను వారి జ్ఞానమును చెప్పటానికి లేదా రాయటానికి అంతటి సముద్రములో ఒక నీటి బొట్టు మాత్రమైన నేను (రచయిత) వారిని గురించి రాయటమంటే అది నేను అనే ఈ శరీరము లేదా వేరు గల జడమైన దేహము ద్వారా రాసినదికాదు. లోనున్న సత్యమైన నేను ద్వారా వ్రాసినదే. అది కూడా ఆ భగవాన్ ఆశీస్సుల వల్ల పైకి కన్పించే నేను కాదని తెలుసుకొనుట వలన ఒక నీటి బొట్టునైన నేను అంతటి సముద్రమంత, ఆకాశమంత, అనంతమైన కొలువలేని జ్ఞానిని గూర్చి సేకరించి వ్రాయటం ఊహించలేనిది. అది కేవలం ఆ అరుణాచలం దర్శించుకొని గిరి ప్రదక్షిణ చేసి భగవాన్ శ్రీ రమణ మహర్షి స్వామి వారి గురించి ఎన్నో పుస్తకాలు చదివి ఆ భగవాన్‌ను శరణు వేడిన పిదప వారి ఆశీస్సులుచే కొన్ని విషయాలు మాత్రమే చెప్పబడినది. ఆ అనంతుని గురించి నా బోటి వాడు ఎంత చెప్పగలడు! ఈ చెప్పిన వాటిల్లో కూడా తప్పు ఒప్పులున్న మన్నించమని భగవాన్‌ని వేడుతూ ఈ రచనలో నా ప్రమేయము ఏమీ లేకుండా భగవాన్ చెప్పినదే వారు నా నోటినుండి పలికించినదే తప్ప సొంతము జ్ఞానము ఏమీ లేదని గ్రహించవలసినది. ఈ నా శరణాగతి మరింతబలమై ఏ మాత్రం అహంకారంకాని మెప్పులకు పొంగిపోవుటకాని తప్పులకు కృంగిపోవుటకాని రాకూడదని భగవాన్‌ని శరణువేడుతూ భగవాన్ నీవే మాకు శరణాగతి.

అరుణాచల శివ

కోటంరాజు శ్రీనివాసరావు

1-9-129/16/1/బి/3,

రాంనగర్, హైద్రాబాద్, సెల్ : 9346823570

9848438884